మంగళవారం
19-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 58
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అడుక్కున్న డబ్బుతో భారీ విందు

ఇస్లామాబాద్: అడుక్కుని జీవించే ఒక కుటుంబం అందరినీ ఆశ్చర్య పరిచింది. భారీ విందు ఇచ్చింది. దీని కోసం రూ.1.25 కోట్లు ఖర్చు చేసింది. ఇది చూసి ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలతో పాటు కోటీశ్వరులు షాక్ అయ్యారు. పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాలో ఈ ఘటన జరిగింది. ఒక బిచ్చగాడి నానమ్మ ఇటీవల మరణించింది. దీంతో 40వ రోజు స్మారకం సందర్భంగా అతడి కుటుంబం భారీ విందు ఏర్పాటు చేసింది. స్థానికులను, తెలిసినవారిని దీనికి ఆహ్వానించింది. గుజ్రాన్‌వాలాలోని రహ్వాలీ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ నలుమూలల నుంచి సుమారు 20,000 మంది హాజరయ్యారు. సిరి పాయె, మురబ్బా వంటి సాంప్రదాయ వంటకాలతోపాటు వివిధ మాంసాహార వంటకాలను వడ్డించారు.

స్మార్ట్ మీటర్లు బిగించం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తిలేదని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టంచేశారు. సోమవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్‌శాఖలో రూ.1.29 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. పీపీఏలు రద్దు చేయవద్దని కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

లారెన్స్ బిష్ణోయ్ సోదరుడి అరెస్టు?

ముంబై: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ అమెరికాలో అరెస్టైనట్లు తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట కాల్పుల ఘటన సహా అనేక కేసుల్లో అన్మోల్ నిందితుడిగా ఉన్నాడు. ఇతడి సూచనల మేరకే ఇటీవల ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీని హత్య చేసినట్లు నిందితులు వెల్లడించారు. 2022లో హత్యకు గురైన పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలా కేసులో అనుమాని తుడిగా ఉన్నాడు. బాబా సిద్ధిఖీ హత్య కేసు నిందితులతో అన్మోల్ టచ్‌లో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అన్మోల్‌ను భారత్‌కు

- మిగతా 2 లో

మణిపూర్‌కు అదనపు బలగాలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మళ్లీ జాతుల హింస పెచ్చరిల్లిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి మరో 50 కంపెనీల సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలను పంపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మణిపూర్‌లో శాంతిభద్రతలను సమీక్షించారు. అక్కడి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మరో 50 కంపెనీల బలగాలను పంపాలని నిర్ణయించారు. 35 కంపెనీల సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్

- మిగతా 2 లో

అంబానీ, అదానీ మేలుకే మోదీ

- గొప్ప చెప్పుకునే విజయగాథ ఒక్కటీ లేదు
- మహారాష్ట్రను దోచుకునేందుకు ఇద్దరు గుజరాతీలు...
- రైతులను నట్టేట ముంచేందుకే మూడు నల్లచట్టాలు: రేవంత్

విశాలాంధ్ర- హైదరాబాద్: పదకొండేళ్ల పాలన తర్వాత కూడా ప్రధాని మోదీ ప్రభుత్వానికి గొప్పగా చెప్పుకోవడానికి ఒక్క విజయగాథ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వానికీ గుండెపై చేయివేసి చెప్పుకోవడానికి ఏ ఒక్క ప్రజోపయోగ పథకమూ లేదని ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా పుణేలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిసారి బాంబు పేలుళ్లు, ఇతర కొత్త కొత్త అంశాలను మోదీ ఎన్నికల ముందు తెరపైకి తెస్తున్నారని,రేవీ లేకనే వాటిపై ఆధారపడుతున్నారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికలకు ముందు రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, 2002కు ముందే దేశంలోని ప్రతి పేదవానికి ఇల్లు నిర్మిస్తామని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా వారికి వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చారని విమర్శించారు. 16 నెలల పాటు రైతులు ధర్నాలు, ఆందోళనలు చేశారు, 700 మందికిపైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రెండు కోట్ల ఉద్యోగాలపై లోక్‌సభలో ప్రశ్నించా కానీ కేవలం 7.50 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని సమాధానం ఇచ్చారని, అంటే పదకొండేళ్ల పాలనలో ఒక్క శాతం ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రైతులు, పేదలు, ఉద్యోగాల విషయంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హామీల అమలులో విఫలమైన మోదీ తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌ల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాము 50 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి రుణ మాఫీ చేశామని, మీరు ఎవరిని పంపినా ప్రతి రైతు ఖాతా వివరాలు అందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, తానే స్వయంగా నియామక పత్రాలు అందించానన్నారు. తెలంగాణలో మహిళలు రాష్ట్రంలో ఎక్కడకైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించామని, కోట్లాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని చెప్పారు. 2004లో సోనియా గాంధీ సూచన మేరకు దీపం పథకం కింద రూ.400కే గ్యాస్ సిలిండర్, స్టవ్ కేంద్రం అందజేసిందన్నారు. మోదీ ప్రధాని అయిన తర్వాత గ్యాస్ సిలిండర్‌ను రూ.1200కు పెంచారని మండిపడ్డారు. తెలంగాణలో 50 లక్షల పేద కుటుంబాలకు రూ.500కే సిలిండర్ ఇస్తున్నామని వివరించారు. రైతులకు 24 గంటలు, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలోనూ రానంత ధాన్యం దిగుబడి తెలంగాణలో ఈ ఏడాది వచ్చిందన్నారు. మొత్తం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది, ఎమ్మెస్పీకి అదనంగా రైతులకు ప్రతి క్వింటాకు తమ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించేందుకు దేశంలోనే మొదటి సారిగా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, దానిని తెలంగాణలో రూ.10 లక్షలకు పెంచినట్టు చెప్పారు. పేదల వైద్యానికి ఇప్పటి వరకు రూ.50 వేల కోట్లు తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మా గ్యారంటీలు కచ్చితమైనవి... మోదీ, భారతీయ జుటా పార్టీ గ్యారంటీలు కాదన్నారు. ముంబై దేశానికి ఆర్థిక రాజధాని, రాజకీయంగా రెండో పెద్ద రాష్ట్రం . అటువంటి రాష్ట్రాన్ని మోదీ కోవర్ట్ ఆపరేషన్లు, విద్రోహుల అడ్డాగా మార్చారని ఆరోపించారు. కార్యకర్తగా ఉన్న శిండేను బాలాసాహెబ్ మంత్రి వరకు తీసుకువస్తే ఆయన ఉద్ధవ్ ఠాక్రేకు వ్యతిరేకంగా మోదీకి గులాంగా మారారని, శరద్ పవార్ సొంత బిడ్డను కాదని సోదరుని కుమారుడు అజిత్ పవార్‌కు మంత్రి పదవులు ఇస్తే ఆయనా మోదీకి గులాంగా మారారని విమర్శించారు. అశోక్ చవాన్‌ను కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తే ఆయన కూడా మోదీకి గులాంగా మారారని మండిపడ్డారు. 12 కోట్ల మహారాష్ట్ర ప్రజలు... ఇది ఎన్నిక కాదు ఇదో యుద్ధం, గుజరాత్‌కు చెందిన ఇద్దరు మహారాష్ట్రను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆలోచించి ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీకి (ఎంవీఏ) ఓటు

- మిగతా 2 లో

గల్ఫ్ మృతులకు రూ.85 లక్షలు

రేపు బాధిత కుటుంబాలకు సీఎం ఎక్స్‌గ్రేషియా అందజేత 2లో

కొత్తగూడెంను తీర్చిదిద్దుతా

నియోజకవర్గాన్ని నంబర్ వన్ చేస్తా
అభివృద్ధి పనులకు కూనంనేని శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగూడెం పట్టణాన్ని అందరూ మెచ్చేలా... ప్రజలకు అన్ని సౌకర్యాలు ఉండేలా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16, 18, 21, 22వ వార్డుల్లో రూ.1.70కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. 17,19 వార్డుల్లో రూ.2.20 కోట్లతో పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. 36 వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పథకాలు, విద్యుత్ వంటి అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని వివరించారు. గత పాలకుల చేతుల్లో నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కమిషనర్ శేషాంజన్ స్వామి, డీటీ అంజద్ పాషా, డీఈ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, కౌన్సిలర్లు మాచర్ల రాజకుమారి, జి.కళ్యాణి, సత్యనారాయణాచారి, బండి నర్సింహా రావు, సత్యవతి, రాజ నళిని జయంతి, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, స్థానిక నాయకులు జి.నగేష్, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, పల్లపోతు సాయి, బత్తుల నాగరాజు, పైడిపల్లి లక్ష్మీ పాల్గొన్నారు.

మా లోపాలను దుర్మార్గులు వాడుకున్నారు

కెనడా ప్రధాని ట్రూడో పశ్చాత్తాపం 2లో

సంతాన పరిమితి
ఎత్తివేత

- ఇద్దరికి మించినా ఎన్నికల్లో పోటీ చేయొచ్చు
- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు మారుస్తూ చట్ట సవరణ
- మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లభిస్తోంది. దీనికి సంబంధించి గతంలో ఉన్న చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు 2024ను అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లును నాలుగు రోజుల క్రితమే మంత్రి నారాయణ సభలో ప్రవేశపెట్టారు. తాజాగా ఈ బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. కాగా, 1960 దశకంలో జనాభా నియంత్రణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర

- మిగతా 2 లో

అత్యాచారాలపై
మాటలయుద్ధం

- పరస్పర విమర్శలతో హోరెత్తిన మండలి
- వైసీపీ సభ్యులపై హోంమంత్రి ఆగ్రహం
- మంత్రి తీరుకు నిరసనగా వైసీపీ వాకౌట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై సాగుతున్న అత్యాచారాలు, హత్యల అంశంపై శాసనమండలి దద్దరిల్లింది. మండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో దీనిపై అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ సభ్యులు పరస్పర విమర్శల దాడికి దిగారు. మంత్రులు జవాబులిచ్చే సమయంలో వైసీపీ సభ్యులు అడ్డు తగులుతూ... ఉప ప్రశ్నలు వేశారు. అలాగే వైసీపీ సభ్యులు మాట్లాడుతున్న ప్పుడు కూటమి సభ్యులు అడ్డుతగిలారు. హోంమంత్రి అడిగిన ప్రశ్నలకు సమా ధానాలు ఇవ్వకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ రాజకీయ ఉపన్యాసం చేస్తున్నారని వైసీపీ అభ్యంతరం తెలిపింది. తొలుత మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు అంశంపై వైసీపీ సభ్యులు వరుదు కల్యాణి, టి.కల్పలత, చంద్రగిరి ఏసురత్నం ప్రశ్నలు అడిగారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, మహిళలు, ఆడ బిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దిశ చట్టాన్ని, యాప్‌ను నిర్వీర్యం చేయడంపై ప్రభుత్వం నుంచి వివరణ కోరారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత: హోంమంత్రి అనిత

ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ... మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిని అరెస్టు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ హయాంలో క్రైమ్ రేటు తగ్గిందని, అత్యాచార ఘటన లను రాజకీయ చేయొద్దని సూచించారు. నిర్భయ చట్టాన్ని పక్కన పెట్టి గత ప్రభు త్వంలో దిశ చట్టం తెచ్చారని, మహిళలపై అత్యాచారాలు జరిగినా పట్టించుకోలేదని,

- మిగతా 2 లో

రాజోనాకు క్షమాభిక్ష ప్రసాదిస్తారా?

- రెండు వారాల్లో తెలియజేయండి
- రాష్ట్రపతిని కోరిన సుప్రీం

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో మరణశిక్ష పడిన బల్వంత్ సింగ్ రాజోనా క్షమాభిక్ష అంశంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. అతడి పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కార్యదర్శిని ఆదేశించింది. దీనిపై రెండు వారాల్లోగా నిర్ణయం తెలియజేయాలని సుప్రీం ధర్మాసనం రాష్ట్రపతిని అభ్యర్థించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను డిసెంబరు 3వ తేదీకి వాయిదా వేసింది. సిక్కులకు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా 1995లో చండీగఢ్ సచివాలయం ముందు జరిగిన పేలుడులో అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్‌తో పాటు మరో 16 మంది మరణించారు. ఈ పేలుడులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బల్వంత్ సింగ్ రాజోనా ప్రమేయం ఉన్నట్లు రుజువు కావడంతో 2007లో అతడికి ప్రత్యేక న్యాయస్థానం మరణశిక్ష విధించింది. రెండు దశాబ్దాలకు పైగా రాజోనా జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ 2012లో రాజోనా కేంద్రాన్ని ఆశ్రయించాడు. అప్పటినుంచి అతడి పిటిషన్ పెండింగ్‌లోనే ఉంది. తన మరణశిక్షను జీవితఖైదుకు తగ్గించాలని కోరుతూ 2020లో రాజోనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం... మరణశిక్షను జీవితఖైదుగా మార్చలేమని గతేడాది మే నెలలో తేల్చిచెప్పింది. అయితే, అతడి క్షమాభిక్ష పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది.

ఇదీ లోకం!

తీవ్రస్థాయికి వాయు కాలుష్యం

- ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి... అమల్లోకి 'జీఆర్‌ఏపీ స్టేజ్-4'
- కఠిన చర్యలపై ఆలస్యమెందుకు? ఢిల్లీ సర్కార్‌పై సుప్రీం ఆగ్రహం
- కాలుష్యంపై బీజేపీ రాజకీయం: సీఎం ఆతిశీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతూ, గాలి నాణ్యత అధ్వానంగా మారడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో కాలుష్యాన్ని నివారించేందుకు కఠిన చర్యలు అమలు చేయడంపై ఎందుకు ఆలస్యం చేస్తున్నారంటూ ఆప్ ప్రభుత్వంపై మండిపడింది. దేశ రాజధానిలో వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300 కంటే ఎక్కువ పెరిగిపోతుంటే ఏం చేస్తున్నారు? అంత దాటే వరకు ఎందుకు వేచి చూశారని ప్రశ్నించింది. అలాగే.. స్టేజ్-4 ఆంక్షల అమలులో ఆలస్యం పైనా ఢిల్లీ ప్రభుత్వ తీరును సుప్రీం కోర్టు తప్పుబట్టింది. మూడు రోజులు ఆలస్యం ఎందుకు అయిందని అడిగింది. గాలి నాణ్యత 'సీవియర్ ప్లస్' కేటగిరీకి చేరిన దేశ రాజ ధానిలో... గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) అమలులో జాప్యం చేయడంపై ఢిల్లీ ప్రభుత్వంతోపాటు

- మిగతా 2 లో

ప్రచారానికి తెర

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికలకు అంతా సిద్ధం

ముంబై/రాంచీ: మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. నవంబరు 20న మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు జార్ఖండ్‌లో రెండో విడతలో 38 స్థానాలకు పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. 288 స్థానాలకుగాను మొత్తం 4,136 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో 2,086 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. మహారాష్ట్రలో 9,63,69,410 మంది నమోదిత

ఓటర్లు ఉన్నారు. అందుకే 1,00,186 పోలింగ్ బూత్‌లను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. దాదాపు 6 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల

- మిగతా 2 లో

విశాలాంధ్ర

మూడో ప్రపంచ యుద్ధం వైపు బైడెన్ యత్నం

రష్యా డ్యూమా ప్రతినిధి బూటినా

మాస్కో: అమెరికా తయారీ దీర్ఘశ్రేణి ఆయుధాలు రష్యాపై వాడేందుకు కీవ్‌కు అనుమతిచ్చి బైడెన్ ప్రభుత్వం ప్రమాదకర నిర్ణయం తీసుకొందని రష్యా డ్యూమా సభ్యురాలు మారియా బూటినా విమర్శించారు. మూడో ప్రపంచ యుద్ధం వైపు నెట్టే చర్యగా దీనిని ఆమె అభివర్ణించారు. 'పదవిలో ఉన్నంత కాలం బైడెన్ కార్యవర్గం ఉద్రిక్తతలను గరిష్ఠస్థాయిలో రాజేస్తుంది. ట్రంప్ వచ్చాక ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొంటారని ఆశిస్తున్నా. మూడో ప్రపంచ యుద్ధాన్ని ఎవరూ కోరుకోవడం లేదు. అమెరికాలో కొందరు తాము పోగొట్టుకోవడానికి ఏమీ లేదుగా అని భావిస్తుంటారు' అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద ఆమె వ్యాఖ్యానించారు. అమెరికాలో రష్యా ఏజెంటుగా పనిచేస్తోందనే ఆరోపణలపై బూటినా దాదాపు 15 నెలలపాటు జైల్లో గడిపారు. ప్రస్తుతం ఆమె యునైటెడ్ రష్యా పార్టీ తరపున డ్యూమా సభ్యురాలు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధగతిని మార్చేలా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదివారం ఓ నిర్ణయం తీసుకున్నారు. కీవ్‌కు తాము అందిస్తున్న దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపై దాడికి వినియోగించుకునేం దుకు అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రష్యాపైకి దీర్ఘ శ్రేణి క్షిపణులను ఉపయోగించుకోవడానికి ఉక్రెయిన్‌కు అవకాశం దక్కుతుంది. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. మరో వైపు ఈ నిర్ణయంపై రష్యా అధ్యక్ష కార్యాలయమైన క్రెమ్లిన్ ఇప్పటి వరకు స్పందించ లేదు. సెప్టెంబర్ 12వ తేదీన పుతిన్ మాట్లాడుతూ రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగాన్ని పశ్చిమ దేశాలు అంగీకరిస్తే... నాటో, అమెరికా, ఐరోపా దేశాలు నేరుగా యుద్ధంలో పాల్గొన్నట్లే భావిస్తామని తెలిపారు. దీంతో నాటో సైనిక, సాయుధ సంపత్తి లక్ష్యంగా దాడులు చేస్తామన్నారు. తాము నాటో, అమెరికా కోసం విభిన్నమైన ప్రతిస్పందనను సిద్ధం చేసుకొన్నట్లు తెలిపారు.

అణ్వాయుధాల తయారీకి సిద్ధం: కిమ్

ప్యాంగ్యాంగ్: అపరిమిత సంఖ్యలో అణ్వాయుధాలు తయారు చేయాలని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అమెరికాను అడ్డుకొనేందుకు ఈ వ్యూహం అనుసరించాలని సూచించినట్లు తెలుస్తోంది. అమెరికాలో ట్రంప్ ఎన్నికైన నాటినుంచి కిమ్ మరింత దూకుడు పెంచారు. ఇటీవల తన అధికారులతో ఉత్తరకొరియా అధినేత సమావేశమయ్యారు. దక్షిణకొరియాతో కలిసి అమెరికా అణ్వస్త్ర వ్యూహాలకు పదునుపెట్టడాన్ని ఖండించారు. జపాన్‌తో కలిసి ఆసియా నాటో ఏర్పాటుచేయాలన్న ఆలోచనలను ఆయన తీవ్రంగా పరిగణించారు. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు వాషింగ్టన్ సహకరించడాన్ని ఆయన విమర్శించారు. మాస్కోపై ఉక్రెయిన్‌ను పశ్చిమదేశాలు పావుగా వాడుకొంటున్నాయన్నారు. అమెరికా సైన్యం తన పలుకుబడి పెంచుకోవడానికి ఈ యుద్ధాన్ని ఆయుధంగా మలుచుకొందని ఆరోపించారు. ఇటీవల కాలంలో కిమ్-పుతిన్ బంధం బలపడింది. సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధానికి తెరతీసేలా ఈ యుద్ధంలో రెండు దేశాల సేనలు ఉక్రెయిన్‌పై పోరాడుతున్నాయి. రష్యాకు సహకారంపై ప్రత్యక్షంగా ఇప్పటివరకు కిమ్‌జోంగ్ ఉన్ బహిరంగంగా అంగీకరించలేదు. మరోవైపు దక్షిణ కొరియా, అమెరికాపై దాడి చేయడానికి అవసరమైన శక్తి సామర్థ్యాలను కిమ్ సేనలు వేగంగా పెంచుకొంటున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులను వేగంగా తయారుచేస్తోంది. కిమ్ సాయానికి ప్రతిగా రష్యాకు చెందిన నిపుణులు ఉత్తర కొరియా అణ్వాయుధాల అభివృద్ధి, క్షిపణుల తయారీలో సాయం చేస్తున్నారని ఇటీవల అమెరికా ఎన్ఎస్ఏ జాక్‌సులీవాన్ వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియా త్వరలోనే అణుబాంబు పరీక్ష నిర్వహించవచ్చని దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ సంస్థలు రెండు వారాల క్రితం నివేదికలు ఇచ్చాయి. దీనికి తగినట్లే తాజాగా కిమ్ ప్రకటన వెలువడంతో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు మరింత రాజేసినట్టైంది.

మా లోపాలను దుర్మార్గులు వాడుకున్నారు

కెనడా ప్రధాని ట్రూడో పశ్చాత్తాపం

అట్టావా: కెనడా వలసల నియంత్రణ విధానంలో సహేతుకతను ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడించారు. ఈ మేరకు ఏడు నిమిషాల వీడియో విడుదల చేశారు. కొందరు దుర్మార్గులు వ్యవస్థలోని లోపాలను వాడుకొని ప్రజలను దోచుకుంటున్నారని ట్రూడో ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యంగా అమాయకులైన వలసదారులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, డిప్లొమాలు పూర్తిచేయిస్తామని, పౌరసత్వం తేలిగ్గా లభిస్తుందని ఆశలు చూపి మోసం చేస్తున్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కరించడానికే సరికొత్త పాలసీ తీసుకొచ్చామన్నారు. దీనిలో భాగంగా రానున్న మూడేళ్లలో తాత్కాలిక, శాశ్వత నివాసాల కోసం వచ్చే వారి సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని చెప్పారు. కోవిడ్ తర్వాత ఉద్యోగుల కొరత తగ్గించేందుకు వలస విధానంలో చేసిన మార్పులను ఫేక్ కాలేజీలు, భారీ కార్పొరేషన్లు తమ లాభాల కోసం దానిని దుర్వినియోగం చేశాయన్నారు. 'తాత్కాలిక ఉద్యోగులు కూడా మా శ్రామికశక్తిలో భాగమయ్యారు. దీంతో మేము ఇమ్మిగ్రేషన్‌ను ప్లాన్ చేసేవేళ వారిని చేర్చకపోవడం తప్పవుతుంది. డిమాండ్ ఆధారంగానే మా వలస విధానం ఉంటుంది. ప్రస్తుత మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకొని దీనిని సమతౌల్యంగా ఉండేట్లు చూసుకోవాలి. చాలా సంస్థలు, పరిశ్రమలు వలస కార్మికులను ఆహ్వానిస్తున్నాయి. కానీ, ఇక్కడి హౌసింగ్, ఆరోగ్య సౌకర్యాలు, సోషల్ సర్వీస్ అంతే వేగంగా విస్తరించడం లేదు. వలస విధానంలో తాజా మార్పులతో ఇక్కడి కమ్యూనిటీలు లక్షల కొద్దీ ఇళ్లు నిర్మించి సిద్ధమయ్యేందుకు సమయం లభిస్తుంది' అని ట్రూడో వివరించారు. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను నియంత్రించడంతో టొరెంటో, వాంకోవర్ వంటి నగరాల్లో అద్దెల ధరలు దిగి వస్తున్నాయని ట్రూడో చెప్పారు.

అత్యాచారాలపై మాటలయుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ముచ్చుమర్రి ఘటనలో బాలిక మృతదేహాన్ని గుర్తించడానికి సమయం పట్టిందన్నారు. గతంలో మహిళలపై అత్యాచారాలు జరిగితే జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని, పరామర్శకు వెళ్లిన మాపైనే కేసులు పెట్టారని అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశ చట్టం గురించి గొప్పగా చెబుతున్నారని, అసలు దిశ చట్టం ఉందా.? గంజాయిపై ఐదేళ్లలో ఒక్క సమీక్ష అయినా చేశారా ?, అంటూ వైసీపీ సభ్యులను ప్రశ్నించారు. జగన్ తల్లి, చెల్లికి అన్యాయం జరిగినా అండగా ఉంటామని ఆమె వ్యాఖ్యానించడంతో ఒక్కసారిగా వైసీపీ సభ్యులు తమ సీట్లలో నుంచి లేచి...నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది. అనంతరం ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, బాధ్యతాయుత హెూంమంత్రి అనిత సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. తమ సభ్యులు అడిగిన ప్రశ్నకు హెూం మంత్రి స్పష్టంగా సమాధానం ఇవ్వని కారణంగా... ఆ ప్రశ్న వరకు సభ్యులు వాకౌట్ చేశారు. యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ మంత్రి మాటలను బొత్స వక్రీకరించారన్నారు. అనంతరం కర్నూలుజిల్లాలో కృష్ణానదిపై వంతెన నిర్మాణ అంశంపై సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నలకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లేదని బదులిచ్చారు. అంగన్‌వాడీ భవనాలు, బాలల సంజీవని పథకం అంశాలపై సభ్యులు వంకా రవీంద్రకుమార్, టి.కల్పలత అడిగిన ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానమిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4,977 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయని, జనవరి, 2024 నుంచి ఇప్పటి వరకు రూ.32.64 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మూత్రశాలలు లేకుండా 2,941 అద్దె భవనాలున్నాయని, సాధ్యమైన చోట్ల మరుగు దొడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని, అన్ని వసతులున్న వేరే భవనాలకు వాటిని మార్చుతున్నట్లు వివరించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గృహ విద్యుత్ వినియోదారులపై అదనపు భారం అంశంపై సభ్యులు దువ్వారపు రామారావు, భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరణ ఇచ్చారు. 2019- 2024 మధ్య కాలంలో గృహ వినియోగదారులపై టారిఫ్ నిమిత్తం మొత్తం రూ.1769.92 కోట్ల అదనపు భారం ఉందని, దాంతోపాటు ట్రూ అప్ ఎఫ్‌పీసీఏ చార్జీల నిమిత్తం రూ.5,851.82 కోట్లను విధించారన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనంపై సభ్యులు ఇసాక్ బాషా, మహ్మద్ రుహుల్లా అడిగిన ప్రశ్నలకు మైనార్టీశాఖ మంత్రి ఫరూక్ అబ్దులా సమాధానమిస్తూ, ఇమామ్, మౌజమ్ లకు గౌరవ వేతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉందన్నారు. కాగా వైసీపీ సభ్యులు తమ ప్రశ్నలకు సరిగ్గా సమాధానం ఇవ్వలేదని నిరసనకు దిగారు. దీంతో రాత పూర్వకంగా పంపాలని మంత్రికి చైర్మన్ సూచించారు. జాబ్ క్యాలెండర్, కార్పొరేషన్లు, ప్రభుత్వ శాఖల నుండి నిధుల మళ్లింపు, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు, రాష్ట్రంలో పయోజన విద్యా కేంద్రాలు అనే నాలుగు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పినట్లుగా శాసన మండలి చైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన అనేక బిల్లులను మండలి ఆమోదించినట్లు వెల్లడించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ సవరణ బిల్లు, ఏపీ విద్యుత్ రెండో సవరణ బిల్లు, ద్రవ్య వినిమయ తాత్కాలిక బిల్లులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. అనంతరం శాసనమండలిని మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

గల్ఫ్ మృతులకు రూ.85 లక్షలు

విశాలాంధ్ర-హైదరాబాద్: దురదృష్టవశాత్తు దేశంకాని దేశంలో కన్నుమూసిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఆదుకోవడానికి రూ.5 లక్షల 'మృతధన సహాయం' పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. గల్ఫ్ కార్మికులు ఆయురారోగ్యాలతో క్షేమంగా, సురక్షితంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో ఆకాంక్షించారు. ఈ నెల 20న వేములవాడలో జరగనున్న సభలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 17 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. దీనికోసం ప్రభుత్వం రూ.85 లక్షలు కేటాయించింది. ట్రెజరీ ద్వారా సొమ్ము వారి బ్యాంకు ఖాతాలలోకి నేరుగా బదిలీ అవుతుంది. గల్ఫ్ దేశాలలో చనిపోయిన ప్రవాస కార్మికులకు రూ.ఐదు లక్షల మృతధన సహాయం అందచేయడం దేశ చరిత్రలోనే ఇది ప్రథమం . 2023 అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన 'అభయ హస్తం'లో 'గల్ఫ్ కార్మికులు... ఎన్నారైల సంక్షేమం' కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో సెప్టెంబరు 16న జీవో 205 జారీచేసిన ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నదని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్, అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్ అన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం రూ.100 కోట్లు బాకీ: సింగిరెడ్డి

టీఆర్ఎస్- బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలంలో గల్ఫ్ దేశాలలో తెలంగాణ కార్మికులు సుమారు రెండు వేల మంది చనిపోయారు. పలు సందర్భాల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు గల్ఫ్ మృతులు ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని ప్రస్తావించారు. ఆ లెక్కన గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.100 కోట్ల మేర బాకీ ఉన్నారని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల్ఫ్ మృతుల వివరాలు... గంగిపెల్లి తిరుపతి, దుబాయి, యూఏఈ (బూరుగుపల్లి, బోయిన్ పల్లి), దాసరి బాబు, ఒమన్ (బోయిన్ పల్లి), కైర నాగయ్య, సౌదీ అరేబియా (చందుర్తి), పోతుగంటి భూమయ్య, సౌదీ అరేబియా (చందుర్తి), బైరి వెంకటేశం, ఇరాక్ (ఓబులాపూర్, ఇల్లంతకుంట), ఏనుగుల భాస్కర్, దుబాయ్, యూఏఈ (ఓబులాపూర్, ఇల్లంతకుంట), బోయిని గణేష్, దుబాయ్, యూఏఈ (వంతడుపుల, ఇల్లంతకుంట), కారవాని దేవయ్య, దుబాయ్, యూఏఈ (గంభీరావుపేట), ఇక్కుతి యెల్లం గౌడ్, దుబాయ్, యూఏఈ (నిమ్మపెల్లి, కొనరావుపేట), పిట్ల మహేష్, సౌదీ అరేబియా (వెంకటయ్య కుంట, ముస్తాబాద్), గెరిగంటి అంజయ్య, దుబాయ్, యూఏఈ (మల్లారెడ్డిపేట, ముస్తాబాద్), సిలివేరి నాంపెల్లి, ఒమన్ (రామన్నపల్లి, తంగళ్లపల్లి), దురిశెట్టి కొండయ్య, దుబాయ్, యూఏఈ (బాలానగర్, వేములవాడ), పెంద్యాల చంద్రకాంత్, దుబాయ్, యూఏఈ (నూకలమర్రి, వేములవాడ రూరల్), మాదాసు విజయ్, ఒమన్ (ఆచన్నపల్లి, వేములవాడ రూరల్), పల్లి అంజయ్య, బహ్రెయిన్ (అక్కపల్లి, ఎల్లారెడ్డిపేట), నిమ్మల రాజు, బహ్రెయిన్ (రాచర్ల బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట).

నిమిషాల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల సేవలు

ఆర్పీ సిసోడియా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆన్‌లైన్ ద్వారా నిముషాల వ్యవధిలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల సేవలు విస్తరించినట్లు రెవెన్యూ (భూపరిపాలన, సర్వే సెటిల్ మెంట్, విపత్తుల నిర్వహణ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కాని, మీ సేవా కేంద్రానికి కాని నేరుగా వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఈసీ, సీసీ వంటి సేవలు అందుకునే అవకాశం లభించిందన్నారు. తనకు అందుబాటులో ఉన్న ప్రాంతం నుంచి ఆన్‌లైన్ విధానంలో అవసరమైన రుసుమును స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెల్లించటం ద్వారా ఈసీ, సీసీలను క్షణాల వ్యవధిలో పొందగలుగుతున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో ఈ సేవలను పొందేందుకు ప్రతి ఒక్కరూ మీసేవా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆ శ్రమను సైతం తగ్గించాలని నిర్ణయించిందని, ఫలితంగా అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం సత్ ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు. నిర్ణీత దరఖాస్తును నింపి దానిని సబ్ రిజిస్ట్రార్ లేదా మీ సేవా కేంద్రానికి తీసుకువెళ్లవలసిన అవసరం లేకుండా పోయిందన్నారు. గతంలో ఎన్‌కంబరెన్స్, సర్టిఫైడ్ కాపీ సేవల కోసం మీసేవలో దరఖాస్తు చేసిన తరువాత, అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని, అక్కడ తగిన అనుమతులు పొందిన తదుపరి మీసేవలో జరిగే డౌన్ లోడ్ ప్రక్రియ ద్వారా మాత్రమే డాక్యుమెంట్ ను పొందగలిగే వారని, ఫలితంగా కాలయాపన జరిగేదని తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తన వెబ్ సైట్ ద్వారా చెల్లింపు గేట్ వే ను అభివృద్ధి పరిచిందని, ఇది మంచి పనితీరును ప్రదర్శిస్తూ ఉండటంతో ఎన్‌కంబరెన్స్, సర్టిఫైడ్ కాపీలు ఆన్‌లైన్‌లో తక్షణమే పొందగలిగే వెసులుబాటు లభించిందని తెలిపారు.

రూ.1082 కోట్ల విలువైన ఎన్నికల తాయిలాలు స్వాధీనం

న్యూదిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల్లో అధికారులు జరిపిన దాడుల్లో పెద్ద ఎత్తున నగదు, వస్తువులు పట్టుబడ్డాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వివిధ రాజకీయ పార్టీలు చేసే ప్రయత్నాలను అడ్డుకొనేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రూ.1082 కోట్ల విలువైన ఎన్నికల తాయిలాలను సీజ్ చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు మొత్తంగా రూ.1082.2 కోట్ల విలువైన ఎన్నికల తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ తెలిపింది. సీజ్ చేసిన దాంట్లో రూ.181.97 కోట్లు నగదు కాగా.. రూ.119.83 కోట్ల విలువ చేసే మద్యం, రూ.123.57 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ.302.08 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.354.76 కోట్ల విలువైన ఉచితాలు, ఇతర వస్తువులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తంగా రూ.1082.2 కోట్లు సీజ్ చేయగా.. ఇందులో మహారాష్ట్రలో రూ.660.18కోట్లు.. జార్ఖండ్‌లో రూ.198.12కోట్లు, 14 రాష్ట్రాల్లోని ఉప ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో రూ.223.91 కోట్లు ఉన్నట్లు ఈసీ వివరించింది.

అంబాని, అదాని మేలుకే మోదీ

(మొదటిపేజీ తరువాయి)

వేయాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీ రిజర్వేషన్లు చట్టపరంగా చేయాల్సినవని, తెలంగాణలో తాము నాలుగు శాతం అమలు చేస్తున్నామని, ఇక్కడ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చర్చించి నిర్ణయం తీసుకుంటాంని విలేకరులు అడిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్‌లో విభేదాలంటూ బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ తప్పుడు ప్రచారం చేస్తోం దన్నారు. మోదీ ... అంబాని, అదాని కోసం పని చేస్తారు... ఇప్పుడు అంబాని కూడా లేరు. అదాని ఒక్కరి కోసమే పని చేస్తున్నారని, అదానికి మహారాష్ట్రను పూర్తిగా దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో 95 శాతానికిపైగా ప్రజలు హిందువులు, వారు బీజేపీకి ఓటు వేయలేదు, కాంగ్రెస్‌కు వేశారు. అలాగే మహారాష్ట్రలోనూ కాంగ్రెస్‌ను ఆదరిస్తారనే నమ్మకం ఉందన్నారు. మోదీ ... కార్పొరేట్ కంపెనీలకు రూ.16 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని, అదే మేం రైతులకు రుణమాఫీ చేస్తే బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

మణిపూర్‌కు అదనపు బలగాలు

(మొదటిపేజీ తరువాయి)

(సీఆర్పీఎఫ్), 15 కంపెనీల సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) బలగాలను పంపనున్నారు. కాగా, మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో చెలరేగిన హింసాకాండ ఇతర ప్రాంతాలకు విస్తరించింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో కేంద్ర బలగాలను మోహరించడం ఇది రెండోసారి. నవంబర్ 12న కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరో 20 సీఏపీఎఫ్ (15 సీఆర్పీఎఫ్, 5 బీఎస్ఎఫ్) యూనిట్లను మణిపూర్‌కు పంపింది. దీంతో ఆ రాష్ట్రంలో ఇప్పుడు 218 కంపెనీల బలగాలున్నాయి.

లారెన్స్ బిష్ణోయ్ సోదరుడి అరెస్టు?

(మొదటిపేజీ తరువాయి)

రప్పించే ప్రక్రియ ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ ప్రత్యేక న్యాయ స్థానంలో ముంబై పోలీసులు ఇటీవల పిటిషన్ వేశారు. లారెన్స్ తరపున అన్మోల్ చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో భాగమయ్యాడని అందులో పేర్కొన్నారు. దీంతో అతడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. దీంతో అన్మోల్ కదలికల గురించి అమెరికా అధికారులు ముంబై పోలీసులను అప్రమత్తం చేయగా... తాజాగా కాలిఫోర్నియాలో అతడు అరెస్టు అయినట్లు సమాచారం.

స్మార్ట్ మీటర్లు బిగించం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని వివరించారు. పెట్టుబడులు వెనక్కి వెళతాయన్న హెచ్చరికలను పట్టించుకోలేదన్నారు. సుంకం పెంపుతో వ్యవసాయ, వాణిజ్య రంగాలపై అదనపు భారం పడదన్నారు. వ్యవసాయ కేటగిరీలపై ఈ వ్యవధిలో ట్రూఅప్/ఎఫ్‌పీసీఏ చార్జీలు పెంచడంతో మొత్తం రూ.2189 కోట్ల సుంకం విధించామన్నారు. వాణిజ్య కేటగిరీల వినియోదారుల నుంచి ట్రూఆప్/ఎఫ్‌పీసీఏ చార్జీల నిమిత్తం మొత్తం రూ.1797.43 కోట్లకు విధించారని వివరించారు. 2019-2024 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమల రంగంపై సుంకం పెంచినందున రూ.768.78 కోట్ల అదనపు భారం పడిందని తెలిపారు. పారిశ్రామిక వినియోగదారులపై ఈ వ్యవధిలో ట్రూఆప్/ఎఫ్‌పీసీఏ చార్జీల నిమిత్తం మొత్తం రూ.7188.79 కోట్లకు విధించామని వివరించారు.

సంతాన పరిమితి ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ పథకాలు ప్రవేశపెట్టాయి. కుటుంబ నియంత్రణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో భాగంగా పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారిని అనర్హులుగా చేస్తూ చట్టంలో సవరణలు చేశారు. 1955 మున్సిపల్ కార్పొరేషన్ల చట్టంలోని సెక్షన్ 21 బి, 1965 మున్సిపాల్టీల చట్టంలోని సెక్షన్ 13బిలను చొప్పిస్తూ ఏపీ మున్సిపల్ శాసనాల సవరణ బిల్లు 1994ను తీసుకొచ్చారు. 1994లో జరిగిన ఈ సవరణల ప్రకారం ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం కలిగిఉన్న వారు పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. అప్పటి నుంచి ఇదే విధానం కొనసాగుతూ వస్తుంది. అయితే మూడు దశాబ్దాలలో జనాభా నియంత్రణ కోసం తీసుకున్న చర్యలతో సంతానోత్పత్తి సామర్థ్యం రేటు బాగా తగ్గిపోయింది. 2001లో 2.6 నుంచి 1.5కు తగ్గింది. జనన, మరణాల నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్ బాగా వెనుకబడిపోయింది. తద్వారా జనాభా వృద్ధిరేటు బాగా తగ్గిపోయింది. ఇదే సమయంలో వృద్ధుల జనాభా రేటు ఎక్కువగా ఉంది. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా జనాభాను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఉద్దేశంతోనే చట్టంలో సవరణలు చేయాల్సి వచ్చింది. దీని ప్రకారం గతంలో ఆయా చట్టాల్లో చేసిన సవరణలకు సంబంధించిన సెక్షన్‌లను తొలగిస్తూ ఏపీ మున్సిపల్ శాసనాల చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదముద్ర వేసింది.

తీవ్రస్థాయికి వాయు కాలుష్యం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర కమిషన్‌ను (ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్)ను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. న్యాయస్థానం అనుమతి లేకుండా జీఆర్ఏపీ -4 కఠినమైన చర్యలను తగ్గించడానికి వీలులేదని తేల్చి చెప్పింది. గాలి నాణ్యత సూచీ 400 దిగువకు చేరినా సరే- కాలుష్య నివారణకు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు 'జీఆర్ఏపీ స్టేజ్ -4' చర్యలే కొనసాగించాలని అధికారులకు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుందో తెలియజేయాలని స్పష్టం చేసింది. చాలా ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటిందని.. 400 దిగువన ఉన్నా ఆంక్షలు అమలు చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది.

ప్రమాదకర స్థాయికి వాయు నాణ్యత

దేశ రాజధానిలో గాలి నాణ్యత మరింత దిగజారి 'సివియర్ ప్లస్' స్థాయికి పడిపోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి లెక్కల ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు గాలి నాణ్యత 483గా నమోదైంది. మధ్యాహ్నానికి ఇది మరింత తీవ్రమైంది. ద్వారక, ముండ్కా, నజాఫ్‌ఘర్ ఏరియాల్లో ఏక్యూఐ స్థాయిలు గరిష్ఠంగా 500 మార్కును తాకాయి. కాళిందీ కుంజ్ ప్రాంతంలోని యమునా నదిలో హానికరక నురుగు తేలుతూ కనిపించింది. దిల్లీ వాసులు శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కళ్లలో మంట, చికాకుగా ఉందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. దగ్గు, జలుబు వేధిస్తున్నాయని మరికొందరు చెబుతున్నారు. దిల్లీ రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ -4ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అత్యవసర, నిత్యావసర వస్తువులను తీసుకువెళ్లే ట్రక్కులు మినహా దిల్లీలోకి అనవసరమైన ట్రక్కుల రాకపోకలను నిషేధించారు. ఎల్ఎన్+, సీఎన్జీ, ఎలక్ట్రిక్, బీఎస్-6 డీజిల్ ట్రక్కులను మాత్రమే అనుమతిస్తున్నారు. నిర్మాణాలు, కూల్చివేత కార్యకలాపాలపై నిషేధం కొనసాగుతోంది. మరోవైపు, పొగమంచులోనూ విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యోగుల్లో సగం మంది మాత్రమే విధులకు హాజరవ్వాలని, మిగిలిన వారు వర్క్ ఫ్రం హెూం చేయాలని అధికారులు ఆదేశించారు. 10, 12 తరగతులు మినహా మిగిలిన తరగతులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించాలని స్పష్టంచేశారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: వైద్యులు

దేశ రాజధానిలో వాయు నాణ్యత అధ్వానస్థితికి దిగజారడంతో వైద్యులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిస్థితి అందరికీ ఆరోగ్యపరంగా ముప్పేనని యుసిఎంఎస్ & సిటిబి ఆస్పత్రి వైద్యుడు రజత్ శర్మ పేర్కొన్నారు. ఎన్95 మాస్క్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. వాయు కాలుష్యం కారణంగా ఆరోగ్యవంతులు కూడా శ్వాసకోశ, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ సమస్యంలో ప్రజలు అత్యంత జాగరూకతతో ఉండాలని గంగారామ్ ఆస్పత్రి శ్వాసనకోశ వైద్య నిపుణులు డా.ఉజ్వల్ ప్రకాష్ సూచించారు. అత్యవసర పని ఉంటే తప్ప బయటకు రావద్దని, తప్పనిసరిగా బయటకు వెళ్లాలంటే మాస్క్ ఉపయోగించాలని సూచించారు.

కాలుష్యంపై బీజేపీ రాజకీయాలు చేస్తోంది: ఆతిశీ

కేంద్ర ప్రభుత్వం దిల్లీ కాలుష్య సమస్యపై రాజకీయాలు చేస్తోందని సీఎం ఆతిశీ విమర్శించారు. దిల్లీలో వాయుకాలుష్యం తీవ్రస్థాయికి చేరేవరకు కేంద్ర ప్రభుత్వం అచేతనంగా ఉందని... ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. బీజేపీ పాలిత హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతులు పంటల వ్యర్థాలను తగులబెట్టకుండా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె అన్నారు. ఆప్ పాలనలో ఉన్న పంజాబ్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీని వల్ల రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టడం గణనీయంగా తగ్గిన ఏకైక రాష్ట్రం పంజాబ్ అని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పంట వ్యర్థాలు తగలబెట్టడం పెరిగిందని అన్నారు. గాలి నాణ్యత క్షీణించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, పిల్లలు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందుకోసం ఇన్‌హేలర్లు, స్టెరాయిడ్స్ అవసరమని పేర్కొన్నారు.

ప్రచారానికి తెర

(మొదటిపేజీ తరువాయి)

విధుల్లో పాల్గొంటున్నట్లు ఈసీ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి ఎదురు దెబ్బ తగలడం... ఎంవీఏ కూటమి పుంజుకున్న నేపథ్యంలో మహారాష్ట్రలో అధికార, విపక్ష కూటములు ఈసారి హోరాహెూరీగా తలపడుతున్నాయి. అధికార కూటమి మహాయుతిలో భాగమైన బీజేపీ 149 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 81 మందిని బరిలోకి దింపింది. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆధ్వర్యంలోని ఎన్సీపీ 59 మంది అభ్యర్థులను పోటీకి నెలబెట్టింది. విపక్ష కూటమి మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) లో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యూబీటీ) శరద్ పవార్‌కు చెందిన ఎన్సీపీ (ఎస్పీ) ఉన్నాయి. కాంగ్రెస్ 101 మంది అభ్యర్థులను బరిలో నిలపగా... శివసేన (యూబీటీ)95 మందిని, ఎన్సీపీ (ఎస్పీ) 86 మందిని పోటీకి దించింది. సీట్ల సర్దుబాటు కుదరని కొన్ని స్థానాల్లో కూటమి పక్షాలు స్నేహపూర్వక పోటీ చేస్తున్నాయి. బీఎస్పీ 237 మంది అభ్యర్థులను నిలపగా, ఎంఐఎం కూడా తమకు పట్టుందని భావిస్తున్న 17 చోట్ల అభ్యర్థులను పోటీకి దింపింది.

జార్ఖండ్‌లో...

జార్ఖండ్‌లోని 38 నియోజకవర్గాల్లో నవంబరు 20న పోలింగ్ జరగనుంది. 38 నియోజకవర్గాల్లో 522 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పోలింగ్‌కు ఈసీ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా భారీగా బలగాలను మోహరిస్తోంది. జార్ఖండ్‌లో మొత్తం 81 శాసనసభ స్థానాలు ఉండగా... వాటిలో తొలి విడతలో ఈనెల 13న 43 స్థానాలకు పోలింగ్ జరిగింది. 43 స్థానాలకు 683 మంది అభ్యర్థులు పోటీపడగా... 66.18 శాతం పోలింగ్ నమోదైంది. జార్ఖండ్‌లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ కలిసి మహాఘట్ బంధన్‌గా పోటీ చేస్తుండగా, బీజేపీ, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్, జేడీయూ, లోక్‌జన్ శక్తి రామ్ విలాస్ పార్టీ కలిసి ఎన్డీఏ కూటమిగా పోటీ చేస్తున్నాయి.

ధ్వంసమైన డ్రైనేజీని పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 21వ వారు మేదరబస్తీలో నాణ్యతాలోపాల కారణంగా డ్రైనేజీ ధ్వంసం అయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం శాసనసభ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం వెళ్లి ఆ డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీ పునర్నిర్మాణం కోసం సత్వరమే చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. డ్రైనేజీ దుస్థితిపై మున్సిపల్ శాఖ అధికారులను మందలించారు. పర్యవేక్షణ లోపం కూడా దీనికి కారణమన్నారు. అధికారుల లోపంతో పాటు కాంట్రాక్టర్ల అవినీతికి పాల్పడటం వల్లే లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అయిందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు జరిగినా తాను ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాష మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, అధికారులు వున్నారు.

ఆదివాసీల సమస్యలపై గవర్నర్‌కు వినతి

ఇల్లందు - విశాలాంధ్ర: తెలంగాణ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో దశబ్దాలుగా నివసిస్తున్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని గవర్నర్ సి.పి రాధాకృష్ణన్‌కు ఆదివాసీ జెఏసి నేత పెండెకట్ల యాకయ్య దొర లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి పత్రం అందించారు. యాకయ్య సోమవారం రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా గవర్నర్ ను కలిసారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆయన దృష్టికి నేరుగా తీసుకెళ్లరు. రాష్ట్రంలో సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుంటే ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లోని ఆదివాసీలు వెనకబడి పోతున్నారని గవర్నర్ ముందు యాకయ్య ఆవేదన వ్యక్తం. ఆదివాసీలకు విద్య, సరియైన ఉపాధి లేక ఈ ప్రాంతాల్లో వేలాది మంది పేదరికంలో నివసిస్తున్నారని తెలిపారు. నివసించేందుకు సరియైన ఆశ్రయం లేక ఆర్థిక దుస్థితి వల్ల పెద్ద జబ్బులు వస్తే వైద్య సదుపాయం అందుబాటులో లేక మృత్యువాత పడుతున్నారని వివరించారు. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములన్నిటికి పట్టాలు మంజూరు చేయలేదని వెల్లడించారు. పోడు భూముల సమస్యను పరిష్కరించి ప్రతి కుటుంబానికి ఐదు ఎకరాలను కేటాయించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేసారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో విద్యార్థులకు ప్రత్యేక గ్రంథాలయాలు, ట్రైబల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసి యోధుడు కొమరం భీం విగ్రహాలను గ్రామాల్లో ప్రతిష్టించాలని కోరారు. ఈ సమస్యలను ఓపిగ్గా విన్న గవర్నర్ సానుకూలంగా స్పందించారని యాకయ్య దొర హర్షం వ్యక్తం చేశారు.

అధిక లాభాలనిచ్చే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి : కలెక్టర్

విశాలాంధ్ర - పినపాక: రైతులు అధిక లాభాలను ఇచ్చే పంటల వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ జితీష్ వి. పాటిల్ కోరారు. సోమవారం ఆయన మణుగూరు, పినపాక మండలాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. మణుగూరు మండలంలో చిన్న రాయి గూడెం గోదావరి నది తీర ప్రాంతాన్ని పరిశీలించి పర్ణశాల వరకు భక్తులకు, ప్రజా రవాణా కొరకు బోటు సౌకర్యం కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. రేగుల గండి చెరువును పరిశీలించారు. మణుగూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పినపాక మండలంలో ప్రస్తుత వానాకాలం రైతులు పండించిన ధాన్యం సేకరణ చేయుచున్న ప్రభుత్వ ఏజన్సీలు డి.సి.యం.యస్, జి.సి.సి, ఐ.కె.పి, పి.ఎ.సి. యస్ ల కొనుగోలు చేస్తున్న కేంద్రాలను తనిఖీ చేశారు. ఉప్పాక గ్రామములో డి.సి.యం.స్. ద్వారా నిర్వహిస్తున్న కేంద్రాన్ని తనిఖీ చేసి తేమ శాతం చూసే యంత్రము పరిశీలించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం పాడైపోకుండా సరిపోను టార్పాలిన్స్ అందుబాటులో ఉంచలన్నారు. టాగింగ్ చేసిన బిల్లులకు మాత్రమే వాహనాలు పంపాలని ఆదేశించారు. జిల్లా సహకార అధికారి కుర్షీద్ అహ్మద్, డి.సి.యం.స్. మేనేజర్ సిబ్బంది, ఎడిఎ బి. తాతారావు, తహసిల్దార్ అద్దంకి నరేష్, రాఘవరెడ్డి, ఆర్ ఐ. బాలకృష్ణ, ఎంపీడీవో రామకృష్ణ, వ్యవసాయ అదికారి కేశవరావు, ఏఈ వో రమేష్ పాల్గొన్నారు.

గనుల్లో పేలుడు పదార్థాల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : బొగ్గు గనుల్లో అనుమతించే పేలుడు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సు కొత్తగూడెం ఏరియా ఆర్.సి.ఓ.ఎ క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సు డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సౌత్ సెంట్రల్ జోన్ అధికారులు ఉమేష్ ఎం. సావర్కర్, డిడిఎంఎస్‌లు సనత్ కుమార్, కమలేష్ కుమార్ వర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఏరియా జియం షాలేం రాజు అధ్యక్షత వహించగా ఏరియా అధికారులకు, సుపర్వైజర్లకు సదస్సులో పాల్గొన్నారు. తొలుత బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోయిన ఉద్యోగులకు 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఉమేష్ సావర్కర్ మాట్లాడుతూ అనుమతి ఉన్న పేలుడు పదార్థాలు, డిటోనేటర్ల నాణ్యత, భద్రత అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తరువాతే వాటిని ఉపయోగించాలని చెప్పారు. బ్లాస్టింగ్ సమయంలో రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జియం షాలేం రాజు మాట్లాడుతూ సింగరేణిలో డైరెక్టర్ జనర ల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ వారు ఆమోదించిన పేలుడు పదార్థాలు, డిటోనేటర్లను వాడుతున్నట్లు చెప్పారు. అధికారులు కేజీ తివారి, జీవీ కోటిరెడ్డి, సూర్య నారాయణ రాజు, రవీందర్, రమేష్, ప్రహ్లాద్, వెంకటేశ్వరరావు, శివ కేశవ రావు, శ్రీనివాస్ అన్ని గనుల మేనేజర్లు, సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

22న పురోహితుల సంఘం వన సమారాధన

విశాలాంధ్ర - కారేపల్లి : ఈనెల 22న విజయ విఘ్నేశ్వర అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో పురోహితులకు కార్తీక మాసం సందర్భంగా వన సమారాధన కార్యక్రమాన్ని సింగరేణి మండల పరిధిలోని భీక్యాతండా సమీపంలో గల అజ్మీర బిచ్చునాయక్ మామిడి తోటలో ఏర్పాటు చేసినట్లు నాలుగు మండలాల అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాస శర్మ తెలిపారు.సోమవారం మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పురోహితులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అర్చక సంఘం ఆధ్వర్యంలో పవిత్ర కార్తీక మాసంలో అర్చకుల వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ వన సమారాధన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అర్చకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ వన సమారాధన కార్యక్రమాన్ని కారేపల్లి, కామేపల్లి, రఘునాధపాలెం, గార్ల మండలాలతోపాటు పరిసర మండలాల అర్చకులు కూడా భారీ సంఖ్యలో కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయవలసిందిగా ఆయన సూచించారు.

కాల్ సెంటర్ ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ఖమ్మం : కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో ఉన్న కాల్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కాల్ సెంటర్‌లో నమోదైన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోలులో ప్రజలకు, రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, ఆ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 1077కు వచ్చే ప్రతి ఫిర్యాదులను డిజిటలైజేషన్ చేసి ప్రతిరోజు నివేదిక అదనపు కలెక్టర్‌కు అందించాలని కలెక్టర్ అన్నారు.

కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం లభించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కాల్ సెంటర్ ఇంచార్జ్ రజిత, అధికారులు తదితరులు ఉన్నారు.

ఖమ్మంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : ఖమ్మం జిల్లాలో సోమవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు, పలు ఆహార తయారీ కేంద్రాలు, అల్లం వెల్లుల్లి స్టోరేజ్, విక్రయ కేంద్రాలు, స్వీట్ తయారీ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ పి.రోహిత్ రెడ్డి, పి.స్వాతి, పి.మనోజ్ కుమార్, బి.రతన్ రావులతో కూడిన బృందం ఖమ్మం పట్టణంలో రిక్కా బజార్‌లోని మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు జరపగా, ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ లైసెన్స్ లేకుండా తయారీ, లైసెన్స్‌లు లేకుండా బిజినెస జరుపుతున్నందున, అల్లం వెల్లుల్లి మిశ్రమాల బాటిల్స్‌పై లేబుల్ లోపాలు బ్యాచ్ నంబర్, ఎఫ్ ఎస్‌సిఐ లోగో తయారీ, రీప్యాకింగ్, చిరునామా సరైన వివరాలు లేనందున, అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను డిటర్జెంట్లు, ఫినాయిల్ వంటి రసాయనాల పక్కనే నిల్వ చేయడం వల్ల అల్లం వెల్లుల్లి తినే ఆహార పదార్థాలు కెమికల్స్‌తో క్రాస్ కంటామినేషన్ జరుగుతుందని తెలిపారు. పేస్ట్‌లో దుర్గంధం ఉండటం, అతి తక్కువ ధరకు రిటైలర్లకు విక్రయం చేయడం, నాణ్యతా లోపాలు, కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ గా అనుమానించి నమూనాలు సేకరించి, లక్ష 32 వేల విలువగల 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేయడం జరిగింది. సేకరించిన నమూనాలను పరీక్ష కోసం ప్రయోగశాలకు పంపిస్తున్నామని అధికారులు తెలిపారు. చర్చ్ కాంపౌండ్ లో గల విజయలక్ష్మి పిండి వంటలలో క్యాన్సర్ కారకాలైనటువంటి రసాయన రంగులను అధిక మోతాదులలో స్వీట్లలో ఉపయోగించడం, బ్యాచ్ నెంబర్ మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, లైసెన్స్ నెంబర్ లేనటువంటి 6,550 రూపాయల విలువ గల మిస్ బ్రాండెడ్ పిండి వంటలను, పచ్చళ్లను, అక్కడికక్కడే ధ్వంసం చేసి, శాంపిల్లను సేకరించి పరీక్ష నిమిత్తం తరలించడం జరిగింది. అధిక మోతాదులో రసాయన రంగులను వాడడం, ఎక్స్పైర్ కలర్ స్పేస్ టాపింగ్ క్రీమ్స్, మిల్క్ మిస్టర్ క్రీమ్, ఇతర పదార్థాలు సుమారు 6950 రూపాయలు ఆహార పదార్థాలను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేసి ఫుడ్ సేఫ్టీ ఆక్ట్ చట్టానికి విరుద్ధంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నందుకుగాను నోటీసులు జారీ చేశారు.

993 కేజీల గంజాయి దహనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, మణుగూర్, ఇల్లెందు, అశ్వరావు పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో 54 పట్టుబడిన 993 కేజీల గంజాయిని ఎక్సైజ్ అధికారులు సోమవారం ధగ్ధం చేసారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్ అదేశాల మేరకు దాహనం చేశారు. కాల్చివేసిన గంజాయి విలువ రూ. 2 కోట్ల 48లక్షల 25 వేలు ఉంటుందని అంచనా వేశారు. దీన్ని తల్లేడ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో ఉన్న ఎడబ్యాయం కన్సటింగ్ లిమిటేడ్‌లోని దగ్ధకేంద్రంలో కాల్చేసారు. కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 25 కేసుల్లో 337.790 కేజీలు, పాల్వంచ స్టేషన్‌లో 15 కేసుల్లోని 408.371 కేజీలు, మణుగూర్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 52.520 కేజీలు, ఇల్లెందు స్టేషన్‌లో 10 కేసుల్లోని 108.372 కేజీలు, అశ్వరావుపేట్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 37.500 కేజీల గంజాయిని గతంలో పట్టుకున్నట్లు వెల్లడించారు. డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టేంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్యతో పాటు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్ మాజీ ఎమ్మెల్యే దంపతులు

ఇల్లందు - విశాలాంధ్ర : కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్షతో ఎమ్మెల్యేగా గెలిచి గత బిఆర్ ఎస్ ప్రభుత్వంలో స్వలాభం కోసం పార్టీ మారి ఐదు ఏళ్ళపాటు ఇల్లందు నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దంపతులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయి లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు ఘాటుగా విమర్శించారు. సోమవారం ఎమ్మెల్యే కనకయ్య క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, నాయకులు పడిదల నవీన్‌లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తే లక్షలాది మంది యువకులకు ఉపాధి అవకాశాలు వస్తాయని దీన్ని కూడా బిఆర్ ఎస్ పార్టీ నేతలు దుర్మార్గ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మంచి లక్ష్యంతో సియం తన సొంత నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ పెట్టే ప్రయత్నాలు చేయడం తప్పా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఈ క్రమంలో కొంతమంది రౌడీలను, స్థానికులను రెచ్చగొట్టి ఫార్మ విలేజి రాకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు పథకం ప్రకారం కలెక్టర్ పై దాడి చేయడం నీచమైన వ్యూహం అన్నారు. లగచర్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనపై హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తెలివి తక్కువ ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో తన భర్త హరి సింగ్ నాయక్‌తో కలిసి అనేక అక్రమాలకు పాల్పడ్డ ఉదంతాలు నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసన్నారు. నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, సుదర్శన్ కోరి, జాఫర్, కమల్ కోరి, శంకర్, సిరిమల్ల రాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించుకోవాలి

విశాలాంధ్ర - ఖమ్మం : పత్తి రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి నాణ్యత ప్రమాణాలకు లోబడి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని తద్వారా రైతులు ప్రభుత్వ మద్దతు ధరను పొందగలుగుతారని సిసిఐ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ దవే పిలుపునిచ్చారు. ఆయన సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి కొనుగోలు యార్డులో ప్రత్యేకంగా పర్యటించి పత్తి క్రయవిక్రయాలపై రైతులతో ఆయన మాట్లాడారు. 12 శాతం తేమ, సీసీఐ ఇతర నాణ్యత ప్రమాణాలకు సరిపడా పత్తిని సిద్ధం చేసుకుని మద్దతు ధరకు విక్రయించుకుంటే రైతులు నష్టపోకుండా ఉంటారని ఆయన సూచించారు. అలా గాకుండా తేమశాతం ఎక్కువగా ఉండి నాణ్యత తక్కువగా ఉండి ఆ పత్తిని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసినట్లయితే సరైన ధర రాక రైతులు నష్టపోతారని ఆయన అన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే వీలైన కాడికి పత్తిని అమ్ముకుంటే ప్రైవేట్ వ్యాపారుల చేతిలో మోసపోతున్నామని రైతులు ఇబ్బంది పడే అవసరం ఉండదని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో పత్తి క్రయవిక్రయాలు శుక్రవారం నుండి ఆదివారం వరకు వరుసగా మార్కెట్‌కు సెలవులు అనంతరం సోమవారం పత్తి మార్కెట్ తిరిగి ప్రారంభమైంది. ఇటీవల పత్తి రైతులకు ప్రైవేటు వ్యాపారుల ద్వారా సరైన ధర లభించడం లేదని అంశంపై వివిధ విపక్ష పార్టీలు ఆరోపించడం, మార్కెట్లో రైతును మోసం చేస్తే సహించేది లేదంటూ అటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించడం, ఆ తర్వాత జిల్లా కలెక్టర్ పత్తి మార్కెట్ ను సందర్శించి ఎవరైనా పత్తి కొనుగోలు విషయంలో రైతులకు నష్టం చేకూర్చే విధంగా వ్యవహరించి ఉంటే వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించడం కొందరు వ్యాపారులకు నోటీసులు వెళ్లడం కూడా జరిగింది. కాగా సోమవారం ఖమ్మం మార్కెట్ ను సందర్శించి వరంగల్ సిసిఐ బ్రాంచ్ మేనేజర్ రైతులకు పలు సూచనలు చేశారు.

మైసమ్మ గుడి నిర్మాణ బాధ్యత నాదే : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గార్ల : కాకతీయుల నాటి పురాతన కట్ట మైసమ్మ గుడిని, తల్లి విగ్రహాన్ని గుప్త నిధుల కోసం ధ్వంసం చేసిన దుండగులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని చట్ట పరంగా శిక్షిస్తామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. బయ్యారం పెద్ద చెరువు కట్టపై ఉన్న 700 ఏళ్ళ నాటి చారిత్రక గుడిని రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు నిధులకోసం తవ్వకాలు ధ్వంసం చేయడంతో జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం సోమవారం స్థానికులతో కలిసి క్షేత్రస్థాయికెళ్లారు. గుడి తోపాటు బయ్యవరం చెరువును సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుండగులు ధ్వంసం చేసింది గుడిని మాత్రమే కాదని పురాతన సంపద, ప్రజల నమ్మకాలు, విశ్వాసలని ఆవేదన వ్యక్తం చేశారు. ధనాపేక్షతో భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ఇలాంటి దుర్మార్గపు చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలను భాగస్వాములుగా చేసి గుడిని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. బయ్యారం మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, మైసమ్మ తల్లి భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లది ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: బీజేపీ - బి.ఆర్.ఎస్ లది ఢిల్లీలో దోస్తీ-గల్లీలో కుస్తీ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయద్దు అంటున్నారని, అంటే బీజేపీకి ఓటు వేయాలనే కదా అని అన్నారు. బీజేపికి దోస్తీ తెలంగాణలో బి.ఆర్.యెస్ పార్టీయేనని అన్నారు. బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అక్కరకు రాని అవగాహన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీ మీద చేయడం మానుకొని ప్రజలకు ప్రయోజనకరమైన విధానాలు అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. గత 10 సంవత్సరాల మీ ప్రభుత్వం పాలనలో బీజేపీ పార్టీకి తెలంగాణ లో అండదండలు అందించి తెలంగాణ ద్రోహానికి పాల్పడింది మీరు కాదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్,మేయర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త హై-పెర్ఫార్మెన్స్ టాబ్లెట్లు, ల్యాప్టాప్లతో లెనోవో

విశాలాంధ్ర-హైదరాబాద్: లెనోవో కే11 టాబ్లెట్ అప్ గ్రేడెడ్ వెర్షన్ లెనోవో ట్యాబ్ కే11 (ఎన్ హాన్స్‌డ్ ఎడిషన్)ను భారత్‌లో విడుదల చేసింది. ఈ అత్యాధునిక వేరియంట్ సంస్థలు నిపుణుల విభిన్న అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది. లెనోవో ఇండియా డైరెక్టర్ కేటగిరీ హెడ్ ఆశిష్ సిక్కా మాట్లాడుతూ, "అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని, కె 11 (ఎన్హాన్స్ ఎడిషన్) టాబ్లెట్ నేటి సంస్థలు నిపుణుల అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది. పనితీరు, మన్నిక, నిర్వహణ ఖచ్చితమైన మిశ్రమాన్ని అందిస్తుంది. దాని శక్తివంతమైన డిస్ప్లే, శక్తివంతమైన ప్రాసెసింగ్ ఈ టాబ్లెట్ను ఒకే పరికరంలో బహుముఖ సామర్థ్యాన్ని డిమాండ్ చేసే వ్యాపారాలు, ఉద్యోగులకు అనువైన ఎంపికగా చేస్తుంది.

మెరుగైన ఇండోర్ నెట్‌వర్క్

విశాలాంధ్ర-ముంబయి : ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 20కి పైగా జిల్లాల్లో తమ నెట్‌వర్క్‌ను గణనీయంగా మెరుగు పరచినట్లు దిగ్గజ టెలికాం ఆపరేటర్ వి ప్రకటించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, కర్నూలు, అనంతపురం, కడప, ఏలూరు, ఒంగోలు, నంద్యాల, ప్రొద్దుటూరు, భీమవరం, తెనాలి, మచిలీపట్నం, నరసరావుపేట, ఆదోని, తాడిపత్రి, హిందూపురం, గుంతకల్లు, గుడివాడ, ధర్మవరం, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి మొదలైన కీలక ప్రాంతాల్లో 3,450 పైగా సైట్లలో సమర్ధమంతమైన 900 ఎంహెచ్జెడ్ స్పెక్ట్రంను విజయవంతంగా వినియోగంలోకి తెచ్చింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల వి వినియోగదారులు, ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు అలాగే జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని వారు, మెరుగైన ఇండోర్ నెట్‌వర్క్ అనుభవాన్ని పొందగలుగుతారు. దీనితో పాటు వి గిగానెట్ నెట్‌వర్క్ ద్వారా యూజర్లకు వేగవంతమైన డేటా స్పీడ్‌ను అందించేలా ఈ రాష్ట్రాలవ్యాప్తంగా 5,000 పైగా సైట్లలో 2500 ఎంహెచ్జెడ్ బ్యాండ్‌లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకునే దిశగా వి తమ స్పెక్ట్రంను 10 ఎంహెచ్జెడ్ నుంచి 20 ఎంహెచ్జెడ్‌కి పెంచుకుంది.

సహజవాయువు పైప్‌లైన్‌లు తవ్వితే చట్టపరమైన చర్యలు

విశాలాంధ్ర-హైదరాబాద్: హిందూపూర్‌లో హౌసింగ్ బోర్డ్ కాలనీకి సమీపంలో, సాయిబాబా మందిరం వెనుక వైపు, ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ ద్వారా వేయబడిన సహజ వాయువు పైప్‌లైన్ ఇటీవల డ్రైనేజీ పైప్‌లైన్‌ను అమర్చడానికి ప్రయత్నిస్తున్న ఇంటి యజమాని నిర్వహించిన తవ్వకాల కారణముగా పాడు చేయబడింది. ప్రస్తుత చట్టాల ప్రకారం, ఐపీసీ సెక్షన్ 285, 336 కింద ఈ తరహా అనధికార నష్టాలకు 3 సంవత్సరాల జైలు శిక్ష, 25 కోట్ల వరకు జరిమానా విధించబడుతుంది.

ఎవెక్సియా లైఫ్‌కేర్ క్యూ2 ఎఫ్‌వై 25 కోసం బలమైన ఆదాయాలను నివేదిస్తుంది

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఎవెక్సియా లైఫ్‌కేర్ లిమిటెడ్ సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన త్రైమాసికం అర్ధ సంవత్సరంలో తన ఆదాయాలను ప్రకటించిందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన త్రైమాసికంలో, కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ. నుండి 169.61 శాతం పెరిగిందన్నారు. ఇటీవల, కంపెనీ 18,600 తాజాగా పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లను ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన సబ్‌స్క్రైబ్ చేయాలనే ఉద్దేశ్యంతో డిపోస్ట్ బయో ప్రైవేట్ లిమిటెడ్‌తో టర్మ్ షీట్‌ను అమలు చేసినట్లు ప్రకటించిందన్నారు. సబ్‌స్క్రిప్షన్ షేర్‌ల జారీ కేటాయింపు పూర్తయిన తర్వాత, ఈవెక్సియా కంపెనీ పోస్ట్ ఇష్యూ షేర్ క్యాపిటల్‌లో 65 శాతం కలిగి ఉంటుందన్నారు. ఇటీవల, కంపెనీ 18,600 తాజాగా పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లను ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన సబ్‌స్క్రైబ్ చేయాలనే ఉద్దేశ్యంతో డిపోస్ట్ బయో ప్రైవేట్ లిమిటెడ్‌తో టర్మ్ షీట్‌ను అమలు చేసినట్లు ప్రకటించిందన్నారు. ఇంకా, ఎవెక్సియా కూడా రూ. 20 కోట్లు కంపెనీ వ్యాపారానికి నిధులు ఇవ్వడానికి. పేర్కొన్న మొత్తం పాక్షిక మూలధన రూపంలో, వడ్డీ లేకుండా "క్వాసీ క్యాపిటల్" విడతలుగా అందించబడుతుందన్నారు.

రాతీ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ క్యూ2ఎఫ్వై25 కోసం నక్షత్ర ఆదాయాలను నివేదిస్తుంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాతీ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ 2024 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికం అర్ధ సంవత్సరానికి తన ఆదాయాలను ప్రకటించిందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. రావడంతో స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమ యొక్క పరివర్తన చెందిన మార్కెట్ పరిస్థితుల ద్వారా వ్యయ సామర్థ్య చర్యల ప్రభావం మొత్తం మార్కెట్ సెంటిమెంట్‌లను ప్రభావితం చేసిందన్నారు. ఇంకా, చేపట్టిన ఆధునికీకరణ ప్రాజెక్ట్ క్యూ 1 ఎఫ్ వై 25లో విజయవంతంగా పూర్తయిందన్నారు. ఇది నాణ్యత ఉత్పత్తి ఆమోదంలో గణనీయమైన మెరుగుదలకు దారితీసిందన్నారు. కంపెనీ భవిష్యత్తులో క్లిష్టమైన / అధిక విలువ-ఆధారిత గ్రేడ్‌లను ఉత్పత్తి చేయడానికి అనుమతిస్తుందన్నారు. బిల్లెట్‌ల హాట్ ఛార్జింగ్ కోసం కంపెనీ ఫార్వర్డ్ ఇంటిగ్రేషన్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసిందన్నారు. స్టెయిన్‌లెస్ స్టీల్ వైర్ రాడ్‌లకు సంబంధించినంత వరకు భారతదేశంలోనే మొదటిదన్నారు. ఈ చొరవ గణనీయమైన వ్యయ ఆప్టిమైజేషన్‌లకు దారి తీస్తుంది, ఫలితంగా ఇంధన వ్యయం, దిగుబడి నష్టం అలాగే కార్బన్ పాదముద్ర తగ్గుతుందన్నారు.

హార్డ్విన్ ఇండియా లిమిటెడ్ క్యూ2ఎఫ్వై 25 కోసం బలమైన ఆదాయాలను నివేదించింది

విశాలాంధ్ర - హైదరాబాద్: హార్డ్‌విన్ ఇండియా లిమిటెడ్, నవంబర్ 14, 2024న జరిగిన బోర్డు సమావేశంలో, సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన త్రైమాసికం అర్ధ సంవత్సరానికి బలమైన ఆదాయాలను ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా, బోర్డ్ 02:05 నిష్పత్తిలో బోనస్ ఈక్విటీ షేర్ల జారీని ఆమోదించిందఅన్నారు. అంటే కంపెనీ సభ్యుల వద్ద ఉన్న ప్రతి 05 (ఐదు) ఈక్విటీ షేర్లకు అవసరమైన ఆమోదాలకు లోబడి రికార్డు తేదీ నాటికి 02 (రెండు) ఈక్విటీ షేర్లు అవసరం కావచ్చన్నారు. సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన అర్ధ సంవత్సరంలో, కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ. నుండి 34.56 శాతం పెరిగిందన్నారు. ఇంతకుముందు, కంపెనీ కొత్తగా ఏర్పడిన అనుబంధ సంస్థ 'స్లిమ్-ఎక్స్' వినూత్న ఉత్పత్తుల శ్రేణిని ఆవిష్కరించినట్లు ప్రకటించిందన్నారు. కొత్త బ్రాండ్, అత్యాధునిక సాంకేతికతతో, ఇప్పుడు పరిశ్రమల కోసం వినూత్న ఉత్పత్తుల-అల్ట్రా-స్లిమ్, అధిక-పనితీరు గల అల్యూమినియం ప్రొఫైల్‌ల వృద్ధి సామర్థ్యాన్ని పెంచుతూ, రాబోయే రెండేళ్లలో రూ.100 కోట్ల ఆదాయాన్ని సంపాదించాలని యోచిస్తోందన్నారు.

ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్‌లో చిరెక్ స్కూల్ ప్రతిభ

హైదరాబాద్ : ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్ 2024 - 25 లో చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ పలు విభాగాల్లో రాంక్స్ పొందింది. భారతదేశంలోని టాప్ 10 పాఠశాలలు, ఇంటర్నేషనల్ డే స్కూల్ భారతదేశంలో నం.7 ర్యాంక్, హైదరాబాద్, తెలంగాణలో నంబర్ 1 ర్యాంక్, కో ఎడ్ డే స్కూల్ భారతదేశంలో నం.8 ర్యాంక్, హైదరాబాద్, తెలంగాణలో నంబర్ 1 ర్యాంక్, హైదరాబాద్, తెలంగాణలో నంబర్ 1 ర్యాంక్, క్యాంపస్ డిజైన్, ఆర్కిటెక్చర్ కోసం గ్రాండ్ జ్యూరీ అవార్డు, న్యూ ఇంటర్నేషనల్ డే స్కూల్ రెండు క్యాంపస్‌లు టీచర్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్, ఫ్యాకల్టీ కాంపిటెన్స్, అకడమిక్ కీర్తి, కో-కరిక్యులర్, స్పోర్ట్స్ ఎడ్యుకేషన్‌తో పాటు విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధపై అధిక స్కోర్‌లను పొందాయి. ఈ సందర్భంగా చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ సంచిత రాహా (సీఏఐఈ, ఐబీ) మాట్లాడుతూ తమ స్కూల్ అధ్యాపకుల నైపుణ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. అనూహ్యంగా శిక్షణ పొందిన అధ్యాపకుల బృందం ద్వారా మాత్రమే పరివర్తనాత్మక అభ్యాసం కోసం దాని దృష్టి సాధ్యపడుతుందని గుర్తించిందన్నారు. ఇంటర్-డిసిప్లినరీ లెర్నింగ్ ప్రాజెక్ట్-బేస్డ్ లెర్నింగ్ వంటి టీచింగ్ మెథడాలజీలను ఉపయోగించడం ద్వారా, ఉపాధ్యాయులు వినూత్న అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇది విద్యార్థులకు సంభావిత అవగాహనతో పాటు సమస్య-పరిష్కారం, సహకారం వంటి 21వ శతాబ్దపు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుందని చెప్పారు.

ఘనంగా హైదరాబాద్ కామిక్ కాన్ 2024

హైదరాబాద్ : మారుతి సుజుకి అరేనా హైదరాబాద్ కామిక్ కాన్, నవంబర్ 15 నుండి 17, 2024 మధ్య మూడు రోజుల పాటు ఘనంగా జరిగినట్టు నిర నిర్వాహకులు చెప్పారు. కామిక్ పుస్తకాల కమ్యూనిటీ, మాంగా, యానిమే, సూపర్ హీరో చలనచిత్రాలు వినోదభరితమైన అన్ని విషయాలను ఒకచోట చేర్చి, కామిక్ కాన్ ఇండియా ఉపఖండంలో అతిపెద్ద పాప్ కల్చర్ వేడుక కోసం నగరానికి థ్రిల్లింగ్‌గా తిరిగి రావడంతో ఈ మూడు రోజులు సమావేశం గొప్ప విజయాన్ని సాధించిందన్నారు. హాజరైనవారు వారి అంతర్గత అభిమానాన్ని కాస్ ప్లే కి మార్చారని, వారి గీక్‌డమ్‌ను ప్రదర్శనలో ఉంచారన్నారు. ఇతరులు ఇంటరాక్ట్ అయ్యారని, టోర్నమెంట్‌లు, ఇతర ఆటలలో పాల్గొన్నారన్నారు. హైదరాబాద్‌లోని 2024 కామిక్ కాన్ 8వ ఎడిషన్, చైన్‌సా మ్యాన్, బెసెర్క్ అనిమే, సోలో లెవలింగ్ మరిన్ని వంటి యానిమే క్యారెక్టర్‌లపై ఎప్పటికప్పుడు విస్తరిస్తున్న అభిమానుల సంఖ్య ప్రేమను చూసిందన్నారు. కొందరు వుల్వరైన్, ట్రాన్స్‌ఫార్మర్స్, డెడ్‌పూల్ ఎ వంటి క్లాసిక్‌లను తిరిగి తీసుకువచ్చారని స్పైడర్మ్యాన్ వైవిధ్యాల సంఖ్య. మూడు రోజుల పాటు 3000 మంది కాస్ ప్లేయర్‌లు కన్వెన్షన్‌లో పాల్గొన్నారన్నారు. అత్యుత్తమ వారాంతాన్ని జరుపుకోవడానికి సుమారు 40,000 వేల మందికి పైగా సందర్శకులు తరలివచ్చారన్నారు. ఆన్-స్టేజ్ లైనప్‌లో ప్రముఖ కళాకారులు ఉన్నారని, కరణ్ కాంచన్, గీక్ ఫ్రూట్ డైసుకి కాస్మో బ్యాండ్ వారి శక్తివంతమైన ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. హైదరాబాద్‌కు ఇష్టమైన సయ్యద్ బషార్‌తో పాటు హర్ష్ గుజ్రాల్, అజీమ్ బనాత్‌వాల్లా, రవి గుప్తా వంటి ప్రియమైన హాస్యనటులు వేదికపై నవ్వుల అల్లర్లు సృష్టించారని చెప్పారు.

మీషో 'ట్రస్ట్ అస్యూరెన్స్ రిపోర్ట్' రెండవ ఎడిషన్‌ను ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్: భారతదేశంలోని ఏకైక నిజమైన ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన మీషో తన 'ట్రస్ట్ అస్యూరెన్స్ రిపోర్ట్' రెండవ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. మీషో చురుకైన చర్యలు, భద్రత వినియోగదారు విశ్వాసాన్ని పెంపొందించడానికి నిరంతర ప్రయత్నాలను నివేదిక పరిశీలిస్తుందన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమ నిపుణులతో సహకారం పటిష్టమైన భద్రతా చర్యలను అమలు చేయడం ద్వారా, మీషో తన వినియోగదారులకు సురక్షితమైన విశ్వసనీయమైన ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌గా పేరు తెచ్చుకుందన్నారు. ప్రాజెక్ట్ విశ్వాస్‌లో భాగంగా, ప్లాట్‌ఫారమ్‌పై వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందించడం నిర్వహించడంపై దృష్టి సారించిన తన అంకితమైన 'ట్రస్ట్ అండ్ సేఫ్టీ' బృందాన్ని బలోపేతం చేయడంలో కంపెనీ పెట్టుబడి పెట్టడం కొనసాగిస్తోందన్నారు. రిస్క్ ఇంటెలిజెన్స్ నిపుణులతో భాగస్వామ్యం చేయడం ద్వారా దాని సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా, ఈ డైనమిక్ ల్యాండ్‌స్కేప్‌లో భద్రతా ముప్పులను ముందుగానే ఎదుర్కోవడానికి కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. గత 12 నెలల్లో, మీషో 2.2 కోట్ల మోసపూరిత లావాదేవీలను నిరోధించిందన్నారం అదనంగా, మీషో వేదిక నుండి చెడు నటులను తొలగించడానికి విస్తృతమైన చర్యలు చేపట్టింది. ఈ బృందం మార్గదర్శక విశ్లేషణాత్మక నమూనాలు, అధునాతన డేటా సైన్స్ ఫ్రేమ్‌వర్క్‌లు అధునాతన గణన తర్కాన్ని అభివృద్ధి చేసిందన్నారు. ఇది 13 లక్షల బాట్ ఆర్డర్‌లను నిరోధించడంలో సహాయపడి, ప్లాట్‌ఫారమ్‌ను యాక్సెస్ చేయకుండా 77 లక్షల స్కామ్ ప్రయత్నాలను నిరోధించిందన్నారు. జనరల్ మేనేజర్ సౌరభ్ పాండే మాట్లాడుతూ "మీషో యొక్క వ్యూహంలో కీలకమైన భాగం 'ప్రాజెక్ట్ విశ్వాస్ అన్నారు.

సంపాదకీయం

మండుతున్న మణిపూర్ నిశ్చేష్టంగా మోదీ

గత గురువారం నుంచి మణిపూర్ మళ్లీ భగ్గుమంటోంది. హింసకు దిగినవారిని కట్టడి చేయడానికి పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక వ్యక్తి మరణించాడు. పరిస్థితిని అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అదనంగా మరో 50 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను పంపింది. దీనితో మణిపూర్‌లో నియోగించిన కేంద్ర సాయుధ పోలీసుదళాల సంఖ్య అయిదువేలకు చేరింది. సోమవారం నాటికి హింసాత్మక సంఘటనలు మరింత పెచ్చరిల్లాయి. మెయితీ వర్గానికి చెందిన రెండేళ్ల బాలుడి తల లేని మొండెం, ఆ బాలుడి నాయనమ్మ అర్థ నగ్న మృతదేహం బరాక్ నదిలో తేలుతూ కనిపించాయి. మెయితీలు, కుకీల మధ్య ఘర్షణల్లో మరో ఆరుగురు మరణించారంటున్నారు. భద్రతా దళాలకు కుకీ ఆందోళన కారులకు మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. పరిస్థితి విషమించిన తరవాత మణిపూర్‌లోని చాలా చోట్ల కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సదుపాయాన్ని నిలిపివేశారు. పాఠశాలలు, కళాశాలలతో పాటు అన్ని విద్యా సంస్థలను మంగళవారం దాకా మూసేశారు. ఈ లోగా మణిపూర్‌లో అధికారంలో ఉన్న ఎన్.డి.ఎ. ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ నాయకుడు కోన్రాడ్ సంగ్మా మద్దతు ఉపసంహరించారు. అయితే ఎన్.డి.ఎ. ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీలేదు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అసమర్థత, తన బాధ్యతను పూర్తిగా విస్మరించిన మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఉదాసీనత వల్ల గత 19 నెలలుగా మణిపూర్ అగ్నిగుండంగా మారింది. మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దడానికి మోదీ సర్కారు ఇంతవరకు చేసింది ఏమీలేదు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉదాహరణ ప్రాయంగా ఒక్కసారి మణిపూర్ వెళ్లివచ్చారు. కానీ ఆయన ఘర్షణ పడుతున్న మెయితీ, కుకీల ప్రతినిధులతోగానీ, సామాన్య ప్రజలతోగానీ సంప్రదింపులు జరపనేలేదు. కనీసం బాధితులను పరామర్శించిన పాపాన కూడా పోలేదు. అతిథిగృహంలో కూర్చుని కొంతమంది ఉన్నతాధికారులను పిలిపించి పరిస్థితిని సమీక్షించాననిపించుకుని దిల్లీ వెళ్లిపోయారు. ప్రధానమంత్రి మోదీ అయితే దేశదేశాలూ తిరుగుతున్నారు కానీ 2023 మే మూడు నుంచి మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు జరుగుతున్నా ఆ రాష్ట్రాన్ని సందర్శించాలన్న ఆలోచనే ఆయనకు రాలేదు. ఈ లోగా డజన్ల కొద్దీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. అనేక విదేశీయాత్రలు చేసి వచ్చారు. ఇప్పుడు కూడా ఆయన విదేశీ యాత్రల్లోనే ఉన్నారు. మణిపూర్‌లో అంటుకున్న అగ్గిని ఆర్పేయడానికి మోదీ చేసిందేమీ లేకపోయినా రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం నిలిపివేయిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న అమిత్ షా మణిపూర్‌లో పరిస్థితి విషమించిందని తెలిసి ప్రచారం మధ్యలోనే నిలిపివేసి దిల్లీ పరుగెత్తారు. అక్కడా ఆయన చేసిందల్లా సమీక్షా సమావేశాలు నిర్వహించడమే. హింస చెలరేగుతున్న ప్రాంతంలో పరిస్థితిని అదుపు చేయడానికి అమిత్ షా కూడా చేసింది, చేస్తున్నది ఏమీలేదు. మణిపూర్ మండిపోతుంటే ఇంత ఘోరంగా నిష్క్రియాపరత్వం ప్రదర్శించడం మోదీకి, అమిత్ షాకే చెల్లింది. అక్కడి గవర్నర్ హింస చెలరేగిన వెంటనే పరిస్థితిని కట్టడి చేయాలని అమిత్ షాకే కాక రాష్ట్రపతికి కూడా మొరపెట్టుకున్నారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించాలని ఎంతమంది చెప్తున్నా మోదీ ప్రభుత్వ చెవికెక్కడం లేదు.

డబుల్ ఇంజన్ సర్కారు ఉంటే ఏ రాష్ట్రమైనా త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని, శాంతి భద్రతలు సుస్థిరంగా ఉంటాయని ఊదరగొడ్తున్న మోదీ ప్రభుత్వం మణిపూర్‌ను మాత్రం పట్టించుకోవడంలేదు. నిజానికి అక్కడ అధికారం సంపాదించడానికి మెయితీ, కుకీ జాతుల మధ్య తంపులు పెట్టిందే మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం. జాతి కలహాలు ఇప్పుడు అక్కడ పెద్ద భూతంలా తయారయ్యాయి. గత 19 నెలల కాలంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది మహిళలమీద అత్యాచారాలు జరిగాయి. మహిళలను నగ్నంగా ఊరేగించారు. ఇదంతా ఏదో పరాయి దేశంలోనో, మనకు సంబంధంలేని వ్యవహారంగానో మాత్రమే మోదీ సర్కారు భావిస్తోంది. శాంతి భద్రతలు పరిరక్షించడానికి లేదా రాజకీయ పరిష్కారం కనుగొనడానికి కానీ చేసిందేమీలేదు. భిన్న జాతుల వారి మధ్య విద్వేషంనింపి అధికారం మాత్రం సంపాదించింది. సామాజిక-రాజకీయ విభేదాలకు ఆజ్యం పోసింది. మణిపూర్‌లో కొనసాగుతున్న విధ్వంసం మునుపెన్నడూ లేనిదని, ఈ చిచ్చును చల్లార్చడానికి రాజకీయ, పరిపాలనాపరమైన తగిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు చెవిని ఇల్లుకట్టుకుని చెప్తున్నా మోదీ ప్రభుత్వంలో చలనంలేదు. మెయితీ మద్దతుదార్లు ప్రభుత్వ కార్యాలయాలకు తాళం పెడుతున్నారు. కర్ఫ్యూ ఉల్లంఘించి మెయితీ ఉద్యమకారులు ప్రభుత్వ కార్యాలయాలను స్వాధీనం చేసుకుంటున్నారు. సోమవారం నాటికి బయటపడ్డ ఏడు మృతదేహాలు కూడా అంతకు ముందు కుకీలు అపహరించుకువెళ్లిన వారివేనంటున్నారు. ఇంఫాల్ లోయలోని అయిదు జిల్లాల్లో మెయితీల ప్రభావం ఎక్కువ. ఆందోళనకారులు ఎన్నికల అధికారి కార్యాలయాన్ని కూడా ఆక్రమించారు. ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేస్తే సమస్య పరిష్కారం అవుతుందన్న ప్రభుత్వ ఆలోచన కేవలం భ్రమే. దీనివల్ల అందవలసిన సమాచారం అందకుండా పోతోంది. ఇది అదనపు సమస్యలకు దారి తీస్తోంది. మణిపూర్‌లో హింసాకాండ చెలరేగుతుంటేనే బీజేపీకి ప్రయోజనం అన్న ఆరోపణలూ వస్తున్నాయి. కనీసం వీటిని ఖండించడానికైనా మోదీ ప్రభుత్వంలో కదలిక కనిపించడం లేదు. మణిపూర్‌లోని వివిధ పక్షాలతో సంప్రదించాలని, ఆ తరవాత దిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఏం జరుగుతోందో వివరించి పరిస్థితి అదుపు చేయడానికి ఏం చేయాలో నిర్ణయించాలని ప్రతిపక్షాలు ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. నవంబర్ 25న పార్లమెంటు సమావేశాలు మొదలయ్యే లోగా అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తే పరిస్థితి సానుకూలంగా మారుతుంది. ఈ సూచననూ మోదీ సర్కారు ఖాతరు చేయడంలేదు. ప్రతిపక్ష పార్టీలు సాధారణంగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినా విమర్శిస్తాయి. కానీ మణిపూర్‌లో అసమర్థ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించి రాష్ట్రపతి పాలన విధించాలని ప్రతిపక్షాలు కోరుతున్నా మోదీ ప్రభుత్వం మౌనమే సమాధానం అన్నట్టుగా ఉంది. కేంద్ర ప్రభుత్వం చేసిందల్లా పౌరుల మీద జరిగిన మూడు కేసుల దర్యాప్తు బాధ్యతను జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించడమే. కేంద్రం తీసుకున్న మరో చర్య ఏమిటంటే సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.) మళ్లీ అమలు చేయడమే. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ఇళ్ల మీద దాడులు జరుగుతున్నాయి. శనివారం ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చెందిన ఇంటిమీద కూడా దాడి చేశారు. ఒక ఎమ్మెల్యే అయితే తన ఇంటి చుట్టూ బంకర్లు నిర్మించుకు కూర్చున్నారు. తీవ్ర దాడులు ఎదుర్కొంటున్న మెయితీలు ప్రభుత్వం మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉంది.

సేవ్ ది హౌజ్

చింతపట్ల సుదర్శన్

అరుగు మీద మంచి నిద్రలో ఉన్న డాగీకి మనుషుల అలికిడి వినిపించి మెలకువ వచ్చింది. ఈ డాంకీ ఇంకా రాలేదు ఎక్కడ న్యూస్ పేపర్లు నవుల్తూ ఉండిపోయిందో అనుకుంటూ ఇంటి లోపలికి తొంగిచూసింది. లోపల ఓ పీచు గడ్డంవాడు, ఓ పిల్లి మీసాలోడూ, ఓ బట్ట గుండోడు ఉన్నారు. ఎవరు వీళ్లు? ఎందుకు ఈ కొంపలోకి జొరబడ్డారు? పెద్దగా అరిస్తే అటునుంచటే పారిపోతారా లేదా దుడ్డుకర్ర ఏదైనా తీసుకుని మీదికి వస్తారా? చూస్తే 'అన్ సోషల్ ఎలిమెంట్స్' లాగున్నారు. ఎందుకైనా మంచిది డాంకీ వచ్చేదాకా ఆగుదాం అనుకున్న డాగీకి అరుగు ఎక్కుతున్న డాంకీ కనిపించింది. వచ్చావా! వందేళ్లు నీకు అందామనుకుంది కాని అది అత్యాశపరులైన మనుషులకే కాని తమకు కాదుకదా అని గుర్తొచ్చి, రారా డాంకీ భాయ్ నీ కోసమే వెయిటింగిక్కడ అంది. ఏమిటి సంగతి ఏదైనా ప్రాబ్లమ్ వస్తే తప్ప గుర్తు చెయ్యవు కదా నన్ను, పైగా వెయిటింగు కూడానా? అంది డాంకీ. పంచ్‌లు పంచుకునే టైం కాదిది. ఎమర్జెన్సీ! లోపల ముగ్గురు మనుషులున్నారు. ముగ్గురా? ముగ్గురు మూర్ఖులా, ముగ్గురు బైరాగులా, మాయల మరాఠీలా లేక ఊళ్లల్లోకి వచ్చి 'రీల్సు' చేస్తున్న అఘోరాలా? అంది డాంకీ గోడకు వీపు

రంగస్థలం

ఆనించి 'సిట్టింగ్' వెయ్యబోతూ. ప్రతిదీ 'లైట్' తీసుకోడం అంత మంచిది కాదు. లోపల ముగ్గురు దొంగనాయాళ్లున్నారు. మన ఈ కూలిన కొంప మన స్వంతం. మన కొంపలోకి వచ్చిన పరాయి ముష్కరులను చూస్తూ ఊరుకుందామా? ఏమైనా చేద్దామా? ఐసీ! మ్యాటర్ సీరియస్ అన్నమాట. ఇంతకీ లోపల ఏం చేస్తున్నట్టు వాళ్లు పేకాడుతున్నారా? గంజాయి, దమ్ము కొడుతున్నారా? మెళ్లల్లో కండువాలు ఉన్నయా? ఏ పార్టీ కార్యకర్తలో గమనించావా? అంది డాంకీ. సరిగ్గా చూడలేదు కానీ, అన్ని పార్టీల్లోనూ కార్యకర్తలుగా ఇలాంటి వారే కనబడతారు. ప్రజాస్వామ్యాన్ని పీచుగడ్డంవాళ్లూ, పిల్లి మీసాల వాళ్లూ, బట్ట గుండోళ్లే కద కాపాడాల్సింది. వీళ్లు కాక ప్రభుత్వ అధికారుల మీద రాళ్లు రువ్వగలిగిన వాళ్లు, కార్లు ధ్వంసం చేయగలిగిన వాళ్లు ఎవరుంటారు చెప్పు. ఇక వీళ్లు ఏం చేస్తున్నారో చూసి చెప్తా అంది డాగీ లోపలికి దృష్టి సారించి. చూడకుండానే నేను చెప్పనా ఇక్కడెక్కడో ఎన్నికలు జరుగుతున్నాయి కదా, ఓటుకు ఇంత అని అమ్ముకుని ఆ డబ్బుతో మందు తెచ్చుకుని 'మజా' చేసుకుంటున్నారు అంతేకదా! ఎగ్జాట్లీ ఎలా చెప్పగలిగావు అంది డాగీ. ఏముంది! ప్రజాస్వామ్యం ఇప్పుడు సూపర్ మార్కెట్ సరుకు అయింది కదా. వేలు మీద చుక్క పెట్టించుకోవడం అనే పెట్టుబడి కాని పెట్టుబడితో డబ్బు సంపాదిస్తున్నారు ఓటర్లు. ఎలాగూ గెలిచినవాడు ఊడబొడిచేది ఏమీ ఉండదని, ఓడినవాడు, గెలిచినవాడు ఒకళ్లనొకళ్లు బూతులు తిట్టుకుంటూ మళ్లీ ఎన్నికలు వచ్చేదాకా, కాలక్షేపం చేస్తారని తెలిసిందే కద అంది డాంకీ. కాలక్షేపం, దుష్ప్రచారం సరే గెలిచిన వారయితే ప్రజల నెత్తిన 'అప్పు తట్ట' బోర్లించి రాజ భోగాలయితే అనుభవిస్తారు కదా! అనుభవిస్తారు కానయితే అవి రాజభోగాలు కావు మంత్రి భోగాలు, ఎంపీ, ఎంఎల్‌ఏ భోగాలే. సొమ్మొకడిది సోకొకడిది అనే కదా అంది డాంకీ.

ఓటుకు నోటూ, మందూ పుచ్చుకునే వాళ్లు కొందరయితే, క్యూల్లో నిలబడి, చెమటోడ్చి ఓటు వెయ్యడం అవసరమా అనుకునే వాళ్లు కొందరు. ప్రజల్ని మతం పేరా, కులం పేరా విభజించి, విడదీసి వీరంగం ఆడేస్తున్నారు నాయకులు అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. వచ్చావా బ్రో! రారా! ఇక్కడ ఓ పెద్ద సమస్య వచ్చిపడింది అంది డాగీ. సమస్యా! అది లేకుండా భూ ప్రపంచమే ఉండదులే! మణిపూర్ సమస్య మళ్లీ భగ్గుమన్నది. పాపం మూడేళ్ల పసివాడి తల, చేతులు నరికేశారుట, వాడి కుటుంబం మొత్తాన్ని శవాలుగా మార్చేర్ట. అయినా ఆనాడూ ఈనాడూ చీమ కుట్టనే లేదు మన సర్కారును. అన్ని సమస్యల్నీ 'లైట్' గా తీసుకోడం అలవాటయ్యి, నాన్చడం అలవాటయ్యి, రైతుల సమస్యలయితేనేం, జాతుల సమస్యలయితేనేం, పహిల్వాన్ల సమస్యలయితేనేం అన్ని సమస్యలనీ ప్రేక్షకుల్లా చూస్తూ ఉండడమే దేశభక్తి అంటున్నారు. సమస్యల్ని కాలమే పరిష్కరిస్తుందని నమ్మే ఆధ్యాత్మికవేత్తల దేశం మనది మరి అన్నాడబ్బాయి.

దేశం సంగతి నాయకులకు వదిలేద్దాం. దేశాన్నీ, ప్రజల్నీ తాకట్టు పెడతారో, అమ్ముకుంటారో, ప్రజాస్వామ్యం పీకి పిసికేస్తారో వాళ్లకీ, ప్రజలకీ వదిలేద్దాం. ప్రస్తుతం మన ఈ కూలిన గూడును కాపాడుకోవటం, మన తక్షణ కర్తవ్యం అంది డాగీ. అవును. ఈ గంజాయి దమ్ముగాళ్లని తక్షణం తరిమేయకపోతే ఈ చోటును తమ 'అడ్డా' గా మార్చుకునే ప్రమాదం ఉంది అంది డాంకీ. అయితే 'సేవ్ ది హౌజ్' మిషన్ ప్రారంభించండి. నేను కనపడకుండా వాళ్ల మీద రాళ్ల దాడి చేస్తాను. డాగీ నువ్వు దిక్కులు పిక్కటిల్లేట్టు అరుపు లంకించుకో. వాళ్లిటు వైపు వస్తే, డాంకీ వెనక కాళ్లతో అటకాయిస్తుంది. దొరికితే నుద్దూ 'పిక్కలు' వదలకు. రెడీ 'ఒన్ టూ త్రీ' చెప్పాడు అబ్బాయి.

ఉరేయ్ ఈ కుక్క నా పిక్క పట్టిందిరోయ్ అని పీచు గడ్డంవాడు, నా తల పగిలిందిరోయ్ అని పిల్లి మీసాలోడు, నా నడుం విరిగిందిరోయ్ అని బట్ట గుండోడు అరుస్తూ, అరుగు మీది నుంచి కిందికి దొర్లి పారిపోయేరు. సొతంత్రం స్వర్గలోకం అన్నారు. కూలిన కొంపయితేనేం మన కొంపను మనం రక్షించుకోవాలి అంది డాగీ. నా వెనుక కాళ్ల సత్తువ పరీక్షించుకునే ఛాన్సు దక్కింది నాకు అంది డాంకీ. అరుగు దిగి వెళ్లిపోయేడు అబ్బాయి.

మోదీ రైతు వ్యతిరేక అజెండా

రాజన్ క్షీరసాగర్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మెజారిటీ తగ్గిపోయినప్పటికీ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలను అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తోంది. మోదీ ప్రభుత్వంపై రైతులకు విశ్వాసం సన్నగిల్లడమే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ మెజారిటీ తగ్గిపోవడానికి ప్రధాన కారణం. మెజారిటీ తగ్గినప్పటికీ జేడీయూ, టీడీపీ మద్దతుతో బీజేపీ కేంద్రంలో అధికారంలో కొనసాగుతోంది. ఎన్నికలలో వచ్చిన ఫలితాలను గుర్తించడానికి బదులుగా 2017 మందసౌర్ రైతుల నిరసనను అమానుషంగా అణచివేసేందుకు ప్రయత్నించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న శివరాజ్ సింగ్ చౌహాన్‌ను వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిగా నియమించడంతో సహా రైతులకు హానిచేసే విధానాలను బీజేపీ కొనసాగిస్తోంది.

కేంద్రంలో తిరిగి అధికారంలోకి రావడంతో బీజేపీ ప్రభుత్వం 'వినాశకర వ్యవసాయ చట్టాలు' తిరిగి ప్రవేశపెట్టేందుకు వివిధ మార్గాల ద్వారా ప్రయత్నిస్తోంది. రైతుల వ్యతిరేకత, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పార్టీ అధిష్టానం తోసిపుచ్చినప్పటికీ బీజేపీ ఎంపీలు అనేక మంది ఈ వినాశకర నల్లచట్టాలను బహిరంగంగా సమర్థిస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. మరో పక్క ఈ వివాదాస్పద చట్టాలను తిరిగి తీసుకువచ్చేందుకు మార్గం సుగమం చేస్తూ బహుళజాతి వ్యవసాయ కార్పొరేషన్లతో ప్రభుత్వం ఎంఓయూలు కుదుర్చుకుంటోంది. "డిజిటల్ మౌలిక సదుపాయాల' ప్రచారం ద్వారా వ్యవసాయ డేటాపై నియంత్రణను ప్రభుత్వం కోరుకుంటోంది. ఐసీఏఆర్, అమజాన్, సింజెంటా వంటి కంపెనీల మధ్య ఈ విధమైన ఒప్పందాల ద్వారా ప్రపంచ సంస్థలకు అందుబాటులో ఉంటోంది. ఇది వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధన డేటా, విస్తరణ డేటా చివరకు భూమిని కూడా ఈ సంస్థలకు ధారాదత్తం చేయడానికి దోహదపడుతోంది. అంతేకాకుండా భారతీయ వ్యవసాయం కార్పొరేట్ల నియంత్రణలోకి వెళ్లిపోతోంది.

వరదలు, కరువు ప్రభావిత ప్రాంతాల నిర్లక్ష్యం

ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని అనేక ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసి వరదలు సంభవించి లక్షలాది ఎకరాలలో పంట నాశనమైనది. మరి కొన్ని ప్రాంతాలలో దుర్భిక్ష పరిస్థితులు పంట నష్టానికి దారితీశాయి. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తాజాగా విడుదల చేసిన 'రుతుపవనాల ముగింపు నివేదిక' ప్రకారం 2024లో 2,632 ప్రాంతాలలో భారీ వర్షాలు, 473 ప్రాంతాలలో అతి భారీవర్షాలు కురిశాయి. కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి ప్రకోపానికి గురై కొండచెరియలు విరిగిపడి భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, బీహార్, అసోం, ఉత్తర ప్రదేశ్, త్రిపుర, గుజరాత్, మేఘాలయల్లో భారీ వరదలు సంభవించాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది ఎకరాలలో పంట నాశనమైనది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వ స్పందన అత్యంత నామమాత్రం మాత్రమే.

జాతీయ విపత్తుగా ప్రకటించడానికి తిరస్కరించి పరిమితమైన సహాయం మాత్రమే అందించి చేతులు దులుపుకుంది. ఇదిలావుండగా, పీఎంఎఫ్‌బీవై ఫసల్ బీమా పథకం కింద చెప్పుకోతగ్గ మొత్తంలో ఆర్థిక, బీమా సంస్థలకు నిధులు అందినప్పటికీ బాధిత రైతులలో అతి కొద్ది మందికి మాత్రమే అవి చేరాయి. వరద బాధిత కుటుంబాలు, రైతులకు అతి స్వల్ప మొత్తం

> **బీజేపీ ప్రభుత్వం 'వినాశకర వ్యవసాయ చట్టాలు' తిరిగి ప్రవేశపెట్టేందుకు వివిధ మార్గాల ద్వారా ప్రయత్నిస్తోంది. రైతుల వ్యతిరేకత, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పార్టీ అధిష్ఠానం తోసిపుచ్చినప్పటికీ బీజేపీ ఎంపీలు అనేక మంది ఈ వినాశకర నల్లచట్టాలను బహిరంగంగా సమర్థిస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నారు.**

పరిహారం అందింది. వ్యవసాయ ఉపకరణాలకు సంభవించిన నష్టం, పంట, ఇళ్లు నష్టం, జీవనోపాధి కోల్పోవడంపై నష్టం అంచనా వేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. బీహార్, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా సాయం అందించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైంది. దుర్భిక్ష ప్రకటన విధానాన్ని ఇప్పటికీ సవరించలేదు. దానితో రైతులు, అవసరతలో ఉన్న ఇతర వర్గాల వారికి ఇంతవరకూ ఎటువంటి ఉపశమనం లభించలేదు.

పెరిగిన సాగు వ్యయం

పెరుగుతున్న సాగు వ్యయం భారతీయ రైతులను మరింత ఒత్తిడికి గురిచేస్తోంది. ఎరువుల సబ్సిడీలపై గణనీయంగా కోత విధిస్తున్నారు. 2022-23 కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీలకు రూ. 2,51,339 కోట్లు కేటాయించగా 2023-24 సంవత్సరం సవరించిన బడ్జెట్‌లో రూ. 1,88,894 కోట్లకు తగ్గిపోయింది. 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ. 62,445 కోట్లను తగ్గించి 1,64,000 కోట్లతో బడ్జెట్‌ను ఖరారు చేశారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)తో నిమిత్తం లేకుండా, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) భావనకు విఘాతం కలిగిస్తూ, రేషన్ కార్డుదారులకు పీడీఎస్ ద్వారా ఆహార ధాన్యాల సరఫరాను నిలిపివేసి నేరుగా నగదు బదిలీని ప్రారంభించింది.

వ్యవసాయ దిగుమతులు కూడా పెరిగాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో భారత వ్యవసాయ, వ్యవసాయ సంబంధిత ఉత్పాదనల దిగుమతి 37 బిలియన్ డాలర్లకు చేరింది. 2019 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2023లో దిగుమతులు 12.5 బిలియన్ డాలర్లు (51 శాతం)పైగా పెరిగాయి. ఈ ఉత్పాదనల దిగుమతిలో భారత్ ప్రపంచంలోనే ఎనిమిదవ అతిపెద్ద దేశంగా అవతరించింది. పత్తి, సోయా ఉత్పాదనలు, తాజా పండ్లు, పాలపొడి తదితరాలను భారత్ అధికంగా దిగుమతి చేసుకుంటోంది. దానితో దేశీయంగా సోయాబీన్, పత్తి ధరలు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కన్నా తక్కువకు పడిపోయాయి. చౌక దిగుమతులను సులభతరం చేసేందుకు మోదీ ప్రభుత్వం సుముఖత చూపడం దేశీయ రైతులను నాశనం చేసింది, భారతదేశాన్ని ప్రపంచ వ్యవసాయ వస్తువులకు డంపింగ్ గ్రౌండ్‌గా మార్చివేసింది.

రైతుల పేరుతో కార్పొరేట్ దోపిడీ

మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎంఎఫ్‌బీవై పంట బీమా పథకం ప్రధానంగా ఆర్థిక, బీమా కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూరుస్తోంది. 2018లో ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇవి 1,95,207 కోట్ల రూపాయలు అందుకున్నాయి. మహారాష్ట్ర వంటి చోట "రూపాయి పంట బీమా పథకం' రైతుల అనుకూలమైనదిగా కనపడినప్పటికీ ప్రభుత్వం అంతిమంగా పూర్తి బీమా ప్రీమియం చెల్లించినప్పటికీ, అశాస్త్రీయంగా, రైతు వ్యతిరేక ప్రమాణీకం కారణంగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మారి వాటికి లాభాలను తెచ్చిపెట్టింది. 95 శాతం సబ్సిడీపై సోలార్ విద్యుత్ పంపులను ఇచ్చే పునర్ ఇంధన మంత్రిత్వ శాఖ పథకం పీఎం-కుసుమ్‌ను కూడా ఇదే విధంగా నిర్వహించడం వల్ల అదాని వంటి కొన్ని కంపెనీలకు మాత్రమే ప్రయోజనం కలిగించింది తప్ప రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేదు. ప్రభుత్వ నిధులు కార్పొరేట్ సంస్థల అనుబంధ సంస్థల ఖాతాల్లోకి వెళ్లాయి.

అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు

కార్పొరేట్ల అమానవీయత

గినీ జార్జి

పనిచేసే చోట విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అయినప్పటికీ కార్పొరేట్ యజమానులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. 26ఏళ్ల యువతి అన్నా సెబాస్టియన్ పెరయిల్ పనిఒత్తిడి తట్టుకోలేక ప్రాణాలు వదిలారు. అయినప్పటికీ యాజమాన్యం ఈ విషయాన్ని పెద్దగా పరిగణలోకి తీసుకోలేదు. తోటి పనివాళ్లు, ఉద్యోగులు తీవ్రంగా స్పందించారు. అన్నా సెబాస్టియన్ పెరయిల్ సీఏ పరీక్షలు 2023లో పాస్ అయిన తర్వాత ఉద్యోగం కోసం వెదికారు. ఆమె డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. 2024 మార్చిలో ఈవై ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరారు. నాలుగునెలలపాటు ఉద్యోగం చేసిన తర్వాత జులై 20న ఫ్యాక్టరీలో పనిచేసిన అనంతరం ఇంటికి తిరిగివచ్చారు. అయితే ఆలస్యంగా ఇంటికివచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు. అన్నా తల్లి అగస్టిన్ ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా(ఈవై) చైర్మన్‌కి ఒక లేఖ రాశారు. మితిమీరిన పనితో తీవ్ర ఒత్తిడికిగురై తన కుమార్తె చనిపోయారని సంస్థ నుంచి కనీసం ఒక్కరు కూడా అన్నా అంత్యక్రియలకు హాజరు కాలేదని ఆ లేఖలో నిరసన తెలియజేశారు. ఆ లేఖ వైరల్ అయింది. కార్మికులలో, ప్రజలలో తీవ్ర ఆందోళన రేకెత్తించింది.

ఈ విధంగా ఒక వ్యక్తి చనిపోయినప్పుడు పెద్దగా పట్టించుకోకపోవడం అనే సంస్కృతిని పెట్టుబడిదారులు చిరకాలంగా పెంపొందించారు. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు పెద్దగా ఆందోళన ఏమీ జరగకుండా నియంత్రించడం, తక్కిన కార్మికులను, ఉద్యోగులను బెదిరించడం పెట్టుబడిదారులకు బాగా అలవాటైంది. పనిగంటలను పెంచి ఒత్తిడికి గురిచేయడమనేది



సర్వసాధారణమైనది. ఇలాంటి పరిస్థితులను కల్పించడం ఏ మాత్రం సరైన విధానం కాదు. అయినప్పటికీ యాజమాన్యం అదనంగా కొన్ని గంటలు పనిచేయించడానికి వెనుకాడడంలేదు. నిర్ణీత గడువు లోపల ఇంటికి వెళ్లడానికి ఆటంకాలు కల్పిస్తారు. ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం కోసం ఉన్నతస్థాయి యాజమాన్యం కావాలనే మధ్య, దిగువ మేనేజిమెంటు సిబ్బందికి స్వేచ్ఛనిస్తారు. ఏ విధంగానైనా లక్ష్యం నెరవేరేట్లు చేయాలని ఆజ్ఞాపిస్తారు. పనిచేసేచోట దుష్ప్రవర్తన, హింసించడం వంటి చర్యలకు పాల్పడతారు. ఇవన్నీ లోలోపల అణిగిపోయేట్లు చూస్తారు. వీటిని పరిశీలించే అధికారులకు తెలియకుండా జాగ్రత్తపడతారు. ఇటీవల ఎకనామిక్ టైమ్స్‌లో వాణిజ్య బాధ్యత, సుస్థిరతపైన సమాచారాన్ని ప్రచురించారు. 1062 లిస్టెడ్ కంపెనీలకు 940 కంపెనీలు తమ ఉద్యోగులలో అనారోగ్యం, అభద్రత ఏమీలేవని ప్రకటించాయి. అయితే తమకు జరుగుతున్న ఇబ్బందులను, కలుగుతున్న అసౌకర్యాలను ఉద్యోగులు బైటకు చెప్పడంలేదని నిపుణులు తెలియజేశారు. అంతేకాదు, కంపెనీలలో జరిగే వాటి విషయంలో ఏ మాత్రం పారదర్శకత ఉండదు. ఈ విషయాలన్నీ తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. పని ప్రదేశాలలో ఒత్తిడి, ఆందోళన ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. లేఆఫ్‌లు, కార్మికుల పట్ల సానుభూతి ఉండటంలేదనేది ఆందోళన. పనిగంటల అక్రమాలు, పని సమతుల్యత లేకపోవడం, కులం, ప్రాంతం, మతం లాంటి వివక్షత, మానసిక ఆరోగ్యం సక్రమంగా లేకపోవడం తదితర ఇబ్బందులు ఎక్కువగా ఉంటున్నాయి.

లేఆఫ్‌ల భయం:

గత రెండు సంవత్సరాల కాలంలో లక్షన్నరమంది ఉద్యోగులు లే ఆఫ్‌లను ఎదుర్కొన్నారు. అనేక పత్రికల్లో ఈ సమాచారం ప్రచురణ అయింది. దేశంలోఉన్న ఉద్యోగ ధోరణులు పత్రికా వ్యాసాలలో వస్తూనే ఉన్నాయి. నిర్దిష్టమైన పరిశ్రమలలో పరిస్థితి వెల్లడికావడం, ప్రభుత్వ కార్మిక గణాంకాల ద్వారా లేఆఫ్‌ల పరిస్థితి తెలుస్తుంది. లేఆఫ్‌లకు ఆందోళన చెందుతూ అన్ని ఇబ్బందులను సర్దుకుపోతూ ఉన్నారు. వివిధ ఫ్యాక్టరీలు, కంపెనీలలో అక్రమ కార్యకలాపాలను బైటకు పొక్కకుండా కార్మికులు చూడకపోతే చాలా ఎక్కువగా లేఆఫ్‌లు ప్రకటిస్తున్నారు. ఫ్యాక్టరీలలో యూనియన్లు ఏర్పాటుకాకుండా యాజమాన్యం రకరకాల ఎత్తుగడలు వేస్తాయి. కొంతమంది కార్మికులను తొలగించినప్పటికీ ఇతర కార్మికులు ఏమాత్రం సానుభూతిని తెలియజేయడంలేదు. అందుకు యాజమాన్యం ఆటంకపరుస్తుంది. యాజమాన్యం తీసుకున్న ఇలాంటి చర్యలను నిలిపివేయడానికి కార్మికులు ఉమ్మడిగా ఆందోళనచేయడం లేదా ఇతర విధాలైన చర్యలు చేపట్టడానికి ముందుకు రావడంలేదు. అంతేకాదు, సమతుల్యమైన కార్మిక జీవనం, ఉద్యోగుల సంక్షేమం లాంటివి యాజమాన్యం పట్టించుకోదు. ప్రతి కార్మికుడు ఇతర కార్మికుల పట్ల సంఘీభావం తెలియజేయడానికి కూడా రకరకాల ఆటంకాలు కల్పిస్తారు.

ఎనిమిది గంటల పని:

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 8గంటల పని విధానాన్ని నిర్ణయించారు. వారానికి 40గంటల పనిదినాలుగా నిర్ధారించారు. ఇది చట్టబద్ధమైన నిర్ణయం. రోజులో ఎనిమిదిగంటల పని, మరో ఎనిమిది గంటల విశ్రాంతి, మరో ఎనిమిది గంటలు నిద్రకు కేటాయించారు. అయితే ప్రస్తుతం పెట్టుబడిదారులు కార్పొరేట్ల అనుకూల నరేంద్ర మోదీ ప్రభుత్వం చట్టాలను మార్పు చేస్తోంది. రోజులో కనీసం 9గంటల నుంచి 12 గంటల వరకు పనిచేయాలని వారంలో 45గంటలు పనిచేయాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన కార్మిక చట్టాలను సవరించారు. కులం, ప్రాంతం, మతం, వివక్ష దేశంలో చాలా ఎక్కువగా ఉంది. కులం అనేది పనిప్రదేశాల్లో అత్యధికంగా కనిపిస్తోంది. అణగారిన వర్గాల కార్మికుల పట్ల వివక్ష గాఢంగా ఉంది. వీరికి అవకాశాలు తగ్గుతాయి. అంతేకాదు, పనిచేసేచోట వీరు ఎక్కువ ఒత్తిడికి గురవుతుంటారు. ఎక్కువగా ప్రయోజనంలేని ప్రాంతాల కార్మికులు సైతం వివక్షను ఎదుర్కోవలసివస్తుంది. ఫలితంగా ఆరోగ్య సమస్యలు ముఖ్యంగా మానసిక ఆరోగ్యసమస్యలు ఎదురవుతాయి. కులం, ప్రాంతం ఆధారంగా ఉండే కార్మికులు సమైక్యంగా ఉండరు. తరచుగా విభేదాలను ఎదుర్కొంటారు. భారతదేశంలో భిన్నమైన వర్గాలకు చెందిన ప్రజలలో ఇప్పటికీ మతం తదితరవాటి ఆధారంగా వివక్ష పెరుగుతోంది.

భారతదేశంలో మానసిక ఆరోగ్యంపై బహిరంగంగా చర్చించడానికి వెనుకాడతారు. ఒత్తిడి, మానసిక ఆందోళన ఉన్నప్పటికీ వాటిని బైటపెట్టరు. మానసిక అనారోగ్యంపై సమాజంలో అదొక రుగ్మతగా గుసగుసలాడుతుంటారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారాన్నికూడా చూపలేరు. కులం, ప్రాంతం, మతం లాంటివాటిని తొలగించడానికి ప్రభుత్వం ఇంతవరకు గణనీయమైన చర్యలను చేపట్టనేలేదు.

బీజేపీ ఎంపీ విందులో మటన్ వార్

అఖిలేశ్ ఎద్దేవా

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో బీజేపీ ఎంపీ ఇచ్చిన విందులో గందరగోళ పరిస్థితులు చోటుచేసుకున్నాయి. మటన్ కూరలో ముక్కలు లేవని అతిథులు అసహనం వ్యక్తం చేయడమే అందుకు కారణమైంది. ఇది రాజకీయ విమర్శలకు దారితీసింది. వివిధ రకాల యుద్ధాలు చూశానని, కానీ.. ఈ 'మటన్ యుద్ధం' మాత్రం చరిత్రలో నిలిచిపోతుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. మీర్జాపూర్‌లోని తన కార్యాలయంలో బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ బింద్ ఇటీవల విందు ఇచ్చారు. మటన్ కూరలో ముక్కలు లేవని అతిథులు అసహనం వ్యక్తం చేయడంతో గందరగోళం ఏర్పడింది. కొందరైతే ఏకంగా వడ్డించేవారిపై చేయి చేసుకున్నారు. కొందరు బీజేపీ నేతలు జోక్యంతో ఆ గొడవ సద్దుమణిగింది. దీనిపై ఎంపీ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. కానీ వినోద్ కుమార్ కార్యాలయానికి చెందిన వ్యక్తి ఒకరు మాట్లాడుతూ... ఇదంతా మద్యం తాగిన కొందరు వ్యక్తులు చేసిన హంగామా అని అన్నారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అఖిలేశ్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీ నియోజకవర్గంలో ఎన్నో ఘటనలు వెలుగుచూశాయి. కానీ మటన్ వార్ కూడా జరిగిందని నాకు తెలియనే లేదు. నేను ఎన్నో యుద్ధాలు చూశాను కానీ... ఈ యుద్ధం మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది' అని వ్యాఖ్యానించారు. వినోద్ కుమార్ ఎమ్మెల్యేగా రాజీనామా చేసి... సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించడంతో మీర్జాపూర్‌లోని మజావాన్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. దాంతో నవంబర్ 20న అక్కడ ఉపఎన్నిక జరగనుంది. ఆ స్థానంలో విజయం కోసం సమాజ్‌వాదీ పార్టీ, బీజేపీ మధ్య పోటీ నెలకొంది.

మరో 500 ఎస్‌బీఐ బ్రాంచీలు: నిర్మలా సీతారామన్

ముంబై: ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)ను మరింత విస్తరించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా మరో 500 బ్రాంచీలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో బ్యాంకు బ్రాంచీల సంఖ్య 23 వేలకు చేరుతుందన్నారు. ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం 100వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ సోమవారం ప్రసంగించారు. 1921 నుంచి బ్యాంకు ఎలా విస్తరించిందో గుర్తుచేసుకున్నారు. 'అప్పట్లో మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులను విలీనం చేసి ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1955లో పార్లమెంట్‌లో చట్టం చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్చారు. 1921లో 250 బ్రాంచీలు ఉండగా... ఇప్పుడు ఆ సంఖ్య 22,500కు పెరిగింది. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మరో 500 బ్రాంచీలు అందుబాటులోకి రానున్నాయి' అని ఆర్థిక మంత్రి వివరించారు.

బిలియనీర్లు, పేదల మధ్య పోరు

అధికారంలోకి వచ్చిన వెంటనే ధారావి భూములు పేదలకు: రాహుల్

ముంబై: మహారాష్ట్ర ఎన్నికలు ఇద్దరు బిలియనీర్లు, పేదల మధ్య పోరుగా కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. ముంబైలోని భూమి అంతా తమ చేతుల్లోకి వెళ్లాలని ఆ బిలియనీర్లు కోరుకుంటున్నారని అంబానీ, అదానీలను ఉద్దేశిస్తూ పరోక్ష విమర్శలు చేశారు. ముంబైలో సోమవారం రాహుల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ సహా రూ.7 లక్షల కోట్ల ప్రాజెక్టులను మహారాష్ట్ర నుంచి గుజరాత్‌కు తరలించారని మండిపడ్డారు. దీనివల్ల మహారాష్ట్రలో యువత ఉద్యోగాలు కోల్పోయారని ఆయన అన్నారు. 'మహారాష్ట్ర రైతులు, పేదలు, నిరుద్యోగులు, యువతకు సహాయం అవసరం. మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తుంది. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి మహిళ బ్యాంకు ఖాతాలో ఉచితంగా రూ.3000 జమ చేస్తాం, మహిళలకు, రైతులకు బస్సు ప్రయాణం, రూ.3 లక్షల వరకు రుణమాఫీ చేస్తాం. సోయాబీన్‌కు క్వింటాల్‌కు రూ.7 వేలు మద్దతు ధర ఇస్తాం. తెలంగాణ, కర్నాటకలో మాదిరి మహారాష్ట్రలోనూ కులగణన పూర్తి చేస్తాం. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించి, దేశంలో కుల గణన నిర్వహిస్తాం' అని రాహుల్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు చేయడంపై రాహుల్ గాంధీ స్పందించారు. మోదీ ఇచ్చిన 'సేఫ్' నినాదాన్ని ఖండించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న ప్రధాని కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 'ఏక్ హై తో సేఫ్ హై' (ఐక్యంగా ఉంటేనే మనమంతా సురక్షితంగా ఉంటాం) అని ప్రజలకు పిలుపునిచ్చారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ 'పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే మోదీ సర్కార్ పని చేస్తోంది. పేదల గురించి వారికి ఎలాంటి ఆలోచన లేదు. ధారావిలోని నివాసితుల ప్రయోజనాలను విస్మరించారు. మహారాష్ట్రలో ఎంవీఏ కూటమి అధికారంలోకి వచ్చాక అక్కడి ప్రజలకు భూములు తిరిగి అప్పగిస్తుంది' అని రాహుల్ హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వారికే ప్రాజెక్టులు అప్పగించాలంటూ కేంద్ర సంస్థలు పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని కాంగ్రెస్ నేత ఆరోపించారు. 'ప్రధాని ఇచ్చిన సేఫ్ నినాదంపై ఒక సందేహం ఉంది. ఐక్యంగా ఉంటేనే సురక్షితం అన్నారు. ఇక్కడ ఎవరి సురక్షితం గురించి ఆయన మాట్లాడారు' అని ప్రశ్నించారు. ధారావిలో రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియ కొందరి ప్రయోజనాల కోసమే రూపొందించారని తీవ్ర ఆరోపణలు చేశారు.

ర్యాగింగ్ భూతం...

- వైద్య విద్యార్థి మృతి...
- 15 మంది సీనియర్లపై కేసు

అహ్మదాబాద్: చట్టాలెన్ని ఉన్నా విద్యాలయాల్లో వికృత చేష్టలకు ఫుల్‌స్టాప్ పడడం లేదు. ర్యాగింగ్ పేరిట సీనియర్లు పెట్టే హింసలు తట్టుకోలేక బంగారు భవిష్యత్ కోసం కలలుగన్న విద్యాకుసుమాలు నేలరాలుతున్నాయి. ఇదే తరహాలో గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోని ధర్‌పూర్‌లో గల జీఎమ్ఈఆర్ఎస్ మెడికల్ కళాశాలలో రెండు రోజుల క్రితం సీనియర్ల ర్యాగింగ్‌కు ఓ వైద్య విద్యార్థి బలికాగా, కారకులైన 15 మందిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలివి. అనిల్ మథానియా అనే విద్యార్థి జీఎమ్ఈఆర్ఎస్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సీనియర్లు శనివారం రాత్రి మొదటిఏడాది విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ర్యాగింగ్‌లో భాగంగా అనిల్‌ను మూడు గంటల పాటు నిలబెట్టారు. దీంతో అతడు ఒక్కసారిగా అపస్మారకస్థితిలోకి చేరుకుని కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినా ఫలితం లేదు. చికిత్స పొందుతూ అనిల్ ప్రాణాలు కోల్పోయాడు. సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ వల్లే అనిల్ మరణించాడంటూ అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా... ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థులపై మేనేజ్‌మెంట్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. వీరిని హాస్టల్, కళాశాల నుంచి సస్పెండ్ చేసినట్లు మెడికల్ వైద్య కళాశాల అధికారులు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై ఈ చర్యలు అమల్లో ఉంటాయని వెల్లడించారు.

షిండే హయాంలో

రైతులకు తీరని అన్యాయం

- వ్యవసాయం గిట్టుబాటు కాక 20 వేలమంది ఆత్మహత్య
- 'మహాయుతి' సర్కారుపై శరద్‌పవార్ మండిపాటు

ముంబై: మహారాష్ట్రలో వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడంలో మహాయుతి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ విమర్శించారు. ఈ నెల 20వ తేదీన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా ప్రచారానికి చివరి రోజైన సోమవారం ఆయన అహల్యానగర్ జిల్లాలోని (గతంలో అహ్మద్‌నగర్) కర్జత్-జామ్‌ఖేడ్‌లో తన పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్ పవార్ గెలుపు కోసం నిర్వహించిన సభలో ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొందని, దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇందుకు కారణం వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడమేనన్నారు. మహాయుతి ప్రభుత్వ హయాంలో 20 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని... ఇంత జరుగుతున్నా ప్రభుత్వం వారి కష్టాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రుణాలు మాఫీ చేస్తున్నదే కానీ రైతులకు మాత్రం మొండి చేయి చూపుతోందన్నారు. కనీసం రుణాలు మాఫీ చేసినా ఆపదలో ఉన్న రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. జన్‌ధన్ ఖాతాల్లో రూ. 15 లక్షలు జమ చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేయని వాగ్దానం మాదిరిగానే షిండే ప్రభుత్వ ప్రధాన లడ్కీ బహిన్ యోజన కూడా ఎన్నికల తర్వాత రద్దు చేయబడుతుందని పవార్ అన్నారు. ఈ పథకం కింద కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షల లోపు ఉన్న మహిళలకు నెలవారీ సాయంగా రూ.1500 అందజేస్తారు.

రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకుంటే ఈ మొత్తాన్ని రూ.2100కు పెంచుతామని మహాయుతి పార్టీలు బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (పవార్) చెబుతున్నాయి. 'గత కొన్నేళ్లలో మహిళలపై హింసకు సంబంధించి 67,000 ఫిర్యాదులు నమోదయ్యాయి. అదనంగా 64వేల మంది మహిళలు తప్పిపోయారు. రాష్ట్రంలో దాదాపు 62 లక్షల మందికి ఉద్యోగాలు లేవు. ఇవి కఠోర వాస్తవాలు" అంటూ పవార్ పాలక కూటమిపై దాడి చేశారు. రోహిత్ పవార్‌కు వ్యతిరేకంగా పోటీ పడుతున్న బీజేపీ నాయకుడు రామ్ షిండేపై కూడా పవార్ విమర్శలు గుప్పించారు.

గతంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏమీ చేయనందున కర్జత్-జామ్‌ఖేడ్ ప్రాంతం అభివృద్ధి చెందలేదని పవార్ అన్నారు. షిండే 2009, 2014లో విజయం సాధించగా... 2019లో రోహిత్ పవార్ చేతిలో 43,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. "నేను ఒకసారి ఇక్కడికి వచ్చి విలాసవంతమైన బంగ్లాను చూశాను మరియు కరువు పీడిత ప్రాంతంలో అలాంటి ఇల్లు ఎవరు కొనుగోలు చేయగలరని ఆలోచిస్తున్నాను. మీరు సమాధానం ఊహించవచ్చు" అని పవార్ రామ్‌షిండేను ఉద్దేశించి చెప్పారు. 'నేను ఎమ్మెల్యేగా రాజకీయ ప్రయాణం ప్రారంభించాను, ఆ తర్వాత జూనియర్ మంత్రి అయ్యాను, తరువాత కేబినెట్ మంత్రి అయ్యాను. చివరికి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రిని అయ్యాను. రోహిత్ పవార్ తన మొదటి పదవీకాలాన్ని పూర్తి చేస్తున్నారు. మీ మద్దతుతో, అతను తదుపరి టర్మ్‌లో తన పురోగతిని కొనసాగించగలడు' అని పవార్ అన్నారు. పూణే నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తాను కృషి చేశానని, అక్కడ గ్రామీణ పారిశ్రామిక వృద్ధిని కూడా పెంచానని, అహల్యానగర్‌కు కూడా అదే విధంగా ప్రణాళిక రూపొందించామని పవార్ చెప్పారు. దీనిని సాధించాలంటే రోహిత్ పవార్‌ను గెలిపించాలని కోరారు.

పొగమంచు... చలిగాలులు

వాతావరణశాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ: దేశమంతటా చలి వాతావరణం నెలకొంది. కొన్ని రాష్ట్రాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో వీస్తున్న చలి గాలులు ప్రజలను గజగజ వణికిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. రాజధాని ఢిల్లీలో ఉదయం, సాయంత్రం వేళల్లో పొగమంచు కమ్ముకోవడంతో పాటు విపరీతంగా చలిగాలులు వీస్తున్నాయి. వాయుకాలుష్యంతో ఢిల్లీ పరిస్థితి అధ్వానంగా మారింది. ఉత్తర భారతదేశంలో రానున్న రోజుల్లో పొగమంచు, చలి పెరుగుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దక్షిణ భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. వాతావరణ శాఖ అందించిన తాజా సమాచారం ప్రకారం హర్యానా, చండీగఢ్, ఉత్తర రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉంది. రాబోయే ఐదు రోజుల్లో హిమాచల్ ప్రదేశ్, సబ్-హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కిం, పశ్చిమ అసోం, మేఘాలయలోని వివిధ ప్రాంతాలలో ఉదయం తీవ్రమైన చలి ఉంటుంది. మాల్దీవుల మీదుగా దిగువ ట్రోపోస్పియర్‌లో, భూమధ్యరేఖ హిందూ మహాసముద్రంలో తుపాను సూచనలు కొనసాగుతున్నాయి. దీని కారణంగా ఆగ్నేయ అరేబియా సముద్రం వరకు భారత ప్రాంతంలో ద్రోణి ఏర్పడింది. ఫలితంగా దక్షిణ భారతదేశంలో గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు, మెరుపులు వచ్చే అవకాశం ఉంది. తూర్పు అరేబియా సముద్రం, లక్షద్వీప్ ప్రాంతం, కొమోరిన్ ప్రాంతం, దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ మీదుగా బలమైన గాలులతో టైఫూన్ వచ్చే అవకాశం ఉంది. మంగళవారం తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, అండమాన్ నికోబార్ దీవుల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

పది మంది శిశువులను కాపాడి... సొంత బిడ్డలను కోల్పోయాడు

లక్నో: మానవత్వం మూర్తీభవించిన ఓ వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాదం నుంచి పది మంది శిశువులను కాపాడి... తన కవల కుమార్తెలను రక్షించుకోలేకపోయిన హృదయవిదారక ఘటన ఇది. కాలి బొగ్గుగా మారిన శిశువుల్లో తన పిల్లలను గుర్తుపట్టలేక అల్లాడిపోవడం చూపరులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే... ఉత్తరప్రదేశ్ ఝాన్సీలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి 10.45 గంటల సమయంలో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదంలో 10 మంది నవజాత శిశువులు కాలి మృతి చెందారు. మరో 16 మంది శిశువులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో చాలా మంది నెలలు నిండకుండానే జన్మించారు. కాగా, పిల్లల వార్డు బయట పేవ్‌మెంట్‌పై నిద్రించిన యాకూబ్ మన్సూరి అనే వ్యక్తి ఆ మంటలను చూసి ఆందోళన చెందాడు. వెంటనే స్పందించిన అతడు కిటికీ పగులగొట్టి కొంత మంది నవజాత శిశువులను రక్షించి బయటకు తీసుకువచ్చాడు. అయితే ఆరుబయట నిద్రిస్తున్న నవజాత శిశులైన తన ఇద్దరు కవల కుమార్తెలను కాపాడుకోలేకపోయాడు. కాలి బొగ్గుగా మారిన శిశువుల్లో తన పిల్లలు ఎవరో గుర్తుపట్టలేక బాధతో అల్లాడిపోయాడు. మరోవైపు మంటల్లో కాలిపోయిన పిల్లల వార్డు వద్ద శిశువులను కోల్పోయిన తల్లుల రోధనలు మిన్నంటాయి.

ఒక్కరోజులో భారీగా పంట వ్యర్థాల దహనం

మరింతగా పెరిగిన కాలుష్యం

చండీగఢ్: పంజాబ్‌లో ఆదివారం ఒక్కరోజున 400కి పైగా పంట వ్యర్థాలు తగులబెట్టిన సంఘటనలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఈ తరహా కేసుల సంఖ్య 8,404కి చేరుకుంది. రిమోట్ సెన్సింగ్ డేటా సాయంతో ఈ సమాచారం వెలుగులోకి వచ్చింది. పంజాబ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు మీడియాతో మాట్లాడుతూ కొత్తగా 404 వరకూ పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. వాటిలో ఫిరోజ్‌పూర్‌లో 74, భటిండాలో 70, ముక్త్‌సర్‌లో 56, మోగాలో 45, ఫరీద్‌కోట్‌లో 30 ఘటనలు ఉన్నాయన్నారు. ఫిరోజ్‌లో అత్యధికంగా పంటవ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కాగా పంజాబ్‌లో 2022లో ఒకేరోజులో 966, 2023లో 1155 పంట వ్యర్థాలు తగులబెట్టిన కేసులు నమోదయ్యాయి. గత సెప్టెంబరు 15 నుండి నవంబర్ 17 వరకు పంజాబ్‌లో 8,404 పంటవ్యర్థాలు తగులబెట్టారు. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇటువంటి సంఘటనలలో 75 శాతం తగ్గుదల కనిపించింది. పంజాబ్, హర్యానాలో అక్టోబర్, నవంబర్‌లో వరి పంట కోసిన తర్వాత భారీ ఎత్తున పంట వ్యర్థాలు తగులబెడుతుంటారు. ఇది ఢిల్లీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వాయు కాలుష్యం పెరగడానికి కారణంగా నిలుస్తోంది.

మణిపూర్‌లో ఆగని హింస

పోలీసు కాల్పుల్లో ఒకరి మృతి

అధికారులతో అమిత్ షా సమీక్ష

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరోసారి రగులుతోంది. భద్రతా బలగాల పహారాలో కొంతకాలం దాడులు ఆగినా... తాజాగా మళ్లీ హింస చెలరేగింది. కుకీలు, మైతేయి తెగల మధ్య వైరంతో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మణిపూర్‌లోని లోయ ప్రాంతాల్లో ఆదివారం జరిగిన నిరసనలు, హింసాత్మక ఘటనల్లో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఆందోళనకారులను చెదరగొట్టే క్రమంలో జిరిబామ్ జిల్లాలో భద్రతాదళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 20 యేళ్ల అతౌబా మృతిచెందాడు. బాబుపరా వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. బాబుపరా ప్రాంతంలో కొన్ని పార్టీలకు చెందిన కార్యాలయాలపై ఆందోళనకారులు దాడులు చేశారు. జిరిబామ్ పోలీస్ స్టేషన్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల్లోకి చొరబడిన ఆందోళనకారులు... ఫర్నీచర్ ఎత్తుకెళ్లి, ఆఫీసులు తగలబెట్టారు. దీంతో శాంతి భద్రతల కోసం భద్రతా దళాలు మోహరించడంతో జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాయపడిన వ్యక్తిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి చికిత్స కొనసాగుతోంది. మరోవైపు మణిపూర్‌లో పరిస్థితిపై చర్చించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. హోంమంత్రిత్వ శాఖలోని ఈశాన్య విభాగానికి చెందిన సీనియర్ అధికారులు, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్), అస్సాం రైఫిల్స్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. కుకీ మిలిటెంట్లు ఇటీవల జిరిబామ్ జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో 11 మంది కుకీలు మృత్యువాతపడ్డారు. అనంతరం ఆరుగురు మైతేయి వర్గానికి చెందిన వారిని మిలిటంట్లు బందీలుగా తీసుకెళ్లారు. వారి మృతదేహాలు లభ్యం కావడంతో జిరిబామ్ జిల్లాలో హింస చెలరేగింది. దీంతో దాదాపు 7 జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి కర్ఫ్యూ విధించారు.

సోషల్ మీడియా చెల్లింపులు ఉండాల్సిందే

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: తమ వేదికలపై షేరైన, చదివే కంటెంట్‌కు సోషల్ మీడియా సంస్థలు... సంప్రదాయ వార్తా సంస్థలకు చెల్లింపులు చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఆ మొత్తం తగినంతగా, న్యాయబద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. వార్తలు చదివే తీరు రోజురోజుకు మారుతోందని, దీంతో సంప్రదాయ వార్తా సంస్థల డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు మారిందని పేర్కొన్నారు. దీనివల్ల వార్తా సంస్థలకు నష్టం వాటిల్లుతోందన్నారు. వార్తల సేకరణ, జర్నలిస్టులకు శిక్షణ, వారికి వేతనాలతో పాటు సంబంధిత కంటెంట్ ఆ మీడియా సంస్థ బాధ్యత వహించడం వంటి వాటికి పెద్ద మొత్తంలో డబ్బు, సమయం ఖర్చవుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో సంప్రదాయ మీడియాతో పోలిస్తే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లకయ్యే ఖర్చు తక్కువన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో నకిలీ వార్తలు, తప్పుడు సమాచారానికి ఆస్కారం ఎక్కువ అని, దీనిపై చర్చ జరగాల్సి ఉందన్నారు. సామాజిక మాధ్యమాల్లో షేర్ అయ్యే సమాచారం కొన్నిసార్లు అల్లర్లు, సమాజంలో శాంతికి విఘాతం కల్పించిన ఉదంతాలూ ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అయితే, సంబంధిత కంటెంట్‌కు సామాజిక మాధ్యమాలు బాధ్యత వహించడం లేదన్నారు. ఇలాంటి వాటిపై అప్రమత్తత అవసరమన్నారు. అయినా, సంప్రదాయ మీడియాలానే సామాజిక మాధ్యమాలూ ఎందుకు బాధ్యత వహించకూడదు అని ప్రశ్నించారు. వినియోగదారులపై ప్రభావం చూపేలా కంటెంట్‌ను సోషల్‌మీడియా అల్గారిథమ్ చూపించడంపై ఆందోళన వెలిబుచ్చారు.

అంబులెన్స్‌కు దారివ్వని వ్యక్తికి రూ.2.5 లక్షల జరిమానా

తిరువనంతపురం: అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ వ్యక్తికి పోలీసులు రూ.2.5 లక్షల జరిమానా విధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా రోడ్డుపై సైరన్ మోగిస్తూ అంబులెన్స్ వెళ్తుందంటే ఎవరో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని అర్థం. అంబులెన్స్ సౌండ్ వినిపించగానే ఎంతటివారైనా సరే వెంటనే తమ వాహనాలను పక్కకు తీస్తారు. సెలబ్రిటీలైనా చివరికి ప్రధాని, రాష్ట్రపతి అయినా సరే అంబులెన్స్ వెళ్లేందుకు దారి ఇస్తారు. అయితే, ఇవేమీ పట్టించుకోని కొందరు ఆకతాయిలు అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోగా... అడ్డుగా వెళ్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా కారు నడిపినందుకు పోలీసులు అతడవ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా... భారీ జరిమానా కూడా విధించారు. ఈ ఘటన కేరళలో ఈ నెల ఏడో తేదీన జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని చలకుడిలోని పొన్నాని నుంచి త్రిస్సూర్ మెడికల్ కాలేజీకి అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. రోడ్డుపై అంబులెన్స్ వెళ్తుంటే అన్ని వాహనాలూ సైడ్‌కు వెళ్లాయి. అయితే, ఓ కారు మాత్రం అంబులెన్స్ హారన్ కొడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. సుమారు రెండు కిలోమీటర్లు అంబులెన్స్ ఆ కారు వెనకాలే వెళ్లాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఆ కారు ఎవరిదో గుర్తించారు. నేరుగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి.. అంబులెన్స్‌కు దారి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో అతడు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అతడికి దాదాపు రూ.2.5 లక్షల జరిమానా విధించారు. అతడి లైసెన్స్ కూడా రద్దు చేశారు.

బీజేపీలో చేరిన కైలాశ్ గెహ్లోత్

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రముఖ నేతలు పార్టీలు మారడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. ఇదే కోవలో ఆప్‌లో కీలక నేతగా వ్యవహరించిన కైలాశ్ గెహ్లోత్ సోమవారం బీజేపీలో చేరారు. ఢిల్లీ రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ఆదివారం ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కేజ్రీవాల్‌కు లేఖ పంపారు. పార్టీని వీడేముందు... ఢిల్లీ ప్రభుత్వం అసంపూర్తి హామీలు ఇస్తోందని.. పార్టీ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని ఆ లేఖలో ఆరోపించారు. కైలాశ్ గెహ్లోత్ రాజీనామాపై ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ స్పందించారు. బీజేపీ దిగజారుడు రాజకీయాలతో కుట్రలను విజయవంతంగా అమలుచేస్తోందని మండిపడ్డారు. గెహ్లోత్‌ను సీబీఐ, ఈడీ వంటి ఏజెన్సీలు టార్గెట్ చేశాయని ఆరోపించారు. బీజేపీ రాసిచ్చిన స్క్రిప్టు ప్రకారమే ఆయన ఇప్పుడు ఆరోపిస్తున్నారని అన్నారు. దీనిపై స్పందించిన కైలాశ్... 'ఎమ్మెల్యే, మంత్రిగా ఢిల్లీకి నావంతు సేవలు అందించాను. ఇది రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయమని కొందరు భావిస్తున్నారు. ఒత్తిడి వల్లే ఇలా చేశానని అంటున్నారు. దానివల్ల ఎప్పుడూ నేను ఏ నిర్ణయం తీసుకోలేదని వారికి స్పష్టం చేస్తున్నాను' అని వెల్లడించారు. ఇదిలాఉండగా... మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ప్రజలు తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చేవరకూ పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి అందరికీ తెలిసిందే. అప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్, రాఘవ్ ఛడ్డా, కైలాశ్ గెహ్లోత్ పేర్లు వినిపించాయి. చివరకు ఆతిశీ వైపే పార్టీ మొగ్గుచూపింది. అది కూడా కైలాశ్ అసంతృప్తికి కారణం కావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఐపియల్ జిల్లా కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర -హైదరాబాద్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ మహబూబ్ నగర్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాసభలో ఐఏయల్ జిల్లా అధ్యక్షులు బి పరమేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బిఆర్ విల్సన్ ఎన్నికయ్యారు వీరితో పాటు 25 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ ఐఏయల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు బేక్కం జనార్దన్, జిల్లా అధ్యక్షులుగా పరమేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బిఆర్ విల్సన్, కార్యదర్శిగా ఆర్ఆర్ మణ్యం, జాయింట్ కార్యదర్శి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్రావు, సజ్జద్ హామీదు, కమిటీ సభ్యులుగా జగదీష్, ఎస్వి మహేష్, నరసింహ, రామకృష్ణ గౌడ్, ఉబేద్, సజ్జత్ అమేద్, వేణుగోపాల్ గౌడ్, మహమ్మద్ ఇలియాసు ఎన్నుకోబడ్డారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల కోసం, ఐఏఎల్ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ కొనసాగుతున్న ఆర్‌సిసి పైపుల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా నెరవేస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము యాదవ్, కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సౌండ్‌బార్‌ను ఆవిష్కరించిన బ్లౌపంక్ట్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : మహోన్నతమైన ఆడియో ఆవిష్కరణలకు ప్రసిద్ధి చెందిన బ్లౌపంక్ట్ తన తాజా ఎస్‌బిఎ 02 సౌండ్‌బార్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కాంపాక్ట్ పవర్‌హౌస్ ఆడియో పనితీరు కోసం కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుంది, అత్యాధునిక సాంకేతికత, అత్యుత్తమ డిజైన్‌ను కలిపి అసమానమైన ధ్వని అనుభూతిని అందిస్తుంది. అగ్రగామి ఆడియో పరిష్కారాలను అందించిన చరిత్రతో, ఆకర్షణీయమైన, భవిష్యత్ ఆలోచనలు కలిగిన ఉత్పత్తులను విడుదల చేయటంలో భాగంగా సరికొత్తగా ఎస్‌బిఎ 02ని బ్లౌపంక్ట్ పరిచయం చేసింది. సౌండ్‌బార్ యొక్క విలక్షణమైన వెడ్జ్-ఆకారపు డిజైన్ చూడటానికి ఆకర్షణీయంగా ఉండటంతో పాటుగా గదికి అద్భుతమైన సౌందర్యాన్ని అందించడమే కాకుండా స్థిరత్వాన్ని మెరుగుపరుస్తుంది, క్రిస్టల్-క్లియర్ ఆడియో అనుభవం కోసం వైబ్రేషన్‌లను తగ్గిస్తుంది. ఫ్రంట్ గ్రిల్, దాని ప్రత్యేకమైన తేనెపట్టు నమూనాతో, ఆకృతిని బలోపేతం చేయడమే కాకుండా, సౌండ్ డిస్పర్షన్‌ను మెరుగుపరచడం చేస్తుంది, ప్రతి స్వరం స్పష్టతతో వినబడేలా చేస్తుంది. కాంపాక్ట్ డిజైన్ నుండి ఆకట్టుకునే శబ్ద నాణ్యత 30 వాట్‌ల వద్ద ఎస్‌బిఎ 02 రేట్ చేయబడినప్పటికీ, ఇది కేవలం ఆకట్టుకునే పవర్ ఫిగర్‌ల కంటే చాలా ఎక్కువ అందించేలా బ్లౌపంక్ట్ నిశితంగా పనిచేసింది. ఫ్లికర్, పల్స్ ఎఫెక్ట్‌లతో సహా వివిధ లైటింగ్ మోడ్‌లతో, ఈ సౌండ్‌బార్ ఆడియోను మించినది, ఏదైనా స్థలాన్ని సజీవమైన, లీనమయ్యే వాతావరణంగా మారుస్తుంది. బ్లౌపంక్ట్ ఎస్‌బిఎ 02 అమెజాన్, బ్లౌపంక్ట్ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంది.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర - కాప్రా : న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)లో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడంతో ఏఐటీయూసీ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని ఎన్‌పీసీఐఎల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)లో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కార్మికుల పట్ల ఎన్‌పీసీఐఎల్ అధికార యంత్రాంగం ఉదాసీనత వ్యక్తం చేయాలని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులను సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని, వారికి పనిచేసిన జీత భత్యాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ పక్షాన నిరంతరం పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.శంకర్రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శి సత్యప్రసాద్, ఏఐటీయూసీ నేతలు నారా నర్సింహ, లక్ష్మీ నారాయణ, నర్సింహారావు, స్వామిదాస్, లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన కూన

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బసంతి భాయ్, ప్రకాష్ గౌడ్, కృష్ణ, నారాయణ రాజులకు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60000 చెక్కులను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నలుగురికి తన నివాసంలో ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి భాదిత మహిళ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, మల్లం శ్రీనివాస్, సంజయ్ కుమార్ మోతే శ్రీనివాస్, గుమస్తా మధుసూదన్, షాకీర్, రామిరెడ్డి, నరేందర్ తోకల శ్రీను, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో

మంత్రి సీతక్క విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పొరుగున ఉన్న బల్లార్షా, చంద్రపూర్, రజురా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సోమవారం నాడు పాల్గొన్నారు. కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సహచర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి విస్తృతంగా పర్యటించారు. రాజూర కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ భారీ బహిరంగ సభలో ప్రసగించారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సుభాష్ దోటేను మరో సారి ఆశీర్వదించాలని కోరారు. బీజేపీ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను మంత్రి సీతక్క ఎండగట్టారు. దేశానికి, మహారాష్ట్రకు ప్రమాదకారిగా బీజేపీ మారిందని హెచ్చరించారు. కుటుంబాలను, పార్టీలను, సమాచాన్ని చీలుస్తూ విధ్వంస రాజకీయాలకు బీజేపీ పాల్పడుతుందని వెల్లడించారు. కులం, మతం, వర్గం పేరుతో ప్రజలకు చీల్చుతూ ఆదానీ, అంబానీ, ప్రధాని ఒక్కటై దేశాన్ని లూటి చేస్తున్నారని మండిపడ్డారు. దోపిడి సొమ్మును ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పది సంవత్సరాల్లో కేంద్రంలో, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిన మేలు శూన్యమని సీతక్క తెలిపారు. రూ.400 ఉన్న వంటింగ్ గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200 పెంచిన ఘనత బీజేపీ సొంతమని ఎద్దేవ చేసారు. నిత్యవసరల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని గుర్తు చేసారు. ప్రజల భారాలని గుర్తించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని వెల్లడించారు. గృహిణుల వంటింటి భారాన్ని తగ్గించేందుకు రూ.500 కే సిలిండర్ ఇస్తున్నట్లు తెలిపారు. పంటరుణ మాఫీ, 200 యునిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పంట బోనస్ ఇలా ఎన్నో పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమిని గెలిపిస్తే తెలంగాణ తరహాలోనే గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా, సరిహద్దులో గల మహారాష్ట్ర గ్రామాల అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

మోదీజీ ఎరుపంటే ఎందుకంత భయం?

ప్రధాని నరేంద్ర మోదీకి ఎరుపంటే ఎందుకంత భయం అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎరుపు రంగు కవర్‌తో ఉన్న రాజ్యాంగ పుస్తకాన్ని చూపిస్తే ప్రధానికి భయం దేనికని ప్రశ్నలు సంధించారు. ప్రధాన నరేంద్ర మోదీ రక్తం కూడా ఎరుపు రంగులో ఉందని..ఎరుపు రంగు అంటే బెదిరిపోవాల్సిన అవసరం లేదన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే బీజేపీ ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అందరికి జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కును, మతస్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగాన్ని మార్చడం అంటే ప్రజల జీవించే హక్కును కాలరాయడమే అన్నారు. అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న సందేశంతో రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ యాత్ర చేస్తుంటే మోదీ, బీజేపీ నేతలు తట్టుకోలేకపోతున్నారని సీతక్క పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు.

మానవ హక్కుల కమిషన్‌ను కలిసిన లాగచర్ల రైతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫార్మా కంపెనీ పేరుతో లాక్కుంటున్న మా భూములను, దాడుల పేరుతో అరెస్ట్ చేసిన మా వారిని వదిలేయాలని లాగచర్ల బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను కోరారు. సోమవారం నాడు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్ ను లగచర్ల బాధిత రైతులు కలిశారు. అనంతరం మీడియాతో బాధితులు, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ మా భూములు ఇచ్చేది లేదంటూ గత 9 నెలలుగా మేము చాలా ధర్నాలు చేస్తున్నామని చెప్పారు. మేము ధర్నాలు చేసినప్పుడు సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి, కలెక్టర్ సహా ఏ అధికారి రాలేదని, కానీ మొన్న మాత్రం కలెక్టర్ సాధారణ దుస్తుల్లో పోలీసు సెక్యురిటీ లేకుండా రావడంతో కొంతమంది పిల్లలు తెలియకుండా దాడి చేశారన్నారు. ఆ దాడిని సాకుగా చూపి అర్ధరాత్రి రాత్రి 500 మంది పోలీసులు వచ్చి, కరెంట్ బంద్ చేసి మాపై దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కుతిక పిసికి, కళ్లకు బట్టలు ఇష్టానుసారం బూతులు తిడుతూ కొట్టారని, మగవాళ్లందరనీ అరెస్ట్ చేశారు, మిగిలిన మగవాళ్లు ఊరు వదిలి పారిపోయారన్నారు. మేము మా భూములు ఇవ్వమని చెబుతున్నామని కావున మా భూములను వదిలేయాలి, మా వారిని వదిలేయండని వేడుకున్నారు. మాకు ఉన్న మొత్తం భూమిని తీసుకుంటా అంటే మేము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎప్పుడు పోలీసులు వచ్చి ఏం చేస్తారోనని ఇంట్లో ఉండాలంటేనే భయం వేస్తోందని, మా ఇంట్లో ఉన్న మగవాళ్లందరినీ తీసుకెళ్లారు. ఎనిమిది రోజులుగా మా పిల్లలు ఎక్కడున్నారో తెలియదు వారిని కూడా తీసుకెళ్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మేము చాలా బాగా బతికాం కానీ గత 9 నెలలుగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. మా ప్రాణాలు పోయినా సరే ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని, రేవంత్ రెడ్డిని కలిసేందుకు వెళ్తే మమ్మల్ని బెదిరించి పంపించారని ఆరోపించారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతున్న వారి జీవనాధారాన్ని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. 9 నెలలుగా తమ భూములు ఇవ్వమని రైతులు చెబుతూనే ఉన్నారని, భూములు తీసుకుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారు. దాన్ని సాకుగా చూపి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అర్ధరాత్రి కరెంట్ తీసేసి, ఇంటర్ నెట్ బంద్ చేసి మహిళలను హింసించారు, కొట్టారు, బూతులు తిట్టారన్నారు. 51 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారు, ఊళ్లో ఉన్న మగవాళ్లంతా పారిపోయారు. మళ్లీ ఏం చేస్తారోనని భయపడుతున్నారన్నారు. తమకు అండగా ఉండాలని రైతులు అన్ని పార్టీల నాయకులను కోరారు. అలాగే బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన గాంధీ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో 18 తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించే క్రీడా ఉత్సవాలు - స్పోర్ట్స్ మీట్- 2024 కార్యక్రమంను ఏంఈఓ వెంకటయ్యతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో క్రీడా మహోత్సవం (స్పోర్ట్స్ మీట్) నిర్వహించడం చాలా అభినందించదగ్గ విషయం అని, సుమారు 50 పాఠశాలల విద్యార్థులు 5,000 మంది, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, ఖో, ఖో, క్రికెట్, రన్నింగ్ వంటి ఆటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిల్లలలో దాగిన సృజనాత్మకతను బయటకి వెలికితీయడానికి ఎంతగానో తోడ్పడుతుందని, పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యమని, క్రీడలతో శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎండీ ఇబ్రహీం, లయన్ డా.వేంకటేశ్వరరావు, ఆచార్య శ్రీనివాస్ శంకర్, రెహ్మాన్, అనిల్ కుమార్, ఎన్.ఎస్.రావు, భీస్మారెడ్డి, భరత్ కుమార్, రాజు, విజయ్, ప్రద్యుమ్న, ప్రవీణ్, పవన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షునికి ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రజలు జాతీయ సమైక్యత, మత సామరస్యం, శాంతి స్థాపనకై కృషిచేసి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పాల్గొనాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ మేధావులు ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఇందిరాగాంధీ ఎక్సలెంసీ అవార్డు 2024ను తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ శాలువా, జ్ఞాపిక, పూలమాలతో ఘనంగా సన్మానించి అవార్డును ప్రధానం చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా జాతీయ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పిసిసి కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా సేవలందించారని, సెప్టెంబర్ 15న 2024 తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికై, జనవరి 29, 2024లో శాసనమండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఒకే తాటిపై నడిపిస్తూ అన్ని వర్గాల సంక్షేమ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అన్నారు. రాష్ట్రం నుంచి ఈ అవార్డు మహేష్ కుమార్ గౌడ్ ఒకరికి ఎంపిక చేసి ప్రదానం చేశామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు ప్రముఖ హైకోర్టు న్యాయవాది జి.సీతారామరాజు, పీసీసీ కార్యదర్శి, సెట్విన్ మాజీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బి వెంకటేష్ ముదిరాజ్, టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అఖ్తర్ అలీ, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ అధ్యక్షులు బత్తుల హేమంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌని నరసింహ గౌడ్ పాల్గొని మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఈ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావు 50 వేల రూపాయలు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈగా పనిచే స్తున్న పాండురంగారావు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ కృష్ణయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలో రూ.35 లక్షల నిధులతో మైనార్టీ కమిటీ హాల్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయ్యి ఆరు నెలలు గడుస్తున్నా బిల్లులు కాకపోవడంతో పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావుని కాంట్రాక్టర్లు మహ్మద్ హుస్సేన్, జగదీశ్వర్ రెడ్డి, లాలు లక్ష్మీనారాయణలు ఎన్నోసార్లు బతిమాలారు. బిల్లులు చేయాలంటే లక్ష రూపాయలు ఇస్తే తప్ప చేయనని పాండురంగారావు మొండికేశాడు. చేసేదేమీ లేక బిల్లుల కోసం రూ.50,000 ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత ఏసీబీ అధికారులకు ముందస్తు సమాచారం అందించారు. దీంతో సోమవారం మధ్యాహ్నం యథావిధిగా పాండు రంగారావుకి కాంట్రాక్టర్లు ఫోన్ చేసి రూ.50,000 ఎక్కడ ఇవ్వాలని అడిగారు. ఎర్రవల్లి చౌరస్తాలో ఒక షాపునందు ఇవ్వాలని చెప్పాడు. ప్లాన్ చేసిన కాంట్రాక్టర్లు పాండు రంగారావుకు రూ.50000 ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ప్రజా పాలన సంబరాలు పేరిట సాంస్కృతిక ఉత్సవాలను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పదేళ్ల కేసిఆర్ పాలనలో ప్రజలు నానా కష్టాలు అనుభవించారని, ఆక్రమణలు అవినీతి తప్ప పాలన అన్నది కనిపించలేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు బిల్లులు, ఉచిత సిలిండర్ తో పాటు ఎన్నో పథకాలను వెలుగులోకి తెచ్చామన్నారు. అయితే అధికారం కోల్పోయి మతి చెల్లించిన బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ప్రజలకు నిరంతరం అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. షాద్ నగర్ ఆర్డీవో సరిత, డిపిఆర్వో వెంకటేశం, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య, పార్టీ నాయకులు బాబర్ అలీ ఖాన్, రఘు, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, విశ్వం, సర్వర్ పాషా, ఇబ్రహీం, ముబారక్, బాలరాజ్ గౌడ్, జమ్రుద్ ఖాన్, ఖదీర్, పురుషోత్తం రెడ్డి, నరేందర్ రెడ్డి, సీతారాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో చెరువుకట్టపై అభివృద్ధి పనులు

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ నడిబొడ్డులో ఉన్న చానమ్మ చెరువును సుందరి కరణ చేసి మినీ ట్యాంక్ బండ్గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు.సోమవారం జానమ్మ చెరువు అభివృద్ధిలో భాగంగా మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు రెండు కోట్ల రూపాయలతో చేపట్టబోయే పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపల్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జానమ్మ చెరువున మినీ ట్యాంక్ బండ్‌గా అవతరించబోతుందన్నారు. మున్సిపల్ చైర్మెన్ నరేందర్, కమిషనర్ వెంకన్న,స్థానిక కౌన్సిలర్ శ్రావణి, విశ్వం, చెన్నయ్య, బాబర్ అలీ ఖాన్, విశ్వం, జమ్రుద్ ఖాన్, ఎండి.ఇబ్రహీం,బస్వం అప్ప, ముబారక్, ఖదీర్, జఫర్, సురేష్, బీరప్ప, సీతారాం, అశోక్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇండ్లు లేని నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్స్ ఇవ్వాలని సీపీఐ నాయకులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు టి.రామకృష్ణ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గానికి 3600 ఇండ్లు ప్రభుత్వం కేటాయించిందని, నిజమైన ఇల్లు లేని పేదలకు ఇల్లు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. శేరిలింగంపల్లిలో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన గాంధీ ప్రజల కష్టసుఖాలు తెలుసని, సమస్యలపై సానుకూలంగా స్పందించినందుకు సీపీఐ శేరిలింగంపల్లి కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కే.చందు యాదవ్, తుపాకుల రాములన్న జెట్టి శ్రీనివాస్, ఎస్ కొండల్, బి.నారాయణ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

CHLOROPHYLL ORGANICS

In Pursuance to the Order No 2900(E) Dated 24th October 2015 Issued by Department of Agriculture, Co-operation and Farmers Welfare Ministry of Agricullture, Govt of India. CHLOROPHYLL ORGANICS hereby notifies that it intends to introduce and sell commercially its new 100 percent Water Soluable Mixture of Fertilizers as per the specifications given below:

LIST OF THE PRODUCTS

S.No	Name of the Fertiliers	Brand Name
1	5:10:35	IKON ARAVALI
2	6:40:10	IKON NILGIRI
3	8:06:30	IKON UDAYGIRI
4	8:11:25	IKON SHIVALIK
5	9:17:21	IKON NANDA
6	NPKS : 10:8:34:2	IKON KAMET
7	10:06:32	IKON KANCHANJANGA
8	10:09:30	IKON KASI
9	11:00:37	IKON ANANYA
10	11:33:10	IKON TATTVA
11	12:08:26	IKON SHAHTRA
12	12:10:18	IKON UTSAV
13	12:12:22	IKON VAIDYA
14	12:18:10	IKON RITU
15	13:40:13	IKON GANGA
16	15:08:27	IKON KRIPA
17	19:19:19	IKON EQUAL
18	Calcium nitrate with boron 15.5:0:0:02-0.3	IKON AHAAR
19	0:09:46	IKON DOODHGANGA
20	0:40:39	IKON VASANTH
21	6:00:18	IKON GRISHMA
22	6:05:32	IKON VARSHA
23	N10.60 :P9.30: K16.30 :MgO1.60 :CaO 13.20	IKON SHARAD
24	11:44:11	IKON DAMINI
25	13:40:11	IKON HEMANTH
26	14:48:00	IKON SHITA
27	NPK 14:6:34 +4C+TE	IKON YUKTHI
28	15:10:25	IKON KRISHI
29	15:22:10	IKON VANA
30	23:15:06	IKON VRUKSHA
31	5.00: 28.00: 13.00	IKON BEEJA
32	6.50: 12.90: 25.50	IKON PRAKRUTI
33	10:06:24	IKON HARIYALI
34	20:20:20:0.03B	IKON DHARTI
35	30:10:10:0.03B	IKON SASYAM
36	30:30:05:0.03B	IKON SHYAMA
37	12:45:12:0.03B	IKON VRUTI
38	06:24:06:0.03B	IKON PUSHTI
39	17:08:25:0.03B	IKON SURABHI
40	05:35:35:0.03B	IKON KSHEMA
41	05:05:42:0.03B	IKON UDAYA
42	10:15:30:0.03B	IKON KSHETRA
43	25:25:25:5Mgo	IKON JEEVAKA
44	17:30:30:5Mgo	IKON PRAANA
45	17:17:17:3Mgo :0.03B	IKON OUSHADHI
46	11:0.37:Zn 0.7 (B) 0.3	IKON PRANSHAKTI
47	16:16:16	IKON TARAKA
48	8:05:29	IKON KRISHNAMRUTHA
49	9:40:09	IKON VARDHINI
50	11:00:14	IKON POSHAKA
51	18:18:18	IKON JEEVANU
52	15:15:15	IKON DHARAPOSH
53	14:14:14	IKON AMRUTDHARA
54	0:28:28	IKON UDBHAV
55	6.5:44.6:6.5	IKON KARSHIKA
56	24.24.0	IKON MARUTHI
57	0:00:50	IKON CHENAB
58	0:00:52	IKON RIDDHI
59	00:24:15+1	IKON SHIKAR
60	0:37:37	IKON TRISHUL
61	00:40:20 +1Mg	IKON VINDHYA
62	00:42:47 +Fe	IKON SATPURA
63	00:43:30 +1Mg	IKON KAILASH
64	0:48:47	IKON DODABETTA
65	0:52:34	IKON GUMTI
66	NPK 00:60:20	IKON PRANHITHA
67	01:00:30 +1Mg	IKON KUDREMUKH
68	03:00:40 +1Mg	IKON PALANI
69	3:37:37	IKON CHANDRASHILA
70	5:15:33	IKON MIKIR
71	NPK 06:12:36 +4S+0.3B+TE Cotton	IKON KARPASA
72	8:32:16	IKON AMRA
73	08:16:24 +10CaO	IKON KADAMBA
74	8:16:39	IKON ASHOKA
75	08:24:16 +10CaO	IKON JAMBU
76	08:24:24 +4MgO+6S	IKON BILVA
77	9:28:14	IKON VATA
78	09:08:28 +1Mg	IKON PALASHA
79	0:16:16	IKON ARJUNA
80	NPK 10:05:26	IKON SAPTAPATRNA
81	NPK 10:08:30	IKON TINDUKA
82	10:05:30	IKON DHAVA
83	NPK 10:05:40+2.5S+0.2B+TE Potato	IKON ALOOKAMIKON
84	NPK 10:30:20 +0.1B +TE Sugarcane	IKON IKSHU
85	10:26:26	IKON ASHVATTA
86	10:40:10+ QPS	IKON BAKULA
87	10:54:10	IKON CHANDAN
88	10:54:10 +1Mg	IKON SHAKA
89	12:06:22+12CaO	IKON HORTI III
90	12:08:24 :10CaO	IKON KSHIRA
91	12:11:18	IKON PRAKASHA
92	12:11:18 +1Mg	IKON TRIDOSHA
93	NPK 12:61:00	IKON VISHWAJEET
94	13:12:19	IKON TOMATO II
95	14:35:14	IKON SATTHA
96	15:28:06	IKON TRIRASA
97	15:05:10 +1Mg	IKON SWASTHYA
98	15:05:30 +3MgO	IKON VAYUMAYA
99	15:08:35	IKON RITUSHAKTI
100	NPK 15:10:30+4S+TE Solanacae	IKON MARICHIKA
101	15:15:30	IKON FRUTTA
102	15:25:10+0.1B+8S	IKON CANE II
103	16:15:00	IKON SAMPANNA
104	17:14:09	IKON TOMATO I
105	18:46:00+1Mg	IKON VARDHAN
106	20:00:30	IKON HASTHINA
107	20:15:11	IKON ANU
108	20.20.20	IKON SAMANA
109	21:07:14 +3MgO	IKON PALLAVA
110	21:21:21 +1Mg	IKON PADMA
111	24:24:16	IKON PRABHA
112	28:28:28	IKON URJA
113	28:28:00	IKON MAYA
114	30:10:10	IKON PENNA
115	NPK 6:0.37:16	IKON AKARSANA
116	6:34:16	IKON JANANA
117	07:11:37 +3MgO	IKON SADHAKA
118	9.8.28	IKON VIPAKA
119	20:20:20:0.02B	IKON SVASANA
120	13:40:13:0.02B	IKON DRAVANA
121	0:37:37:0.02B	IKON VILYANA
122	30:10:10:0.02B	IKON BALA
123	10:54:10:0.02B	IKON VAHNI
124	05:15:45:0.02B	IKON ATMIKA
125	15:05:30:2Mg :0.02B	IKON NAVAJIVA
126	08:44:08:03Mg :4.8S	IKON ASHWA
127	16:00:09:19S	IKON GANDHAK
128	15:25:10:8S :0.1B	IKON DATHUMANI
129	0:44:29:2S:0.3B	IKON PUSHPADATHU
130	06:12:36:01Zn	IKON TAMRAKA
131	12:0:35:01Zn :0.3B	IKON DHATU
132	12-0-42-0.7Zn -0.3B	IKON SARIKA
133	10:40:20+TE	IKON NARMADA
134	10:20:40+TE	IKON TAPI
135	10:00:40+TE	IKON SINDHU
136	03:00:40+TE	IKON MAHI
137	0:24:18	IKON PURNA
138	00:24:15+TE	IKON YAMUNA
139	15:05:30+TE	IKON KAVERI
140	09:27:18+7.5S+TE	IKON FLORE
141	10:54:10+TE	IKON DURGA
142	05:15:45+TE	IKON SUTLEJ
143	13:01:00	IKON MEGHNA
144	13:00:45	IKON SURMA
145	17:44:00	IKON KAMLA
146	00:40:20+TE	IKON KOSI
147	00:20:40+TE	IKON DHATRI
148	21:21:21+TE	IKON BAGMATI
149	12:12:36+TE	IKON GODAVARI
150	15:45:10+TE	IKON KRISHNA
151	10:15:10+TE	IKON SARADA
152	03:20:40+TE	IKON SABARI
153	00:00:50+17.5S	IKON KALIUM
154	12:11:18+TE	IKON ARANI
155	18:00:07+TE	IKON BHIMA
156	00:43:30+TE	IKON MANJRA
157	15:05:10+TE	IKON RANGOLI
158	01:00:30+TE	IKON INDRAVATI
159	10:08:34	IKON MANU
160	10:05:36	IKON WYRA
161	15:25:10+TE	IKON CANE I
162	09:08:28+TE	IKON TOMATO III
163	11:36:24	IKON KALI
164	08:24:24+4MgO+6S	IKON CHLORIS
165	16:11:32	IKON HORTI I
166	21:12:16+2S	IKON SOL –I
167	14:05:32+2S	IKON SOL –II
168	16:08:32	IKON YAGACHI
169	09:27:18+3MgO+3S	IKON MANDOVI
170	1:00:20	IKON PRALAYA
171	0:44:44	IKON HYKE
172	13:05:37+3CaO	IKON HORTI II
173	10:06:35	IKON KUNTI
174	15:25:10	IKON VERDURE
175	5:55:17	IKON PAMPA
176	14:00:48	IKON VARADA
177	0:24:00	IKON SARYU
178	4:28:00	IKON MULIKA
179	11:44:11+TE	IKON ALAKANANDA
180	0:40:40	IKON FENI
181	00:00:22+18MgO+20S	IKON MAGNESIO
182	9:19:19	IKON BHADRA
183	20:16:17	IKON BANANA I
184	11:18:23	IKON BANANA II
185	12:00:38	IKON BANANA III
186	3:14:08	IKON CHILLI I
187	20:17:17	IKON CHILLI II
188	15:15:13	IKON CHILLI III
189	10:05:31	IKON CHILLI IV
190	17:00:32	IKON CHILLI V
191	8:20:16	IKON CITRUS I
192	22:05:18	IKON CITRUS II
193	5:05:30	IKON CITRUS III
194	8:21:21	IKON POME I
195	6:45:06	IKON POME II
196	8:06:38	IKON POME III
197	20:20:20 +0.1Zn	IKON VIKAS
198	14:00:35	IKON UNNATI
199	12:50:12+0.2B	IKON ANKURA
200	00:37:37 +0.2B	IKON PRATIPHAL
201	18:46:00+1MgO+1S	IKON ADHAR DAP

In all the Grades mentioned above (a) Moisture is Maximum 0.5 per cent (by weight); (b) Total Chloride is less than 0.5 per cent (by weight); (c) Matter insoluable in water is less than 0.5 per cent (by weight); (d) Lead is less than 0.003 per cent (by weight); (e) Cadmium is less than 0.0025 per cent (by weight); (f) Arsenic is less than 0.01 per cent (by weight).

Regd. & Corporate Office

CHLOROPHYLL ORGANICS

Plot No:5/A/1, Sy No:148, Automotive Park, Kallakal(Vl), Manoharabad(Mdl), Medak(Dist), Telangana-502336.
e-Mail: chlorophyll.organics@gmail.com ,Customer Care: 9100164474
Visit us at: www.chlorophyllorganics.com

ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా : గుమ్మడి వెన్నెల

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాపై ఎంతో నమ్మకంతో నన్ను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్పర్సన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనిమల రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గుమ్మడి వెన్నెల గద్దర్ ఆదివారం ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ తన పదవికి సహకరించిన ఉప ముఖ్య మంత్రి బట్టు విక్రమార్కకి పార్లమెంటు సభ్యులు మల్లు రవి, మంత్రులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు వివేక్ వినోదులతోపాటు టీటిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మల్కాజ్గిరి పార్లమెంటు ఇంచార్జ్ సునీతా మహేందర్రెడ్డి ఇతర కాంగ్రెస్ పెద్దలు నన్ను నా కుటుంబాన్ని అభిమానించే పార్టీ కార్యకర్తలు అందరికీ ఆమె ఆ ప్రకటనలు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మా కుటుంబానికి అండదండలందిస్తున్న సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గేకి, కే. వేణుగోపాల్, కొప్పుల రాజు, జాతీయ కాంగ్రెస్ నేతలందరికీ ఆమె మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. నాకిచ్చిన పదవికి న్యాయం చేస్తానని, తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ వృత్తి కళాకారులను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని ఆమె ఆ ప్రకటనలో హామీ ఇచ్చారు.

సమగ్ర ఇంటింటి సర్వే 11,10,883 కుటుంబాలు పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో చేపట్టుతున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే జిహెచ్ఎంసిలో ముమ్మరంగా సాగుతున్నది. ఇప్పటి వరకు 45 శాతం కుటుంబాల సర్వే పూర్తయ్యాయి. సర్వే తప్పులు లేకుండా జోనల్ అధికారులు నోడల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్థవంతంగా సర్వే జరిగేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సర్వేలో ఏనుమారెటర్లు ప్రభుత్వం నిర్దేశించిన ఫారాలు ఫీల్ అప్‌తో పాటుగా నిర్దేశించిన కోడింగ్ ప్రక్రియను ను మానిటరింగ్ అధికారులు నోడల్ అధికారులు, జోనల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలిస్తున్నారు. సర్వే సందర్భంగా ఎన్యుమరెటర్లు గాని సూపర్వైజర్స్ పూర్ పెర్ఫార్మెన్స్ ఉన్న వారితో జోనల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అవసరమైన మేరకు కుటుంబాల సర్వే ఎక్కువ శాతం చేసే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం 1,50,227 కుటుంబాల సర్వే పూర్తి కాగా ఇప్పటి వరకు 11,10,883 కుటుంబాలు పూర్తి అయ్యాయి.

భవాని మాత దేవాలయానికి భారీ విరాళం

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ప్రతి పౌరుడు ఆధ్యాత్మిక గొప్పదనాన్ని గ్రహించాలని అప్పుడే జీవితం ప్రశాంతంగా ఉంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని జానంపేట ప్రాంతంలో నూతనంగా భవాని మాత దేవాలయాన్ని పునర్నిర్మాణం చేపడుతున్న క్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్ బచ్చలి నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్ హాజరయ్యారు. స్థానికుల అభీష్టం మేరకు దేవాలయ పునర్నిర్మాణం కార్యక్రమం కోసం తన వంతుగా 4లక్షల 4వేల 444 రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఆలయ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బచ్చలి నరసింహులు మాట్లాడుతూ ఆలయాల నిర్వహణకు నూతన నిర్మాణాలకు తనవంతు కృషిగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కృషి చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో బడి,గుడి గొప్పదని ఆ రెండింటికి తనవంతు సహకారం చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు బచ్చలి నరసింహ ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, పిల్లి శేఖర్, యాదగిరి, మంగ కృష్ణ, సాదిక్ పాల్గొన్నారు.

ప్లైవుడ్ ఉత్పత్తుల శ్రేణిలో సుపీరియర్ కాలిబ్రేషన్‌ను అందిస్తున్న డ్యూరోప్లై

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : డ్యూరోప్లై, భారతదేశం ప్రీమియం ప్రముఖ ప్లైవుడ్ తయారీదారులలో అత్యంత అనుభవజ్ఞులైన తయారీదారులలో ఒకరు, దాని మొత్తం శ్రేణి ప్లైవుడ్ ఉత్పత్తులకు సుపీరియర్ కాలిబ్రేషన్‌ని తీసుకువస్తుంది. పరిశ్రమలో కస్టమర్-కేంద్రీకృత ఆవిష్కరణ నాణ్యత కోసం కొత్త ప్రమాణాన్ని సెట్ చేస్తుంది. 68 సంవత్సరాలకు పైగా గొప్ప నైపుణ్యం తో, డ్యూరోప్లై నిలకడగా ఆవిష్కరణ శ్రేష్ఠతపై దృష్టి సారించిందన్నారు. ఈ తాజా ఆఫర్ దేశవ్యాప్తంగా బిల్డర్లు, ఆర్కిటెక్ట్‌లు ఇంటీరియర్ డిజైనర్‌ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి ఒక బెంచ్‌మార్క్‌ను సెట్ చేయడంలో దాని నిబద్ధతను నొక్కి చెబుతుంది. అభిషేక్ చిట్లాంగియా, ప్రెసిడెంట్-మ్యానుఫాక్చరింగ్, డ్యూరోప్లై ఇలా అన్నారు. "డ్యూరోప్లై ప్లైవుడ్ ఉత్పత్తుల శ్రేణిలో సుపీరియర్ కాలిబ్రేటెడ్ ప్లైవుడ్ అందించడం పట్ల మేము సంతోషిస్తున్నామన్నారు. మా తయారీ ప్రక్రియలలో అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా, తుది ఉత్పత్తి చదునైన ఉపరితలం దాని దోషరహిత ముగింపుతో ఇంటీరియర్‌ల సౌందర్య ఆకర్షణను పెంచడమే కాకుండా మన్నికను మెరుగుపరుస్తుందన్నారు. ఇది తరతరాలు కొనసాగేలా చేస్తుంది. డ్యూరోప్లీలోని సుపీరియర్ కాలిబ్రేటెడ్ ప్లైవుడ్ ప్రతి షీట్ ఒక ఖచ్చితమైన తయారీ ప్రక్రియకు లోనవుతుంది. ఈ ఫీచర్ బిల్డర్‌లు, ఆర్కిటెక్ట్‌ల నుండి తుది-వినియోగదారుల వరకు పాల్గొన్న అన్ని వాటాదారులకు మనశ్శాంతిని అందించడం ద్వారా విన్-విన్ ప్రతిపాదనను అందిస్తుంది.

కులగణన జరిగి తీరుతుంది

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కులగణన జరగకుండా కొంతమంది కుట్రలు చేస్తున్నారని కానీ ఎవ్వరు అడ్డుపడిన కులగణన జరిగి తీరుతుం దని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా బల్లర్షా, చంద్రపూర్, రజురా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. అలాగే మహారాష్ట్ర ఛంద్రపూర్ జిల్లా రాజుర ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్కతో కలిసి ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చెప్పినట్లుగా ఈ దేశంలో ఎవరు అడ్డుపడినా కుల గణన జరిగి తీరుతుందన్నారు. గడ్కరి, నరేంద్ర మోడీ ఎవరు దీన్ని ఆపలేరన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం కుల గణన అంశంపై దేశానికి దిశా దశగా నిలుస్తోందని చెప్పారు. కులగణనపై క్యాబినెట్‌లో తీర్మానం చేసి అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ప్లానింగ్ శాఖ ద్వారా కుల గణన విజయవంతంగా నిర్వహిస్తు న్నామని, ఇప్పటికీ 50 శాతానికి పైగా సర్వే పూర్తయిందని వివరించారు. ప్రజలే ముందుకు వచ్చి సర్వేలో తమ వివరాలు నమోదు చేయించు కుంటున్నారని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్స్‌ను ఇంటికి ఆహ్వానించి మరీ వివరాలు ఇస్తున్నారని, ప్రజలంతా సహకరిస్తుంటే కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహారాష్ట్ర ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బిజెపి, బిఆర్ఎస్ వాళ్లు దుష్ప్ర చారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఐక్యం చేసే పార్టీ అని, దేశ ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు తన త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ దన్నారు. స్వతంత్ర పోరాటంలో స్వతంత్ర భారతదేశంలో త్యాగాలు చేసింది కాంగ్రెస్ నేతలే అన్నారు. రాజుర నియోజకవర్గం లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి గెలుస్తోంది రాహుల్ గాంధీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ కూటమి కుల గణన చేపడుతోందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు సంక్షేమ ఫలాలు అందిస్తామని అందుకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందజేస్తుందన్నారీ. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అసెంబ్లీలో నేను ప్రతిపాదిస్తే సభ ఏకగ్రీవంగా కులదరణ తీర్మానాన్ని ఆమోదిం చింది. 1.17 కోట్ల కుటుంబాల వివరాలను 87 వేల ఏన్యుమ రేటర్లు సేకరిస్తున్నారని, ఒక్కో ఎన్ని మారేటర్ 150 ఇండ్ల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. కుల గణన చేపట్టే వారిని తన్ని తరిమేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అహంకారంతో మాట్లాడుతున్నారని, ప్రజలు ఎవరిని తన్నీ తరిమేస్తారో మహారాష్ట్ర ఎన్నికల్లో తేలిపోతుందన్నారు. తెలంగాణలో కుల గణన మొదలుపెడితే మోడీ ప్రభుత్వం వణికిపోతుందని, కుల గణన ప్రజలను చీల్చడానికి కాదు, వాటాగా సంక్షేమ ఫలాలు రిజర్వేషన్లు దక్కని వర్గాల కోసమే ఈ సర్వే అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ఈ సర్వే చేస్తున్నామని, కుల గణనలతో వనికిపోయిన బిజెపి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారని విమర్శించారు.

ఆర్ఎస్ఎస్ వాళ్లు కులగలను వ్యతిరేకిస్తూ ఎన్నో ప్రసంగాలు చేశారు, సామాజిక న్యాయాన్ని కాంక్షించే బిజెపి నేతలు బయటకు రండని పిలుపునిచ్చారు. మేమెంతో మాకు అంత నిజం చేసుకోవడానికి బిజెపి నాయకత్వాన్ని ప్రశ్నించండని అన్నారు.

మద్దతు ధర ఇచ్చేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - ఆమనగల్లు : రైతన్నలకు మద్దతు ధర ఇచ్చేందుకే సింగల్ విండోల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నాయన రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాలు అన్నారు. సోమవారం ఆమనగల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో సింగల్ విండో సబ్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దిగుబడిని విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. వరి ధాన్యం క్వింటాలుకు మద్దతు ధర రూ, 2330, కాగా రెండో రకానికి రూ. 2300లుగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. సన్న రకం వరి దాన్యం క్వింటాలుకు రైతులకు ప్రోత్సాహకంగా రూ. 500 బోనస్ ఇవ్వనుందని ఇప్పటికీ రైతుల ఖాతాలో బోనస్ జమ అవుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పనకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని వెంకటేష్ గుప్తా హెచ్చరించారు. ఏడిఓ సింగల్ విండో వైస్ చైర్మన్ దో నాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, వెంకటయ్య, సేవియా నాయక్, చేగురి వెంకటేష్, మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డి, టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, నరసింహ, చంద్రయ్య, గూడూరు భాస్కర్ రెడ్డి, లక్పతి నాయక్, సుమన్ నాయక్, బిక్ష పతి, శంకర్, సత్యం, మల్లేష్ గౌడ్, రామచంద్రయ్య, రామచందర్, రాములు, చేగూరి.రాములు, క్యామ రాజేష్, మహేష్, సి ఈ ఓ దేవేందర్, ఏవో రమేష్ పాల్గొన్నారు.

హిందీ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మోడల్ స్కూళ్లు, కేజీబీవీలలో ఒక్క పీజీటీ హిందీ పోస్టును ఇప్పటివరకు భర్తీ చేయలేదని, దీని వల్ల మోడల్ స్కూళ్ళు, కేజీబీవీలలో హిందీ భాషను ఎంపిక చేసుకునే అవకాశం లేకుండా పోతుందని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా గురుకుల పాఠశాలల్లో పీజీటీ హిందీ పోస్ట్ భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్, డిగ్రీలలో హిందీ అధ్యాపకులు లేకపోవడం వల్ల హిందీ భాష చదివే అవకాశాన్ని కోల్పోతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందీ భాష ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రంలో తగిన హిందీ ఉపాధ్యాయ పీజీటీ, హిందీ జేఎల్, డీఎల్ పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో హిందీ భాష ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి హిందీ భాషను ఒక పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. తద్వారా ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు దేశ అధికార భాష నేర్పించాలని తెలిపారు. హిందీ భాష నేర్చుకోవడం వల్ల దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని గుర్తు చేశారు. విదేశాల్లో సైతం దేశ అధికార భాష హిందీని అక్కడ దేశాల్లో ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నాయని, విదేశాల్లో అనేక విశ్వవిద్యాలయంలో హిందీ విభాగాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని హిందీ భాషాభివృద్ధికి చేయూతనందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు బిక్షపతి, తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడు రామచందర్, కార్యదర్శి ఏకే రాజు, హిందీ ప్రచార సభ కార్యాలయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రిజిస్ట్రార్ నామ్ దేవ్ వాగ్మోడే, శివలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందీ పండిత పరిరక్షణ సమితి కార్యవర్గానికి ఎన్నికైన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

చిరు ధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : చిరు ధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించాలని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. సోమవారం ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ వేదికగా ఎస్.ధనంజయ్య తను తెలుగులో ఈ పుస్తకాన్ని డా.సముద్రాల మారయ్య మణెమ్మ సేవా ట్రస్ట్ తరఫున 'ఖాదర్ వలి సిరి జీవన విధానం శాస్త్రీయం, కళాత్మకం' అనే పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ చీఫ్ ప్యాట్రన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.ఖాదర్ వలీ విద్యార్థులకు మిల్లెట్స్(కొర్రలు, ఊదలు, సామలు, అరికలు, అండు కొర్రలు, సజ్జలు, రాగులు, వరిగలు, జొన్నలు) ప్రపంచ వ్యాప్తంగా కనిపించే చిరుధ్యాన్యాల రకాల గొప్పతనం పట్ల అవగాహన కల్పించారు. వరి, గోధుమ వంటి సాంప్రదాయ ప్రధాన పంటల నుండి ప్రపంచ ఆహార ఉత్పత్తి, మానవ ఆరోగ్యంపై మన దృష్టిని మరల్చవలసిన అవసరాన్ని వివరించారు. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ డైరెక్టర్ ప్రార్థన మణికొండ మాట్లాడుటూ చిరు ధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా, పాఠశాల తన విద్యార్థులలో స్థిరమైన, ఆరోగ్యకరమైన ఆహార ఎంపికల పట్ల లోతైన అవగాహన కలిగించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలిపారు. పాఠశాల ఆవరణలో ప్రత్యేకమైన చిరు ధాన్యాల తోటను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పరు. ఇది విద్యార్థులకు అభ్యాస అవకాశాలను మెరుగు పరుస్తుందన్నారు. అదనంగా, పాఠశాల 'చిరుధాన్యాల సోమవారం' చొరవ విద్యార్థుల ఆహారంలో వారంలో ఒక రోజు చిరుధాన్యాలు భుజించడానికి, వాటిపై ఆసక్తిని కలిగించి, పోషకాలు అధికంగా ఉండే ధాన్యాల వినయోగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. నీటిపారుదల శాఖలో రిటైర్డ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్ రెడ్డి నుండి మినుము సాగుతో తన అనుభవాలను పంచుకున్నారు. లయన్స్ క్లబ్ నుండి ఎస్.ధనంజయ్య చిరు ధాన్యాలు తినడం వల్ల తాను తన కుటుంబ సభ్యులు పొందిన ఆరోగ్య ప్రయోజనాలను విషదీకరించి పిల్లలలో చిరుధ్యాన్యాల పట్ల ఆసక్తిని ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ రేఖ రావ్, ప్రీ-ప్రైమరీ ప్రిన్సిపాల్, ఫాతిమా ఖాజిమ్ సహా 7, 8, 9 తరగతుల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతాం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గోపనపల్లిలో గల అవంతిక గోదావరి అపార్ట్మెంట్స్‌లో రూ.49.75 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటం గంగాధర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరిన్ని పనులు చేపట్టి కాలనీలలో మౌనిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులకు ఆదేశించారు. డివిజన్ పరిధిలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ విశాలాక్షి, సీనియర్ నాయకులు, కిరణ్, భను ప్రకాశ్, కిరణ్ కుమార్, లోకేందర్ రెడ్డి,రమేష్, ధీరజ్, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్

విశాలాంధ్ర - ఖమ్మం : ముదిగొండ మండలం సువర్ణ పురం గ్రామంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ సందర్శించి దాన్యం, పత్తి కొనుగోలు, ట్రాన్స్‌పోర్ట్, బిల్లులు తదితర అంశాలపై రైతులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సీసీఐలో కొనసాగుతున్న ప్రక్రియలో ఏలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ముదిగొండ ఇన్స్‌పెక్టర్ మురళీ, నేలకొండపల్లి ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

తెగిన చెరువులు, కుంటల మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్: జిల్లాలో ఇటీవల భారీ వర్షాలకు తెగిన చెరువులు కుంటల మరమతులను తక్షణమే చేపట్టాలని జిల్లా సిపిఐ కార్యదర్శి విజయ్ సారధి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని నెల్లికుదురు మండలంలో తెగిన అన్ని చెరువులు, కుంటలను తక్షణమే పునర్నిర్మానం చేయాలని, నష్టపోయిన రైతులను, మత్స్య కార్మికులను, ఇల్లు కోల్పోయిన పేదలను తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి, తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.విజయ సారధి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాజుల కొత్తపల్లి చెరువు, రావిరాల చెరువు, ఆలేరు చెరువు తెగి చెరువుల కింద ఉన్న వేలాది పంటలు నష్టపోయాయన్నారు. ఈ చెరువుల కింద వేలాది పంట పండే అవకాశం ఉన్నందున చెరువు, కుంటలను వెంటనే పునర్నిర్మానం చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా పర్యటించి జిల్లాలోని చెరువులన్నింటిని పునర్నిర్మాణం చేయాలని ఆదేశించిన అధికారులు ఇంతవరకు పనులు చేపట్టలేదు అన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర - మేడిపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబాలకు వరమన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మూడు చింతలపల్లి మండల్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నరసింహ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, దమ్మైగూడ మున్సిపాలిటీ అధ్యక్షులు ముప్పు రామారావు, తూంకుంత మున్సిపాలిటీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, కార్పొరేటర్ రసాల వెంకటేష్ యాదవ్, దమ్మైగూడ కౌన్సిలర్ వెంకటేష్, దాన గళ్ళ యాదగిరి, జై.నరసింహులు, కృష్ణ రెడ్డి, ఎర్ర రాజు, ప్రవీణ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. నర్సింహులు గౌడ్ పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ 60వేలు, దివ్య బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అన్నపూర్ణ కాలనీ 60వేలు, సత్య లక్ష్మి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారక నగర్ కాలనీ 60వేలు, కావాలి సింధు మూడు చింతలపల్లి మండల్ అద్రాస్ పల్లి గ్రామం 60వేలు, జ్యోతి మేడ్చల్ మండల్ సోమారం గ్రామం 42,500, రాజు దమ్మైగూడ మున్సిపాలిటీ కుండన్ పల్లి 60వేలు, జయ తూంకుంత మున్సిపాలిటీ 60 వేలు, నర్సింహా మూడు చింతలపల్లి మండల్ 60వేలు, ఎండ్. రిజ్వాన బేగం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 60వేల చెక్కులను అందజేశారు.

హజ్రత్ అలీ మరణం పార్టీకి తీరనిలోటు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: హజ్రత్ అలీ మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 126 - జగద్గిరిగుట్ట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు హజరత్ అలీ జ్ఞాపకార్థం నిర్వహించిన "ఫతేహా చెహ్లుం" సంతాప సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరయ్యారు.అనంతరం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిత్యం ప్రజా ప్రతినిధుల దృష్టికి తెచ్చి సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాడిన సీనియర్ నాయకులు హజరత్ అలీ మరణం వారి కుటుంబ సభ్యులకే కాదు బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని, బిఆర్ఎస్ పార్టీ వారి కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటుంది.ఈ సందర్భంగా హజరత్ అలీ జ్ఞాపకార్థం కురాన్‌లోని పవిత్ర ప్రవచనాలను ముద్రిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేణు యాదవ్, జై హింద్, సయ్యద్ రషీద్, పాషా భాయ్, సల్మాన్, షేఖ్ ఖాదర్, చంద్రశేఖర్, యాదగిరి, సయ్యద్ ముంతాజ్ అలీ, సయ్యద్ ఇంతియాజ్, సయ్యద్ ఇమాన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం : ఎమెల్సీ

విశాలాంధ్ర-దుండిగల్: అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రధాన లక్ష్యమని మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘ సభ్యులు సోమవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఆయన దృష్టికి తీసుకువస్తే సమస్యల వాటి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా దుండిగల్ మున్సిపాలిటీ డి. పోచంపల్లి 10 వార్డ్ కౌన్సిలర్ మహేందర్ యాదవ్ ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుని శాలువాతో సత్కరించి వివాహ వేడుకకి ముఖ్యఅతిథిగా హాజరు కాగలరని ఆహ్వాన పత్రికను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేసిన హరీష్‌రావు

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని జె.బి క్రికెట్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాధవరం నరసింహారావు నిర్వహించిన తెలంగాణ అమర వీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్ (తెలంగాణ చాపియన్స్ ట్రోఫి) బహుమతుల కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ జగన్ మోహన్‌రావు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, విప్లవ్ కుమార్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

విశాలాంధ్ర - మొయినాబాద్ : విద్యా సంస్థల్లో నిర్వహించే క్రీడలు, ఇతర పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీస్తాయని పల్లవి ఇంటర్నేషనల్ విద్యసంస్థల సీఈఓ యశస్వి పేర్కొన్నారు. మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్‌లోని పల్లవి విద్యసంస్థల్లో గత మూడు రోజులుగా జరుగుతున్న స్పోర్ట్స్, ఆర్ట్స్ ప్రదర్శన పోటీలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యశ్వసి పాల్గొని ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశాడు. అనంతరం విద్యతో పాటు వారిలోని నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఇలాంటి పోటీలను తమ విద్యసంస్థల్లో ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమబద బుషి, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అభిలష అనీష్, నటి గీతా భాస్కర్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కూలిరేట్ల జీవో జాప్యంపై ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయీస్ కార్మికుల నిరసన

20లోగా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సివిల్ సప్లయీస్ హమాలీ కూలి రేట్ల జీవో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయీస్ జిల్లా కార్యాలయాల ఎదుట హమాలీ కార్మికులు ఆందోళనకు దిగారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్-ఏఐటీయూసీ పిలుపులో భాగంగా నిరసనలు చేపట్టారు. అన్ని జిల్లాల్లో యూనియన్ నేతలు, హమాలీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్లకు నోటీసులు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయీస్ కార్యాలయం ముందు జరిగిన నిరసనలో సివిల్ సప్లయీస్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, మేస్త్రీలు తాతయ్య, బుజ్జి, వీరయ్య, పేతురు పాల్గొన్నారు. గుంటూరులోని జిల్లా సివిల్ సప్లయీస్ కార్యాలయం వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.అంజిబాబు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో యూనియన్ నేతలు చిక్కాల గోవిందు, శ్రీమన్నారాయణ నాయకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జిల్లాలో కామేశ్వరరావు, నరసింహులు నాయకత్వంలో హమాలీలు పెద్దఎత్తున పాల్గొని నిరసనకు దిగారు. విశాఖపట్నంలో మన్మధరావు, అప్పారావు నేతృత్వాన కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాకినాడ జిల్లాలో రాష్ట్ర కార్యదర్శి వీరబాబు నాయకత్వంలో ఆందోళన జరిగింది. కడపలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు బాదుల్లా, మద్దిలేటి, బాలగురవయ్య, మురారి, బాపట్లలో పైడయ్య, కర్నూలులో అతావుల్లా బాషా, నంద్యాలలో సుంకయ్య, రామాంజీ, తిరుపతిలో మురళీ పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలో సాంబశివ, కిష్టయ్య, బాషా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో వేలసంఖ్యలో కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మండలస్థాయి స్టాక్ పాయింట్ ఎగుమతి, దిగుమతి చేస్తున్న హమాలీ కార్మికులకు 11 నెలలుగా కూలి రేట్ల పెంపుదలపై అధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపట్టారు. ఈ సమస్య పరిష్కారానికిగాను 11 నెలలుగా కార్మిక నేతలు... సివిల్ సప్లయీస్ కమిషనర్ ఎండీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయారన్నారు. ఈనెల 13న పని బంద్ నోటీసు ఇచ్చామన్నారు. ఆయా డిమాండ్లపై ఈనెల 20లోగా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని, దీనికి సివిల్ సప్లయీస్ అధికారులే బాధ్యత వహించాలన్నారు. టీడీపీ ప్రభుత్వానికి హమాలీ కార్మికులు ఎంతో సహకరిస్తున్నారని, ప్రభుత్వ కార్యాకలాపాల్లో భాగస్వాములవుతున్నారని తెలిపారు. ఇటీవల విజయవాడ వరదలో హమాలీ కార్మికులు కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి సహకరించారని, ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సుల నుంచి ఈవీఎంల వరకు కార్మికుల కృషి ఎంతో ఉందని గుర్తుచేశారు. అలాంటి కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

కొమ్మారెడ్డి పట్టాభిరామ్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నేటి యువత సామాజిక స్పృహ కలిగి ఉండటంతో పాటు ప్రశ్నించేతత్వాన్ని అలవరచుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ఆ సంస్థ ఛైర్మన్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పట్టాభిరామ్ మాట్లాడుతూ... సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించడంతో పాటు ఎదురొడ్డి పోరాడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచే రాష్ట్రాన్ని లూటీ చేయడం ప్రారంభించిందన్నారు. ప్రజలను ఇబ్బందికి గురిచేయడంతో తన గళం వినిపించానన్నారు. ఎప్పుడూ నిరాధారంగా, అసత్య ఆరోపణలతో మాట్లాడలేదన్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్టీసీ మాజీ చైర్మన్ వర్ల రామయ్య, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, నక్కా ఆనంద్ బాబు, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, మన్నం మోహన్ కృష్ణ, నాగుల్ మీరా, మాల్యాద్రి, బాలకోటయ్య, రఫీ పాల్గొన్నారు.

మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా ... ఉండవల్లి శ్రీదేవి

అభిమానులు, కార్యకర్తల కోలాహలం నడుమ మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత తన నివాసం నుంచి తాడేపల్లిలోని కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన ఆమె అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలిపారు. గత ముఖ్యమంత్రి జగన్... నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అనడమే తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి ఎస్సీల పథకాలను పూర్తిగా ఎత్తివేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

నిర్దేశిత సమయానికే 'పోలవరం జల విద్యుత్'

ఏపీఈఆర్సీ ఛైర్మన్ వెల్లడి

విశాలాంధ్ర-పోలవరం: నిర్మాణంలో ఉన్న పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సి) ఇంఛార్జ్ చైర్మన్ ఠాకూర్ రామ సింగ్, కమిషన్ సభ్యుడు పి వెంకటరామిరెడ్డి సోమవారం సందర్శించారు. పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్ట్ నుంచి జల విద్యుత్ కేంద్రానికి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న కాలువ, విద్యుత్ కేంద్రం సర్వీస్ బే, ఇతర నిర్మాణాలను వారు పరిశీలించారు. ఏ పీఈ ఆర్సీ చైర్మన్ ఠాకూర్ రామ సింగ్ కు జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతిని ఏ పీ జెన్ కో హైడెల్ విభాగం డైరెక్టర్ సుజయ కుమార్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈ ఐ ఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు వివరించారు. పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్‌ను కోరామని... సంస్థ అందుకు అనుగుణంగా పనులు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సివిల్, ఎలక్ట్రో మెకానికల్ పనులు చేస్తున్నామని ఎంఈఐ ఎల్ సి ఓ ఓ సతీష్ బాబు చైర్మన్ కు వివరించారు. ప్రాజెక్ట్ పనుల పట్ల చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. చైర్మన్ వెంట ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ (సివిల్) వై కోటేశ్వర రావు, ఎస్ఈలు రామభద్ర రాజు, రవీంద్ర రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

శ్రీవాణి ట్రస్టు రద్దు

మూడు గంటల్లోపే సర్వదర్శనం

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: శ్రీవాణి ట్రస్టు రద్దు చేస్తూ, సర్వదర్శనానికి వచ్చే భక్తులకు రెండు నుంచి మూడు గంటల్లోగా దర్శన భాగ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ నిర్ణయించింది. అక్కడ పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను ప్రభుత్వానికి అప్పగించనుంది. ఈ మేరకు ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన అన్నమయ్య భవన్‌లో సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధర్మకర్తల మండలి ముఖ్య నిర్ణయాలను ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ ఉపయోగించి క్యూ లైన్లలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా రెండు మూడు గంటల్లోనే దర్శనమయ్యేలా ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని, దీని రిపోర్టు ఆధారంగా భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలని నిర్ణయం. టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను బయటకు పంపేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయమై ప్రభుత్వానికి నివేదించాలని, తిరుమలలో డంపింగ్ యార్డులో చెత్తను మూడు లేదా నాలుగు నెలల్లో పూర్తిగా తొలగించాలని, తిరుపతిలోని శ్రీనివాస సేతును గరుడ వారధిగా పేరు మార్చడానికి, అలిపిరిలో టూరిజం కార్పొరేషన్ ద్వారా దేవలోక్ కు కేటాయించిన 20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకుని టీటీడీకి ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరాలని, తిరుమలలో రాజకీయాలు మాట్లాడేవారిని, ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించాలని, శ్రీవాణి ట్రస్టు పేరును మార్చేందుకు సాధ్యాసాధ్యాల పరిశీలన, ప్రైవేట్ బ్యాంకుల్లో డిపాజిట్లను వెనక్కు తీసుకుని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసే అంశంపై వచ్చే సమావేశంలో చర్చ, నిత్య అన్న ప్రసాద భవనం మెనూలో అదనంగా మరొక పదార్థాన్ని చేర్చేలా, వివిధ రాష్ట్రాలకు చెందిన టూరిజం కార్పొరేషన్లు, ఏపీఎస్ ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీలకు టీటీడీ కేటాయించిన శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టికెట్లకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులు నేపథ్యంలో వాటిని పూర్తిగా పరిశీలించిన అనంతరం సదరు సంస్థలకు కోటాను పూర్తిగా రద్దు చేయాలని, తిరుమలలో గోగర్భం డ్యామ్ వద్ద విశాఖ శ్రీశారద పీఠానికి చెందిన మఠం నిర్మాణంలో అవకతవకలు, ఆక్రమణలు జరిగినట్లు టీటీడీ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా భవనం లీజు రద్దు చేయాలని, బ్రహ్మోత్సవాలలో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని నిర్ణయించినట్టు వివరించారు. శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణకు, అన్న ప్రసాద కేంద్రం ఆధునీకరణకు టీవీఎస్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంటామన్నారు. ఈ పనులన్నీ ఆ సంస్థ ఉచితంగా చేస్తుందని వెల్లడించారు.

ట్రూ అప్ చార్జీల విధానం వద్దు

వినియోగదారులపై భారం మోపొద్దు

విద్యుత్ నియంత్రణ మండలికి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ సర్దుబాటు చార్జీల విధింపుపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కార్యదర్శి (కర్నూలు)కి సోమవారం లేఖ రాశారు. తూర్పు, మధ్య, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలు 2023-24 సంవత్సరం ఎఫ్‌పీపీసీఏ (ట్రూ అప్ చార్జీలు) ప్రతిపాదనలపై ఈ నెల 4న ప్రజల అభ్యంతరాలు, అభిప్రాయాలను నోటిఫికేషన్ ద్వారా కోరిన నేపథ్యంలో... ఆ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ రామకృష్ణ లేఖ రాశారు. ఈ ప్రతిపాదన వల్ల విద్యుత్ వినియోగదారులపై 11,820 కోట్ల రూపాయల భారం పడనున్నదని రామకృష్ణపేర్కొన్నారు. 2023-24లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు ప్రతినెలా అదనంగా 50 పైసల నుండి 2.50 పైసలు భారం పడుతుందన్నారు. నెలరోజుల క్రితమే రూ.6,072 కోట్ల భారం వేసి... మరలా దానికి దాదాపు రెట్టింపు భారం మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వ పంపిణీ సంస్థల అసమర్థ విధానాలు, అవినీతి, బడా సంస్థలకు అదనపు చెల్లింపులు, ప్రభుత్వ థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయటం, సర్ చార్జీలు, వడ్డీలు ఇతర అంశాలు ఈ భారానికి కారణాలవుతున్నాయని రామకృష్ణ తెలిపారు. ఈ లోపాలను మండలి ఎత్తిచూపి సరిదిద్దాలన్నారు. ప్రజలపై భారం వేయరాదని పేర్కొన్నారు. 23-24 ఎఫ్‌పీపీసీఏ ప్రతిపాదనలను మండలి తిరస్కరించాలని, అనివార్యమైతే అదనపు వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై అదనంగా విద్యుత్ భారం వేయబోమని, చార్జీలు తగ్గిస్తామని ఈ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ నిలబెట్టుకోవాలన్నారు. మండలి తదనుగుణంగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ట్రూ అప్ చార్జీలపై పునరాలోచన చేసి... రద్దు చేయాలన్నారు. విద్యుత్ వినియోగించుకున్న కొద్ది నెలలు, సంవత్సరాల తర్వాత వినియోగదారుల నుండి అదనంగా వసూలు చేసే సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల విధానం లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వం, పంపిణీ సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయని, దీంతో ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. ట్రూ అప్, సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు, గృహ వినియోగదారులు, వ్యాపార, పరిశ్రమలు, సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రారంభించారని, ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని గుర్తుచేశారు. దానికి భిన్నంగా స్మార్ట్ మీటర్లు పెట్టడం సరికాదని హితవు పలికారు. వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ఆదేశాలివ్వాలని కోరారు. 2023-24 చార్జీల ప్రతిపాదనలపై అభ్యంతరాలకు గడువు మరో 15 రోజులు పొడిగించాలని కోరారు. తదనంతరం దీనిపై బహిరంగ విచారణ జరిపి ప్రజాభిప్రాయం స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రూ అప్ చార్జీల వసూళ్లు నిలిపివేయాలని, భవిష్యత్తులోనూ భారం వేయరాదని రామకృష్ణ కోరారు.

ఏడు కీలక బిల్లులు... అసెంబ్లీ ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర శాసనసభ సోమవారం ఒక్కరోజే ఏడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2024, ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు-2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు-2024 తదితర బిల్లులు ఆమోదం పొందాయి. ఎంతమంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నిబంధనలు మారుస్తూ తీసుకొచ్చిన బిల్లు సభ ఆమోదం పొందింది. అలాగే ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ సవరణ బిల్లు-2024, ఆయుర్వేదిక్ హెూమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు-2024, ఏపీ సహకార సంఘం సవరణ బిల్లు -2024 బిల్లులను శాసనసభ ఆమోదించింది.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై పీడీఎఫ్ వాయిదా తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వాయిదా తీర్మానాల తిరస్కరణ... వాకౌట్‌లు...నిరసనలతో శాసన మండలి సమావేశాలు కొనసాగుతున్నాయి. సోమవారం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై చర్చించాలని పీడీఎఫ్ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, రఘువర్మ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. ఇసుక కొరత, భవన నిర్మాణ రంగ కార్మికుల కష్టాలపై వైసీపీ సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్, పండుగల రవీంద్ర ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తోసిపుచ్చారు. అగ్రిగోల్డ్ బాధితులపై కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... అగ్రిగోల్డ్ బాధితులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తీర్మానం తిరస్కరించినప్పటికీ ఆ అంశంపై మాట్లాడటం తగదని చైర్మన్ సూచించి... ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. అనంతరం శాసన మండలిలో విద్యుత్ చార్జీల సవరణ బిల్లును ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రవేశపెట్టగా, దానిని పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు వ్యతిరేకించారు.

ట్రూఅప్ చార్జీలపై వైసీపీ వాకౌట్

విద్యుత్ చార్జీల సవరణ బిల్లుపై శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ప్రకటించి... ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు విధించి, ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాన్ని మోపడాన్ని బొత్స తప్పుపట్టారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం తగదన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... తాము చెప్పే జవాబులను ప్రతిపక్ష సభ్యులు వినే ఓపిక లేకనే వాకౌట్ చేశారంటూ ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ చార్జీల భారం వేయగా, దానిని తగ్గించే క్రమంలోనే ట్రూ అప్ చార్జీలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వైసీపీ సభ్యులు వాకౌట్ చేయడాన్ని కూటమి సభ్యులు తప్పుపట్టారు.

సూపర్-6కు నిధులేవి?

బడ్జెట్‌పై చర్చలో మండలి ప్రతిపక్ష నేత బొత్స

150 రోజుల్లో ఎంతో ప్రగతి: పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సూపర్-6 పథకాల అమలుకు బడ్జెట్లో పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదని... అందుకే ఉచిత గ్యాస్ (దీపం-2) సిలిండర్ల పథకాన్ని తప్పు దోవ పట్టించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఈ పథకంపై విపరీతమైన హామీలిచ్చి, ఎన్నికలయ్యాక అధికారంలో వచ్చి ఇప్పుడు మెలిక పెడుతున్నారన్నారు. శాసన మండలిలో సోమవారం 2024-25 ఆర్థిక సంవత్సర సాధారణ బడ్జెట్‌పై చర్చ ముగిసింది. ఈ చర్చలో రాష్ట్ర మంత్రులు, శాసన మండలి సభ్యులు పాల్గొన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కూటమి ప్రభుత్వం దాదాపుగా ఐదు నెలల సమయం తీసుకుందని, తీరా బడ్జెట్ ప్రవేశపెట్టాక అరకొర నిధుల కేటాయింపుతో ప్రజలను మభ్యపెట్టి నిరాశకు గురిచేసిందన్నారు. ఎన్నికల హామీల అమలుకు బడ్జెట్ కేటాయింపులపై మభ్య పెట్టేందుకే గత ప్రభుత్వ అప్పులపై పాలకపక్ష సభ్యులు అసత్య ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. దీపం-2 గురించి ఆర్థిక మంత్రి ఒకలా...పౌర సరఫరాల మంత్రి మరోలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చేతిలో అధికారం ఉందని విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతామంటే కుదరదని, మా ప్రభుత్వ హయాంలో కూడా డిస్కంలకు సబ్సిడీ ఇచ్చామన్నారు. తల్లికి వందనం రూ.18 వేలు ఇస్తామన్నారు? ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదు? అని బొత్స ప్రశ్నించారు. బొత్స ప్రసంగం ముగిసిన అనంతరం...కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, విద్యుత్ చార్జీలు పెంపు, శాంతిభద్రతలు క్షీణించిన నేపథ్యంలో నిరసన వ్యక్తం చేస్తున్నామంటూ సభ నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు.

150 రోజుల్లో ఎంతో పురోగతి: ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 150 రోజుల్లో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. 16 వేల పోస్టులకు పైగా భర్తీ చేసే మెగా డీఎస్సీ ఫైల్ పై తొలి సంతకం చేశామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి వంటి ప్రాధాన్యత అంశాలపై సీఎం ఐదు సంతకాలు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయంలోని రైతులకు సంబంధించిన రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలను చెల్లించి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామని, రోడ్ల నిర్మాణం, రైల్వే కొత్త ప్రాజెక్టులకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ఈ ప్రభుత్వం ఉక్కు పాదంతో ముందుకు పోతుందన్నారు. విద్యార్థులకు పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నామని, తల్లికి వందనం పథకానికి వివిధ పద్దుల కింద బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. పన్నుల వాటాగా కేంద్రం నుంచి రూ.5,776 కోట్లను సాధించుకున్నామని మంత్రి తెలిపారు. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దీపం-2 పథకంపై బొత్స సత్యనారాయణ లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ అందజేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే దాదాపు 40 లక్షల మంది బుకింగ్స్ చేసుకున్నారని, 30లక్షల మందికి అందజేశామని వివరించారు. టీడీపీ ఎమ్మెల్సీ బి.తిరుమల నాయుడు మాట్లాడుతూ రూ.2,94,427.25 కోట్లతో ప్రజామోదమైన, జనరంజకమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పీడీఎఫ్ సభ్యుడు ఇల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ బడ్జెట్ రాష్ట్ర, దేశ ప్రజల సొమ్ముతో వచ్చిన ఆదాయమన్నారు.

డిసెంబర్ 6న దిల్లీ మార్చ్

రైతు సంఘాల ప్రకటన

చండీగఢ్: తమ డిమాండ్ల కోసం డిసెంబర్ 6న దిల్లీ మార్చ్ చేపట్టనున్నట్లు రైతు సంఘాలు సోమవారం ప్రకటించాయి. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధమైన హామీతో పాటు వివిధ డిమాండ్లు ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు దిల్లీ మార్చ్ చేపట్టనున్నట్లు రాజకీయేతర సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రకటించాయి. దిల్లీ చలో మార్చ్‌ను భద్రతా బలగాలు అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13 నుండి రైతులు పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దుల్లోనే నిరసన తెలుపుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తాము దిల్లీ మార్చ్ చేపట్టాలని నిర్ణయించుకున్నామని మీడియానుద్దేశించి కేఎంఎం నేత సర్వన్ సింగ్ పంథేర్ పేర్కొన్నారు. తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం రైతులతో ఎటువంటి చర్చలు జరపడం లేదని సర్వన్ సింగ్ మండిపడ్డారు. తొమ్మిది నెలలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని శాంతియుతంగా వేచి చూశామని, కానీ ఇప్పుడు వేరే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. శంభు సరిహద్దు నుండి రైతులు దశల వారీగా దిల్లీ వైపు వెళతారని అన్నారు. తాము 280 రోజులుగా రెండు సరిహద్దుల్లోనే ఉన్నామని, ఫిబ్రవరి 18 నుండి కేంద్రం తమతో ఎలాంటి చర్చలు జరపలేదని భారతీయ కిసాన్ యూనియన్ (షహీద్ భగత్ సింగ్)కు చెందిన తేజ్వీర్ సింగ్ పేర్కొన్నారు. పంటలకు ఎంఎస్‌పీ చట్టబద్ధమైన హామీతో పాటు రైతులకు రుణమాఫీ, రైతులు, రైతు కార్మికులకు పెన్షన్ అందించాలని, విద్యుత్ చార్జీల పెంపు ఉండకూడదని, 2021 లఖింపూర్ ఖేరి హింసాకాండ కేసులో రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, బాధితులకు న్యాయం జరగాలని, భూసేకరణ చట్టం 2013 పునరుద్ధరణ, 2020-21 ఆందోళనలో మరణించిన రైతులకు, వారి కుటుంబాలకు పరిహారం ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఫీజులు... పిండేస్తున్నారు!

- మధ్య తరగతికి విద్య అందని ద్రాక్ష
- కార్పొరేట్ బడులలో ఆగని దోపిడీ
- లగ్జరీ జాబితాలో ప్రాథమిక చదువులు
- ఒకటో తరగతికి రూ.4.27 లక్షలు... బాలిక తండ్రి గగ్గోలు
- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్

జైపూర్: ఆధునిక సమాజంలో విద్యా సంస్థలు వ్యాపార సంస్థలుగా మారుతున్నాయి. చిన్నారుల భవిష్యత్తే ధ్యేయమని, విద్యాబుద్ధులు నేర్పించడమే తమ కర్తవ్యమని, లాభాపేక్షపై మమకారం లేదని, నవ సమాజంలో సేవాతత్పరతే సంకల్పమంటూ అనుమ తులు తీసుకుని... ఆనక పసికుసుమాల తల్లిదండ్రులకు చుక్కలు చూపుతున్నాయి. ముఖ్యంగా తమ బిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్ది, వారి భవిష్యత్‌కు బంగారు బాట వేయాలని ఆశించిన మధ్యతరగతి వర్గాల ఆశలను అవకాశంగా మలచుకుని లక్షలాది రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. సగటి మానవుడి సగం ఆదాయాన్ని దోచుకుంటున్నాయి. ఏదో ఒకటో రెండో పాఠశాలలు అనుకుంటే పొరబడ్డట్టే... అన్ని కార్పొరేట్ బడులలో ఇదే దోపిడీ జరుగుతోంది. దీంతో మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారింది. ఎల్‌కేజీ నుంచే రిజిస్ట్రేషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, కాషన్ మనీ, వార్షిక ఫీజు, బస్ ఛార్జీలు, పుస్తకాలు, యూనిఫాం... ఇలా మొత్తంగా ఏడాదికి లక్షల్లో ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఇది కాకుండా జీతంలో 50 శాతం ఆదాయపు పన్ను, సీఎస్టీ, పెట్రోల్‌పై వ్యాట్, రోడ్ ట్యాక్స్, టోల్ ట్యాక్స్, ప్రొఫెషనల్ ట్యాక్స్, క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్, ల్యాండ్ రిజిస్ట్రీ చార్జీల కింద ప్రభుత్వం లాగేసుకుంటుండడంతో నెల తిరిగేసరికి చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండడం లేదు. దీనికితోడు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు, పీఎఫ్, ఎన్‌పీఎస్ వంటివి కట్టుకోవాల్సి ఉండడంతో మధ్య తరగతి కుటుంబీకుల జీవితాలు మేడిపండు మాదిరి మారుతున్నాయి. నేడు విద్య లగ్జరీ జాబితాలో చేరిపోయింది. తాజాగా సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఓ తండ్రి ఆవేదన దీనికి అద్దం పడుతోంది. తన కూతురిని చేర్పించాలనుకుంటున్న పాఠశాలలో ఒకటో తరగతి ఫీజు ఏకంగా రూ.4.27 లక్షలని వాపోయాడు. జైపూర్‌కు చెందిన రిషబ్ జైన్... స్కూలు ఫీజు గురించి చెబుతూ, తన కూతురిని ఒకటో తరగతికి రానుందని, చిన్నారి కోసం ఓ స్కూలును ఎంపిక చేయగా అక్కడ ఒకటో తరగతికే రూ.4.27 లక్షలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. 'దేశంలో మధ్యతరగతి వారికి విద్య ఓ లగ్జరీగా మారిపోయింది. అన్ని స్కూళ్లల్లో కూడా ఇదే స్థాయిలో ఫీజులు ఉన్నాయి. ఒకటో తరగతిలో చేర్పించేందుకు రిజిస్ట్రేషన్ ఫీజులు రూ.2 వేలు, అడ్మిషన్ ఫీజు రూ.40 వేలు, రిఫండబుల్ కాషన్ మనీ రూ.ఐదు వేలు. వార్షిక ఫీజు రూ.2.52 లక్షలు, బస్ చార్జీలు రూ. 1.08 లక్షలు, బుక్స్, యూనిఫామ్ రూ.20 వేలు కలిపితే ఏడాదికి రూ.4.27 లక్షలు' అని ఆవేదన చెందాడు. ఏటా రూ.20 లక్షలు సంపాదిస్తున్న వారు కూడా ఈ స్కూల్లో తమ పిల్లలను చదివించేందుకు వెనకాడతారని అన్నాడు. ఏటా రూ.20 లక్షల ఆదాయం ఉన్న వారు 30 శాతం ప్లస్ సెస్ పన్ను కేటగిరీ పరిధిలోకి వస్తారు కాబట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిధిలోకి రారు. అలా అని ధనికులకు లభించే ఇతర ఉచితాలు లేదా లోన్ల మాఫీ వంటివేవి వీళ్లకు రావు' అని వాపోయాడు. ఇవన్నీ పోగా మిగిలిన 10 లక్షల్లో తిండి, బట్ట, అద్దె లేదా ఈఎమ్ఐలు కట్టుకోవాలి అంటూ అతడు తన పోస్టు ముగించాడు. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఈ పోస్టుకు మిలియన్ల కొద్దీ వ్యూస్ వస్తున్నాయి. అనేక మంది రిషబ్ అభిప్రాయాలతో ఏకీభవించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.